సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 239 | శనివారం | 21-02-2026 | హైదరాబాద్ | Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12 | వెల రూ. 5.00

భారత్,అమెరికా ఒప్పందంతో 'డేటా కాలనీ'గా దేశం 05

తప్పుడు సమాచారం పట్ల జాగ్రత్త

ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆందోళన



## ట్రంప్ అదనపు సుంకాలు కొట్టివేత

- అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- ప్రత్యేక టారిఫ్‌లు విధించే అధికారం దేశాధ్యక్షుడికి లేదని స్పష్టీకరణ

**వాషింగ్టన్:** వివిధ దేశాలపై సుంకాలతో విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చుక్కెదురైంది. పెంచిన పలు టారిఫ్‌లను అమెరికా సుప్రీం కోర్టు కొట్టివేసింది. ట్రంప్ జాతీయ అత్యవసర పరిస్థితి పేరుతో విధించిన విస్తృత సుంకాలు ఆయన అధికార పరిధిని మించి ఉన్నాయని కోర్టు నిర్ధారించింది. ఇది ఆయన రెండో పదవీకాలంలో ఎదురైన అరుదైన న్యాయపరమైన వెనుకడుగుగా పరిశీలకులు పేర్కొంటున్నారు. ఈ కేసులో ప్రధానంగా 1977లో అమల్లోకి వచ్చిన ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్ (ఐఇఇపిఎ) చట్టాన్ని ట్రంప్ ప్రభుత్వం ఎలా వినియోగించిందన్న అంశం పరిశీలనకు వచ్చింది. ఆ చట్టం ప్రకారం, దేశానికి అసాధారణ, అత్యవసరమైన ముప్పు ఉందని అధ్యక్షుడు ప్రకటించిన సందర్భంలో దిగుమతులు, ఎగుమతులను నియంత్రించడానికి కొన్ని అధికారాలు ఉంటాయి. అయితే ఆ చట్టంలో సుంకాలు విధించే అధికారం స్పష్టంగా పేర్కొనబడలేదు. అయినప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం ఈ చట్టాన్ని ఆధారంగా తీసుకొని ప్రపంచ దేశాలపై విస్తృత సుంకాలు విధించింది. సుప్రీంకోర్టు 6:3 మెజారిటీతో ఇచ్చిన తీర్పులో ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ వెల్లడించిన అభిప్రాయం కీలకమైంది. అధ్యక్షుడు ఎలాంటి కాలపరిమితి లేకుండా, విస్తృత స్థాయిలో సుంకాలు విధించే అసాధారణ అధికారం తనకు ఉందని తరువాయి 12లో



## ఎఐ పరిణామాల నిశిత పర్యవేక్షణకు జాతీయ ఎఐ వార్ రూమ్

- భారతదేశాన్ని ప్రపంచ ఎఐ పవర్‌హౌస్‌గా నిర్మించాలి
- తెలంగాణలో ఎఐ స్టార్టప్ విలేజ్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం
- ఢిల్లీలో ఎఐ సమ్మిట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌కు ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం

ప్రజాపక్షం/హైదరాబాద్

సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడే విధంగా కృత్రిమ మేధస్సు (ఎఐ) అభివృద్ధి ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఎఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్రం రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఎఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సిఎం ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఎఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఎఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సిఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం తరువాయి 2లో



## రాష్ట్ర బడ్జెట్ రూ.3.15 లక్షల కోట్లు?

- వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ తుది మెరుగులు
- సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట
- మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు

### సన్నవడ్లకు బోనస్, 18ఏళ్లు నిండిన మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, పింఛన్లు 4 వేల పెంపుపై దృష్టి !

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వార్షిక బడ్జెట్(2026–27) ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ తుది మెరుగులు దిద్దుతోంది. ఇప్పటికే కసరత్తు పూర్తి చేసిన ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ నెల 28న శాసనసభలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) రూ.3.04లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టగా, 2026–27 బడ్జెట్ రూ.3.15 లక్షల కోట్ల నుండి రూ.3.25 లక్షల కోట్ల మధ్య ఉంటుందని అంచనా. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా ప్రీ బడ్జెట్ సమావేశాలను పూర్తి చేశారు. అన్ని శాఖల మంత్రులు, అధికారులతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించారు. 2026–2027 బడ్జెట్‌లో సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. రైతు సంక్షేమం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. ముఖ్యంగా సన్న బియ్యం పండించే రైతులకు బోనస్, 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ. 2,500ల ఆర్థిక సాయం, పెన్షన్లను రూ.4వేలకు పెంపు తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సమాచారం. రాష్ట్రం అధిక అప్పు, పరిమిత ఆదాయ సమస్య తదితర పలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొనసాగుతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి తగినంత తరువాయి 2లో




## రాష్ట్రానికి మరో రూ.387.53 కోట్లు విడుదల

- '15వ ఆర్థిక సంఘం' నిధులు విడుదల చేసిన కేంద్రం
- పెండింగ్‌లో మరో రూ.2వేల కోట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రామ పంచాయతీల ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో '15వ ఆర్థిక సంఘానికి' సంబంధించిన పెండింగ్ నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఇందులో భాగంగా మూడో విడతగా తెలంగాణ రాష్ట్రానికి రూ. 387.53 కోట్లను కేంద్రం విడుదల చేసింది. దీంతో ఇప్పటి వరకు రాష్ట్రానికి మొత్తం రూ. 1034.42 కోట్ల నిధులు అందాయి. కాగా మరో రూ. 2వేల కోట్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా కొనసాగేందుకు ఈ నిధులు కీలకంగా ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, తరువాయి 12లో



## విజె సాయి కెమికల్ కంపెనీలో అగ్ని ప్రమాదం

03 కార్మికుడి సజీవదహనం

## 'పాక్స్ సిలికా'లోకి భారత్



**న్యూఢిల్లీ :** అమెరికా నేతృత్వంలోని వ్యూహాత్మక కూటమి 'పాక్స్ సిలికా'లో భారతదేశం శుక్రవారం చేరింది. ఇది కీలకమైన ఖనిజాలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)తో కూడిన స్థిరమైన సప్లయ్ చైన్‌ను నిర్మించే లక్ష్యంతో ఏర్పడింది. 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో జరిగిన కార్యక్రమంలో ఈ సంకీర్ణ కూటమిలో చేరే ఒప్పందంపై సంతకాలు జరిగాయి. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మే షన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్, యుఎస్ అండర్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఎకనామిక్ అఫైర్స్ జాకబ్ హె ల్‌బర్గ్, భారతదేశంలో యుఎస్ రాయబారి సెర్గి యో గోర్ తదితరులు హాజరయ్యారు.ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి, తీవ్ర ఒత్తిడి అనంతరం ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేసుకోవడానికి అనేక చొరవలను ముందుకు తీసుకెళ్లడానికి ఇరువైపులా కొనసాగిన ప్రయత్నాల నేపథ్యంలో సంకీర్ణంలో చేరాలనే నిర్ణయం జరిగింది. 'పాక్స్ సిలికాలో భారతదేశం ప్రవేశించడం కేవలం ఒక ప్రతీకాత్మక చర్య మాత్రమే కాదు. ద్వైపాక్షిక సంబంధాల మొత్తం పథాన్ని మరింత బలోపేతం చేసే వ్యూహాత్మక చర్య' అని అమెరికా రాయబారి గోర్ వ్యాఖ్యానించారు. పాక్స్ సిలికా రూపకల్పన కింద భారతదేశంతో విశ్వసనీయ ఎఐ టెక్నాలజీలను అమెరికా పంచుకోవచ్చని సెర్గియో గోర్ సూచించారు. సంకీర్ణంలో చేరాలనే భారత్ నిర్ణయాన్ని అమెరికా అండర్ సెక్రటరీ జాకబ్ హెల్‌బర్గ్ ప్రశంసించారు. పాక్స్ సిలికా సభ్యదేశాలలో ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్, జపాన్, ఖతార్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్ ఉన్నాయి. వ్యూహాత్మక కూటమిలో చేరాలని ఢిల్లీని ఆహ్వానించినట్లు అమెరికా రాయబారి సెర్గియో గోర్ గత నెలలో ప్రకటించిన విషయం తెలిసిందే.

## 'వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్' బిల్లు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

- వర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేసే కుట్ర
- పేద వర్గాలను ఉన్నత విద్యకు దూరం చేసే బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి
- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్ డిమాండ్




ప్రజాపక్షం/నిజామాబాద్

కేంద్ర బిజెపి సర్కారు 'విబిఎస్ఎ– 2025' బిల్లు తీసుకువచ్చి కేంద్రం తన స్వంత ఎజెండాను వర్సిటీలలో అమలు పర్చేందుకు కుట్రలు చేస్తుందని, వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ (విబిఎస్ఎ) బిల్లు 2025 పేరుతో యూనివర్సిటీలను దెబ్బ తీసి ఉన్నత విద్యకు పేద వర్గాలను దూరం చేస్తోందని, విబిఎస్ఎ బిల్లు, యుజిసి నూతన మార్గదర్శకాలు రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్, జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గోనేరెడ్డి కళ్యాణ మండపంలో 3వ రోజు జరిగిన ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రతినిధులు మహాసభలకు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బానోత్ రఘురాం, బొజ్జ జ్యోతిల అధ్యక్షత వర్గంగా వహించారు. ఈ మహాసభల ముఖ్యఅతిథులుగా ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు, మాజీ రాష్ట్ర నాయకులు ఇటి నర్సింహ, విశిష్ట అతిథులుగా ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ సిరంగరాజ్, ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్, జాతీయ నాయకులు బందెల నాసర్ జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ సిరంగరాజ్ మాట్లాడుతూ దేశంలో 12 ఏళ్ల కాలంగా అధికారంలో ఉన్న మోదీ దేశ విద్యారంగాన్ని కార్పొరేట్, మతోన్మాద విధానాలు అమలు చేస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్, ప్రైవేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను దెబ్బ తీసేలా పాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగమే విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తూ జాతీయ విద్యావిధానం పేరుతో విద్య కాషాయీకరణకు పూనుకున్నారని ఆరోపించారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ దేశ విద్య రంగాన్ని కార్పొరేట్, మతోన్మాద విధానాలు అమలు చేస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్, ప్రైవేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు చేస్తుందని విమర్శించారు. దేశంలో ప్రభుత్వపాఠశాలలను 93,000 పైగా మూసివేసి ప్రభుత్వ పాఠశాల విద్య కూడా పేదలకు అందకుండా చేస్తోందని, బిజెపి పరిపాలన తరువాయి 12లో



## ఎసిబి వలలో కోర్టు సిబ్బంది

- భూపాలపల్లి జిల్లా కోర్టులో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు

ప్రజాపక్షం/భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టులో ఎసిబి అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటుండా ముగ్గురు కోర్టు సిబ్బందిని అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నా రు. ఎసిబి డిఎస్‌పి సాంబయ్య వివరాలను మీడియాకు వెల్లడించారు. జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్‌గా పని చేస్తున్న పాలకుర్తి సాయి చరణ్, పున్నం రజిత, కొమ్ము సునీతల ఐదు వేలు లంచం తీసుకుంటూ ఉండగా తరువాయి 12లో

## ప్రభుత్వంలో టిజిఎస్ ఆర్‌టిసి విలీనం ఇంకెప్పుడు?



### 24న 'చలో సెక్రటేరియెట్'కు సిద్ధమవుతున్న కార్మికులు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ జీవనాడి అయిన రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో ఆర్‌టిసికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మికులు గళమెత్తుతున్నారు. ముఖ్యంగా ఈ నెల 24న నిర్వహించనున్న 'చలో సెక్రటేరియెట్' కార్యక్రమం ద్వారా తమ ఆవేదనను ప్రభుత్వానికి వినిపించేందుకు ఆర్‌టిసి జెఎసి సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది ఆర్‌టిసి కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటారని సమాచారం. గతంలో ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు బిల్లు ఆమోదం పొందినా, క్షేత్రస్థాయిలో అది పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్‌టిసిని ప్రభుత్వ సంస్థగా పూర్తిస్థాయిలో గుర్తించి, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. విలీనం జరిగితేనే కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు.

**ఉచిత బస్సు పథకంతో పెరుగుతున్న ఒత్తిడి..**

'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం శుభపరిణామమే అయినా, దానికి తగిన మౌలిక తరువాయి 2లో

## ఇండోనేషియాతో యుఎస్ వాణిజ్య ఒప్పందం




**వాషింగ్టన్:** ఇండోనేషియాతో అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బోర్డ్ ఆఫ్ పీస్ సమావేశంలో పాల్గొనడానికి ఇక్కడికి వచ్చిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో, ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. అధికారిక ప్రకటనను అనుసరించి, ఇండోనేషియా అమెరికా వస్తువులలో 99 శాతం మీద ఉన్న దిగుమతి సుంకాలను తొలగించనుంది. అయితే అమెరికా, ఇండోనేషియా ఉత్పత్తులపై 19 శాతం సుంకాలను కొనసాగిస్తుంది. అలాగే కీలక ఖనిజాలు, ఇతర పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులపై ఉన్న పరిమితులను సడలించేందుకు ఇండోనేషియా అంగీకరించింది. ఇరు దేశాల కంపెనీలు సోయాబీన్స్, మొక్కజొన్న, పత్తి, గోధుమల కొనుగోలు సహా సుమారు 38.4 బిలియన్ డాలర్ల విలువైన 11 ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి బోర్డ్ ఆఫ్ పీస్ సమావేశంలో సుబియాంతో పాల్గొన్నారు. గాజాలో స్థిరీకరణ దళానికి 8,000 మంది సైనికులను పంపేందుకు సిద్ధమని ఆయన ప్రకటించారు. ఈ వాణిజ్య ఒప్పందం ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా, అమెరికా–చైనా పోటీ నేపథ్యంలో కీలక ఖనిజాల సరఫరా భద్రతకు కూడా దోహదపడుతుందని భావిస్తున్నారు.

# అమెరికా ద్వంద్వ ప్రమాణాలు

## సౌదీ అరేబియాతో అణు చర్చలపై భయాందోళనలు

**దుబాయ్:** అణు ఒప్పందాలు.. యురేనియం నిక్షేపాల విషయంలో అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సౌదీ అరేబియాతో జరుగుతున్న అణు చర్చలు... ఇరాన్‌పై తీసుకుంటున్న కఠిన వైఖరి... ఇందుకు ప్రతీకలు. ఒక వైపు, అమెరికా సౌదీ అరేబియాకు యురేనియం సమృద్ధి సాంకేతికత అందించే అవకాశాన్ని పరిశీలిస్తోంది. మరోవైపు, అదే సమృద్ధి కార్యక్రమం కారణంగా ఆంక్షలు విధిస్తామని, సైనిక చర్య తప్పదని హెచ్చరికలు జారీ చేస్తున్నది. పది రోజుల్లోగా తమతో ఒప్పందం కుదుర్చుకోకపోతే, తీవ్ర పరిణామాలు తప్పవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. అమెరికన్ కాంగ్రెస్ పత్రాలను అనుసరించి, ట్రంప్ సర్కారు ప్రపంచవ్యాప్తంగా 20అణు ఒప్పందాలు కుదుర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ జాబితాలో సౌదీ అరేబియా ఒకటి. ప్రతిపాదిత ఒప్పందం ద్వారా సౌదీ భూభాగంలో యురేనియం సామర్థ్యం విపరీతంగా పెరిగే అవకాశం ఉందని ఆయుధ నియంత్రణ సంస్థ (ఎసిఎ)కు చెందిన నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్షణ ఒప్పందాలు ఉన్నప్పటికీ, ఒకసారి సమృద్ధి సాంకేతికతకు అవకాశం ఏర్పడితే, భవిష్యత్తులో ఆయుధీకరణ ప్రమాదం పూర్తిగా నిరాకరించలేమని నిపుణులు అంటున్నారు. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఇప్పటికే ఇరాన్ అణుబాంబు సాధిస్తే తామూ అదే దిశగా వెళ్తామని స్పష్టం చేశారు. అంతేకాక, సౌదీ అరేబియా అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన పాకిస్తాన్‌తో పరస్పర రక్షణ ఒప్పందం కుదుర్చుకోవడం ప్రాంతీయ భద్రతా సమీకరణాలను మరింత క్లిష్టతరం చేసింది. పాకిస్తాన్ రక్షణ మంత్రి అవసరమైతే తమ అణు కార్యక్రమాన్ని సౌదీకి అందుబాటులో ఉంచుతామని చెప్పడం, ఆయుధ వ్యాప్తి భయాలను పెంచింది. ఇదే సమయంలో, ఇరాన్‌పై అమెరికా మరింత కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇరాన్ ఇప్పటికే 60శాతం స్థాయికి యురేనియం శుద్ధిని సమృద్ధి చేసిందని, ఇది 90శాతానికి చేరితే, అణ్వస్త్ర తయారీ సాధ్యమవుతుందని అమెరికాతోపాటు పాశ్చాత్య దేశాలు కూడా అంటున్నాయి. ఈ పరిణామాలను తీవ్రమైన భద్రతా ముప్పుగా పేర్కొంటున్నాయి. అయితే ఇరాన్ తన అణు కార్యక్రమం శాంతియుతమని వాదిస్తోంది. ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఎఇఎ) పర్యవేక్షణలో ఇరాన్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ సౌదీ విషయంలో అదే ప్రమాణాలు ఎంత కఠినంగా అమలు అవుతాయన్నది స్పష్టంగాలేదు. యురేనియం శుద్ధి స్థాయి, అత్యాధునిక సాంకేతికత అనేవి రెండు అంచుల కత్తిలా పని చేస్తాయి. దీనిని విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించుకోవచ్చు. అయితే, ఆయుధ తయారీకి కూడా ఇదే సాంకేతికత ఉపయోగపడుతదంఇ. ఇరాన్ విషయంలో అమెరికా దీనిని ప్రమాదకరంగా పరిగణిస్తే, సౌదీ విషయంలో అదే సూత్రాన్ని పాటించడం లేదు. సౌదీ అరేబియాతో ఒప్పందాన్ని వ్యాపార, భౌగోళిక రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా సడలింపులు ఇస్తున్నది. ఇది అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలకు తిరుగులేని నిదర్శనం. ఏదిఏమైనా, అమెరికా తన వ్యూహాత్మక మిత్రదేశాలకు ఒక విధమైన సడలింపు, ప్రత్యర్థి దేశాలకు మరొక విధమైన కఠిన విధానం అనుసరిస్తోందనే భావన ప్రపంచ దేశాల్లో క్రమంగా బలపడుతోంది. అణు వ్యాప్తి నిరోధం నిజంగా లక్ష్యమైతే, సమాన ప్రమాణాలు, పారదర్శక నియంత్రణలు, అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబాట్లు అన్ని దేశాలకూ సమానంగా వర్తించాలి. ఇరాన్‌కు ఒక రకంగా, సౌదీ అరేబియాకు మరో రకంగా కాదు.





## ఉత్తర కొరియా అధికార వర్కర్స్ పార్టీ మహాసభ ప్రారంభం

**ప్యాంగ్యాంగ్:** ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌లో అధికార వర్కర్స్ పార్టీ మహాసభ ప్రారంభమైంది. ఈ సమావేశంలో నాయకుడు కిమ్ జాంగ్ ఉన్ వచ్చే ఐదేళ్ల కాలానికి తమ దేశీయ, విదేశాంగ విధానాలకు రూపకల్పన చేసి, ఆమోదింప చేసుకుంటారని సమాచారం. కాగా, 2021లో కరోనా ప్రభావం మధ్య జరిగిన మహాసభ తరువాత దేశం ఆర్థికంగా పురోగతి సాధించిందని, రాష్ట్ర స్థానం తిరుగులేని విధంగా బలపడిందని కిమ్ పేర్కొన్నారు. సామ్యవాద నిర్మాణాన్ని వేగవంతం చేయడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం తమ ముందున్న ప్రధాన లక్ష్యాలని ఆయన అన్నారు. ప్రభుత్వ మీడియా 'కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ' ప్రకారం, ఈ ప్రసంగంలో అమెరికా, దక్షిణ కొరియాతో ఉన్న ఉద్రిక్తతలపై లేదా అణు కార్యక్రమంపై ప్రత్యక్ష వ్యాఖ్యలు లేవు. అయితే గత కొన్నేళ్లుగా ఉత్తర కొరియా రష్యాతో సంబంధాలను బలోపేతం చేస్తూ, ఉక్రేన్ యుద్ధ నేపథ్యంలో మాస్కోకు సైనిక సహాయం అందించినట్లు అంతర్జాతీయ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో చైనాతో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించడం ఆర్థిక పునరుద్ధరణకు దోహదపడిందని నిపుణుల అభిప్రాయం. సుమారు 5,000 మంది ప్రతినిధులు పాల్గొంటున్న ఈ మహాసభలో అణు, క్షిపణి సామర్థ్యాల విస్తరణపై తదుపరి కార్యాచరణ ప్రకటించే అవకాశముంది. అలాగే కిమ్ కుమార్తె కిమ్ జూ అయ్‌ని వారసురాలిగా ప్రోత్సహించే సంకేతాలు ఇవ్వవచ్చని దక్షిణ కొరియా గూఢచారి సంస్థ అంచనా వేస్తోంది. అమెరికాతో 2019 నుంచి నిలిచిపోయిన రాజనీతిక చర్చలు ఇంకా పునరుణకు నోచుకోలేదు. దీంతో కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

## శరణార్థులపై మరింత కఠినం

ఆదేశాలు జారీ చేసిన అమెరికా ప్రభుత్వం




**మిన్నియాపోలిస్:** అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం శరణార్థులపై మరింత కఠినంగా వ్యవహరించేలా కొత్త ఆదేశాన్ని జారీ చేసింది. ఈ ఆదేశం ప్రకారం, అమెరికాలో చట్టబద్ధంగా ఉంటున్నప్పటికీ, ఇంకా శాశ్వత నివాస హక్కును కల్పించే గ్రీన్ కార్డ్‌ను పొందిన శరణార్థులను, వారు దేశంలో ప్రవేశించిన ఒక సంవత్సరం పూర్తయ్యాక అధికారులు మళ్లీ ఫెడరల్ కస్టడీలోకి తీసుకొని వారి దరఖాస్తులను సమీక్షించవచ్చు. ఈ విషయాన్ని మిన్నెసోటాలో జరిగిన ఫెడరల్ కోర్టు విచారణకు ముందుడిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ దాఖలు చేసిన మెమోలో పేర్కొంది. సమీక్ష ప్రక్రియ పూర్తయ్యే వరకు కస్టడీలో ఉంచే అధికారం తమకు ఉందని తెలిపింది. ఈ నిర్ణయం దాదాపు 2 లక్షల శరణార్థుల్లో ఆందోళన, అయోమయం సృష్టించింది. ముఖ్యంగా జో బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న కాలంలో అమెరికాకు వచ్చిన శరణార్థులపై తీవ్ర ప్రభావం ఉండవచ్చని అంటున్నారు. మిన్నెసోటా ఫెడరల్ న్యాయమూర్తి జాన్ టన్‌హీన్ ఇప్పటికే అక్కడి శరణార్థులను అరెస్ట్ చేయకుండా తాత్కాలిక రక్షణ ఉత్తర్వు జారీ చేశారు. శరణార్థులు ఒక సంవత్సరం పూర్తయ్యాకే గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటారని, అదే సమయంలో నిర్బంధం తప్పనిసరి చేయడం తార్కికం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక శరణార్థుల హక్కుల కోసం పనిచేసే హెచ్‌ఐఎస్ వంటి సంస్థలు ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం జాతీయ భద్రత, ఆర్థిక కారణాలు చూపుతున్నప్పటికీ, నిపుణుల ప్రకారం శరణార్థులు ఇప్పటికే కఠిన పరిశీలన తర్వాతే దేశంలోకి వచ్చేందుకు అనుమతి పొందుతారు. ఆపరేషన్ పారిస్ పేరిట మిన్నెసోటాలో వేలాది కేసులను మళ్లీ సమీక్షించడం, వేలాది ఫెడరల్ అధికారులను మోహరించడం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. కాగా, అమెరికా ప్రభుత్వం తీసుకున్న ఈ కొత్త విధానం కోర్టుల్లో సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది.

## జెఫ్రీపై వచ్చిన ఆరోపణల విచారణ పునఃప్రారంభం

**అల్‌బుకెర్కీ:** దివంగత ఆర్థికవేత్త జెఫ్రీ ఎప్‌స్టైన్ కొనుగోలు చేసిన జొర్రో రాంచ్ ఆస్తులు, అప్పట్లో వెల్లువెత్తిన అక్రమాల ఆరోపణలను అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్ర అటార్నీ జనరల్ రాల్ టోరెజ్ మళ్లీ విచారిరిస్తున్నారు. జెఫ్రీ పలు అక్రమ కార్యకలాపాలకు పాల్పడినట్టు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన ఎఫ్‌బీఐ పత్రాలను పరిశీలించిన తరువాత, అప్పటి కేసును మరోసారి విచారించాలని నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. 2019లో న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్ల అభ్యర్థనపై రాష్ట్ర స్థాయి విచారణను నిలిపివేశారు. అయితే తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాలు మరింత దర్యాప్తు అవసరమని రాష్ట్ర న్యాయ శాఖ భావిస్తోంది. రాష్ట్ర న్యాయ శాఖ ప్రకారం, ఈ కేసును సంపూర్ణంగా విచారించలేదని, కాబట్టి, అప్పటి ప్రాసిక్యూషన్ పత్రాలను వెంటనే అప్పగించాలని కోర్టును టోరెజ్ కోరారు. వివిధ సంస్థలతో కలిసి ఈ కేసును మళ్లీ విచారిస్తున్నట్టు తన అభ్యర్థన పత్రంలో ఆయన పేర్కొన్నారు. రాంచ్‌లో లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా వంటి ఘటనలు నిజంగానే జరిగాయా? లేదా? అనే అంశంపై టోరెజ్ నేతృత్వంలో దర్యాప్తు జరుగుతుంది. జెఫ్రీపై న్యూ మెక్సికోలో కేసులు నమోదు కాకపోయినప్పటికీ, 2019లో కొంత మంది బాధితులను అధికారులు విచారించినట్లు అప్పట్లో ధృవీకరించారు. జెఫ్రీ 1993లో, రాంచ్‌లో జెఫ్రీ భారీగా ఆస్తులు కొన్నాడు. అక్కడ ఒక విలావంతమైన భవనాన్ని కూడా నిర్మించాడు. 2023లో ఈ ఆస్తులను అమ్మకానికి పెట్టగా, డాన్ హఫైన్స్ కుటుంబం కొనుగోలు చేసింది. వారు దీనిని సాన్ రాఫెల్ రాంచ్‌గా పునర్నామకరణ చేసి క్రైస్తవ శిబిరంగా నిర్వహించాలనుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైతే విచారణకు పూర్తి సహకారం అందిస్తామని యజమానుల ప్రతినిధులు పేర్కొన్నారు.



## ఎఐ వార్ రూమ్ (మొదటి పేజీ తరువాయి)

యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న కృత్రిమ మేధస్సు (ఎఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో 'ప్రత్యేక ఎఐ మంత్రిత్వ శాఖ'ను ఏర్పాటు చేయాలని సిఎం అన్నారు. ఎఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఎఐ సమ్మిట్‌లో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్‌నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో సిఎం గుర్తు చేశారు. ఎఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని అన్నారు. ప్రపంచంలో ఎఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని, కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సిఎం చెప్పారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని సిఎం హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.దేశానికి తక్షణ జాతీయ ఎఐ రోడ్‌మ్యాప్ అవసరమని సిఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. ఎఐ అభివృద్ధి ప్రతి దశలో సెమీకండక్టర్ చిప్ తయారీ, జిపియు సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ వినియోగం, ఎఐ ప్లాట్‌ఫారమ్‌లు, అప్లికేషన్ల విషయంలో భారత్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని సిఎం సూచించారు.

**జాతీయ ఎఐ నిధి ఏర్పాటు చేయాలి**

ఎఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ, కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ చర్యల ద్వారా ఎఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. యువతను ఎఐ ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని సిఎం పిలుపునిచ్చారు. స్టార్టప్లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఎఐ నిధి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఎఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే ఎఐ స్టార్టప్ విలేజ్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఎఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఎఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని సిఎం కోరారు.

## లక్షల కోట్లు ?

(మొదటి పేజీ తరువాయి)

కేటాయింపులు చేయడానికి వీలుగా వివిధ శాఖల అవసరాలను అంచనా వేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీల అమలుపై దృష్టి సారిస్తూనే ఆ ప్రధాన రంగాలకు కేటాయింపులను హేతుబద్ధీకరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఆర్థిక శాఖ అధికారుల అంచనా ప్రకారం డిసెంబర్ చివరి వరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.1.9 లక్షల కోట్లుగా నమోదైనట్లు తెలిసింది. ఇది బడ్జెట్‌లో అంచనా వేసిన రూ.2.84 లక్షల కోట్లలో 67.01 శాతం. వసూళ్లలో ఎక్కువ భాగం, అంటే మూడింట ఒక వంతు, రూ.65,930 కోట్ల రుణాల రూపంలో ఉంది. బడ్జెట్ అంచనాలలో రూ.1.75 లక్షల కోట్లతో పోలిస్తే, మూడవ త్రైమాసికం చివరి వరకు పన్ను ఆదాయాలు రూ.1.13 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఆదాయం రాబడి అంచనాలలో 80 శాతం కంటే ఎక్కువగా ఉండటంతో చివరి త్రైమాసికంలో పన్ను ఆదాయాలు గణనీయంగా మెరుగుపడతాయని అధికారులు విశ్వసిస్తున్నారు. ఇక కేంద్ర పన్నులలో రాష్ట్రం తన వాటాగా రూ.14,982 కోట్లు పొందింది, ఇది అంచనా వేసిన రూ.21,195 కోట్లలో 70.9 శాతం కాగా నాలుగవ త్రైమాసికంలో ఈ మొత్తం పెరిగే అవకాశం ఉందని ఆర్థిక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

**కేంద్రం నుంచి గరిష్ట నిధులు సాధించాలి**

కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఇతర కేంద్ర ప్రభుత్వ వికేంద్రీకరణల ద్వారా గరిష్ట నిధులను పొందడంపై దృష్టి పెట్టాలని అధికారులను ఇప్పటికే సిఎం ఆదేశించారు. తద్వారా రుణాలపై ఆధారపడటం, వడ్డీ చెల్లింపు భారం ఆ మేరకు తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 2026–27లో కేంద్ర పన్నుల వాటాలో స్వల్ప పెరుగుదల రూ.33,181కోట్లకు పెరుగుతుందని ఆశిస్తున్నారు. ఆర్థిక సంఘం దాదాపు రూ 6 వేల కోట్లు అందిస్తుందని భావిస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దగా ప్రయోజనాలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపుల ఖరారులో జాగ్రత్తగా ఉండాలని నిర్ణయించింది.

### ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను పర్యవేక్షణకు

## న్యాయాధికారులను నియమించండి

**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా పరిశుభ్రత ప్రక్రియలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ మధ్య పరస్పర నిందారోపణలు చోటుచేసుకోవడం, ఎస్ఐఆర్ ప్రక్రియపై సంక్లిష్ట పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో సుప్రీంకోర్టు శుక్రవారంనాడు సంచలన నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితాల సవరణపై దురదృష్టకరమైన విమర్శల ఆట కొనసాగుతోందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు న్యాయాధికారులను నియమించాలని కోల్‌కతా హైకోర్టును ఆదేశించింది. ఎస్ఐఆర్‌లో అభ్యంతరాలు, వివాదాలను జ్యుడిషియల్ ఆఫీసర్లు పరిష్కరిస్తారని పేర్కొంది. 'రాజ్యాంగబద్ధ వ్యవస్థలైన రాష్ట్రం, ఎన్నికల కమిషన్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం నడుస్తోంది. దీంతో ఎస్ఐఆర్ ప్రక్రియ అభ్యంతరాలు, వివాదాల మధ్య చిక్కుకుంది' అని సిజెఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కోసం పనిచేస్తున్న జిల్లా జడ్జి హోదాలో ఉన్న మాజీ న్యాయాధికారులను కూడా ఈ ప్రక్రియ కోసం నియమించాలని, అసాధారణ పరిస్థితుల కారణంగా అసాధారణ ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చిందని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయాధికారుల నియామకం, బాధ్యతలకు సంబంధించి సమగ్ర ప్లాన్ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో శనివారంనాడు సమావేశం కావాలని ఎన్నికల కమిషనర్, చీఫ్ సెక్రటరీ, పోలీస్ చీఫ్, ఇతర ఉన్నతాధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. జ్యుడిషియల్ ఆఫీసర్లు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితిని సృష్టించడంపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు వేసింది. 'రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఆశించాం. అయితే కమ్యూనికేషన్ విషయంలో వ్యవహరించే తీరు ఇదేనా? ఫిబ్రవరి 9వ తేదీ ఆదేశాలకు ఫిబ్రవరి 17న స్పందించారు. 8,500 ఆఫీసర్లను పంపామంటారు.

## అక్రమ ఇసుక తవ్వకాలపై విజిలెన్స్ దాడులు



4 వాహనాలు సీజ్, 19 మంది అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం భారీ స్థాయిలో చర్యలు చేపట్టింది. గురు, శుక్ర వారాల్లో వరుసగా నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో మూడు జిల్లాల్లో కొనసాగుతున్న ఇసుక మాఫియా నెట్‌వర్క్‌ను ఛేదించామని విజిలెన్స్ డిజి శిఖాగోయల్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భారీ యంత్రాలు, వాహనాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు పలువురిని అరెస్టు చేశామన్నారు.విశ్వసనీయ సమాచారం ఆధారంగా కరీంనగర్, వరంగల్, ఆర్‌సి పురం ప్రాంతాలకు చెందిన విజిలెన్స్ బృందాలు సమన్వయంతో జగిత్యాల, హనుమకొండ, నిజామాబాద్ జిల్లాల్లోని కీలక మండలాల్లో దాడులు నిర్వహించాయి. జగిత్యాల జిల్లా బొమ్మెన గ్రామం, హనుమకొండలో కక్కిరాలపల్లి ఎక్స్ రోడ్డు–ఆకేరువాగు పరిసరాలు, నిజామాబాద్ జిల్లా సిరికొండ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు

**245 మెట్రిక్ టన్నుల ఇసుక స్వాధీనం**

అక్రమ తవ్వకాల కోసం ఉపయోగిస్తున్న మొత్తం 24 వాహనాలను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీటిలో 6ఎక్స్కవేటర్లు, 2లారీలు, 1టిప్పర్, 15 ట్రాక్టర్లు ఉన్నాయి. అదనంగా చట్టవిరుద్ధంగా తవ్విన సుమారు 245 మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో నిర్వాహకులతో కలిపి 30 మంది నిందితులను గుర్తించగా, వారిలో 19 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

**పగలు నిల్వ రాత్రి తరలింపు: మాఫియా వ్యూహం బట్టబయలు**

దర్యాప్తులో ఇసుక సిండికేట్ అమలు చేస్తున్న ద్విదశ వ్యూహం బయటపడింది. పగటిపూట ట్రాక్టర్ల ద్వారా నదీ గర్భాల నుంచి ఇసుక తవ్వి సమీపంలోని ప్రైవేట్ పొలాల్లో నిల్వ చేస్తుండగా, రాత్రివేళల్లో భారీ జెసిబిలతో లారీలు, టిప్పర్‌లలో వేగంగా లోడ్ చేసి తరలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ విధంగా అధికారుల పర్యవేక్షణను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు గుర్తించారు.

రాష్ట్ర ఆస్తుల దోపిడీని అరికట్టడం, ప్రజా ఆదాయం పక్కదారి పడకుండా చూడడం తమ లక్ష్యమని విజిలెన్స్ డిజి శిఖాగోయల్ తెలిపారు. ప్రభుత్వ వనరులకు సంబంధించిన అక్రమాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇందు కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14432 ను విడుదల చేశారు.

## ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ పదవి బిసిలకు ఇవ్వాలి

బిసి నాయకులు యాదగిరిపై కిడ్నాప్ చేసి, దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే అరెస్టు చేయాలి

బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ పార్టీకి ఏ మాత్రం బిసిల పట్ల చిత్తశుద్ధి ఉన్న, తక్షణమే జోక్యం చేసుకొని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్‌గా బిసిలకు అవకాశం కల్పించాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. అలాగే బిసి నాయకులు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్ ఆకుల యాదగిరిని కిడ్నాప్ చేసి, దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం బిసి జెఎసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో జనరల్ స్థానం నుంచి కౌన్సిలర్‌గా గెలిచి, జనరల్ స్థానంలో మున్సిపల్ చైర్మన్ పదవి తనకు ఇవ్వాలని బిసి సమాజవర్గానికి చెందిన యాదగిరి అడిగినందుకు బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంఎల్ఎ మంచిరెడ్డి కిషన్ రెడ్డి జనరల్ స్థానంలో 'నువు బిసివి నీకెందుకు ఇస్తాం' అంటూ అవమానపరిచడమే కాకుండా యాదగిరిని కిడ్నాప్ చేసి, శారీరకంగా మానసికంగా హింసించిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి బిసిలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు.

**బిసిలు మున్సిపల్ చైర్మన్లు కాకూడదా? కెటిఆర్, సిఎం న్యాయం చేయాలి : ఆకుల యాదగిరి**

మూడుసార్లు కౌన్సిలర్‌గా, ఒకసారి ఎంపిటిసిగా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా సుదీర్ఘ కాలం పాటు నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తూ రాజకీయాలలో ఉన్న తనను బిఆర్ఎస్ నాయకుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అనగదొక్కాడని, మున్సిపల్ చైర్మన్ పదవి అడగగానే 'బిసిలకు ఎందుకు చైర్మన్ పదవి' అంటూ అవమానించడమే కాకుండా శారీరకంగా మానసికంగా తీవ్ర వేధింపులకు గురి చేశాడని, హైకోర్టు జోక్యంతో కిడ్నాప్ బారి నుండి బయటపడ్డానని ప్రస్తుత కౌన్సిలర్, బిసి నాయకుడు ఆకుల యాదగిరి అన్నారు.

ఇప్పటికైనా సిఎం రేవంత్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కెటిఆర్ స్పందించి ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్‌గా బిసికి అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కనకాల శ్యామ్ కుర్మా, బి. మనిమంజరి సాగర్, గొడుగు మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విలీనం ఇంకెప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాలు లేకపోవడం సిబ్బందికి శాపంగా మారింది. బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే అదనపు భారం పడుతోంది. రోజుకు 16 నుంచి 18 గంటల పాటు విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా డ్రైవర్లు, కండక్టర్లు గుండెపోటు వంటి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఆక్యుపెన్సీ రేషియోకు అనుగుణంగా ప్రభుత్వం నుండి రావాల్సిన రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ వినిపిస్తోంది.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు..**

- చిన్న చిన్న సాంకేతిక కారణాలతో (టికెట్ మెషిన్ పనిచేయకపోవడం వంటివి) ఉద్యోగాల నుంచి తొలగించిన వెయ్యి మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి.
- ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ పేరుతో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తీసుకోవడం మానేసి, పర్మినెంట్ నియామకాలు చేపట్టాలి. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా రద్దు చేసిన కార్మిక సంఘాలను పునరుద్ధరించాలి. రిటైర్ అయిన ఉద్యోగుల బెనిఫిట్స్, కార్మికులు దాచుకున్న పొదుపు డబ్బును వెంటనే విడుదల చేయాలి.
- ఆర్‌టిసి ఆస్తులను, రూట్లను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్రలు జరుగుతున్నాయని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల కోసం డిపోలను, మౌలిక సదుపాయాలను ఆర్‌టిసివే వాడుకుంటూ లాభాలను మాత్రం ప్రైవేట్ సంస్థలకు ఇచ్చే విధానాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన ఆర్‌టిసిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, బడ్జెట్ సమావేశాల్లో దీనిపై స్పష్టమైన ప్రకటన రావాలని సామాన్య ప్రజలు సైతం కోరుకుంటున్నారు.

**ఆర్‌టిసి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారించాలి: ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న**

కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి రెండు సంవత్సరాలు పూర్తయిన కూడా ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైంది. ఛలో సెక్రటేరియట్ కార్యక్రమంతో ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో మిలియన్ మార్చ్ తరహా ఉద్యమం చేపడతామని ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారణ చేపట్టేందుకు హైకోర్టు అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిర్మల్ జిల్లా ధర్మాసాగర్ చెరువు ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారణ చేపట్టేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అక్రమ నిర్మాణాలను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యానికి రెగ్యులర్ నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ధర్మసాగర్ చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, రక్షణ చర్యలు చేపట్టాలంటూ ఎన్.శ్రవణ్ పిల్ దాఖలు చేశారు. దీనికి నెంబర్ కేటాయించేందుకు రిజిస్ట్రీ అభ్యంతరం చెప్పడంపై ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. రిజిస్ట్రీ అభ్యంతరాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం తోసిపుచ్చింది. ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ అధికారులకు అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదంటూ న్యాయవాది వాదించారు. కొందరికి షోకాజ్ నోటీసులు జారీ చేసిన చర్యలు లేవన్నారు. అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని చెప్పారు. పిల్ ను విచారణ జరుపుతామని ధర్మాసనం ప్రకటించింది.

## ప్రొఫెసర్ ఖాసీంపై రెండు క్రిమినల్ కేసుల కొట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీంపై ఉన్న రెండు క్రిమినల్ కేసులను హైకోర్టు కొట్టివేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఖాసిం ఓయూ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారని పోలీసులు కేసులు నమోదు చేశారు. క్యాంపస్‌లో ఇటువంటి నిరసనలను నిషేధం ఉందని అభియోగం. ఈ కేసులను కొట్టివేయాలని కోరుతూ ఖాసీం వేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎన్.తుకారాంజీ విచారించారు. పిటిషనర్ న్యాయవాది వాదిస్తూ.. సీఆర్‌పీసీ సెక్షన్ 195 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్ప ఐపీసీలోని 188 సెక్షన్ కింద కేసు నమోదుకు వీలు లేదన్నారు. పోలీసుల చర్య చట్ట వ్యతిరేకమన్నారు. వాదనల తర్వాత హైకోర్టు.. రెండు కేసులను కొట్టివేస్తూ తీర్పు చెప్పింది.

## ట్రేడ్ యూనియన్ ఎన్నికలు జరపాలి

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసిలో ట్రేడ్ యూనియన్ చట్టం ప్రకారం వెంటనే ఎన్నికలు జరిపి ప్రజాస్వామ్యానికి పట్టం కట్టాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అడుగుజాడలలో నడుస్తు, ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఏ మాత్రం స్పందించకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి సిఎం రేవంత్‌రెడ్డికి ఎఐటియుసి సమర్పించిన మెమొరాండంలు బుట్ట దాఖలయ్యిందని ఆయన విమర్శించారు. కార్మికుల ఒక్క సమస్యను రేవంత్‌రెడ్డి సర్కార్ పరిష్కరించకుండా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను సమర్థిస్తున్నట్లుగా ఉందని మండిపడ్డారు. బస్సుల సంఖ్యను పెంచి ప్రజలకు మెరుగైన విధంగా సకల సౌకర్యాలు అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసికి రూ.350 కోట్ల బకాయిలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. బస్సు డిపోలను, ఉద్యోగస్తులను పెంచి ప్రజా రవాణాను మెరుగుపరిచి ప్రమాదాలను నివారించాలని బాల్ రాజ్ ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

## ముచ్చటగా మూడోసారి.. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన చార్జిషీట్ తిరస్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి పోలీసులు దాఖలు చేసిన ఛార్జ్ షీట్‌ను కోర్టు మరోసారి తిప్పి పంపింది. ఇప్పటికే రెండుసార్లు ఛార్జ్ షీట్‌ను రిటర్న్ చేసిన కోర్టు, తాజా దాఖలులో కూడా లోపాలు ఉన్నట్లు గుర్తించింది. ఈ కేసులో సినీ నటుడు అల్లు అర్జున్ సహా మొత్తం 23 మందిపై పోలీసులు అభియోగాలు నమోదు చేసి ఛార్జ్ షీట్ సమర్పించారు. అయితే దాఖలు చేసిన పత్రాలలో సరైన ఆధారాలు, సాక్ష్యాలు పూర్తి స్థాయిలో లేవని, సాంకేతిక లోపాలు ఉన్నాయని కోర్టు పేర్కొంది. ముఖ్యంగా కేసుకు సంబంధించిన ఎవిడెన్స్ మెటీరియల్, హార్డ్ డిస్కులు, సీడీలు, పెన్ డ్రైవ్‌లు, జతపరచలేదని కోర్టు గుర్తించింది. దీనితో ఛార్జ్ షీట్‌ను తిరిగి పంపిస్తూ, పూర్తి ఆధారాలతో మళ్లీ సమర్పించాలని పోలీసులను ఆదేశించింది.కోర్టు సూచనల మేరకు పోలీసులు లోపాలను సరిదిద్దుతూ మరోసారి నాంపల్లి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు సమాచారం. కేసు తదుపరి విచారణ కోర్టు ఆదేశాలపై ఆధారపడి ఉండనుంది.

## కర్రేగుట్టల్లో కూంబింగ్ ఆపరేషన్ ఆపండి: పోటు రంగారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ, చత్తీస్‌ఘడ్ సరిహద్దులలోని కర్రేగుట్టల్లో మావోయిస్ట్ నేతలను ఎరివేసేందుకు చేపట్టిన కుంబింగ్ ఆపరేషన్‌ను తక్షణమే ఆపాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం బస్తర్, ఛత్తీస్‌ఘడ్ కర్రెగుట్టల దండకారణ్యంలో మావోయిస్ట్‌లను ఎరివేస్తూ నరమేధానికి పాల్పడుతోందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్రేగుట్టల ఆపరేషన్‌ను ఆపాలని, అక్కడ శాంతియుత వాతావరణాన్ని కల్పించాలన్నారు. అటవీలోని విలువైన ఖనిజాలను కార్పొరేట్ వర్గాలకు అప్పగించే కుట్రలో భాగంగానే నరమేధం జరుగుతోందని ఆయన ఆరోపించారు. రాజ్యాంగబద్దంగా, ప్రజాస్వామికంగా పరిపాలించాల్సిన ప్రభుత్వం తన ప్రజల మీదనే యుద్ధం చేయడం అన్యాయమని, బిజెపి, కాంగ్రెస్ రెండూ ప్రభుత్వాలు తమ స్వభావాన్ని వ్యక్తం చేస్తున్నాయని మండిపడ్డారు.

## దక్షిణ ఆసియాలో అగ్ర మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్

### ఐదు జాతీయ ఎంవిటి కేంద్రాల్లో చోటు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ ప్రపంచ స్థాయి మెడికల్ వ్యాల్యూ టూరిజం కేంద్రంగా ఎదగడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి వి.క్రాంతి తెలిపారు. వైద్య సేవలు, పర్యాటకం, విమాన సదుపాయాల సమన్వయంతో హైదరాబాద్‌ను దక్షిణ ఆసియాలో అత్యంత సమగ్ర మెడికల్ వ్యాల్యూ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని తెలంగాణ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో టిజిటిడిసి ఎండి క్రాంతి అధ్యక్షతన నిర్వహించిన ఉన్నత స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రభుత్వ అధికారులు, వైద్య రంగ నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొని సమగ్ర మెడికల్ వ్యాల్యూ టూరిజం (ఎంవిటి) హబ్ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ, హైదరాబాద్‌కు ఉన్న ఆధునిక వైద్య సదుపాయాలు, నాణ్యమైన చికిత్స, తక్కువ ఖర్చు, ప్రపంచ స్థాయి ఆసుపత్రులు, పర్యాటక సౌకర్యాలు, అంతర్జాతీయ విమాన కనెక్టివిటీ వంటి అంశాలు నగరాన్ని ప్రపంచ వైద్య పర్యాటక మార్కెట్లో ముందంజలో నిలబెడుతున్నాయని అభిప్రాయపడ్డారు. పరిశ్రమ నిపుణుడు షాజ్ మెహ్మూద్ మాట్లాడుతూ ప్రతిపాదిత మెడికల్ టూరిజం సొసైటీ అంతర్జాతీయ స్థాయిలో నగర ప్రతిష్టను మరింత పెంచుతుందని అన్నారు.

## సామాజిక సేవలో చురుకైన వ్యక్తి సరస్వతి

### వర్ధంతి సభలో కొనియాడిన వక్తలు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అందరితో స్నేహపూర్వకంగా, కలివిడిగా ఉండే మనస్తత్వం కలిగిన గొప్ప వ్యక్తి డాక్టర్ పి.సరస్వతి అని సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ కొనియాడారు. ఇటీవల కన్నుమూసిన సిఆర్ ఫౌండేషన్, మహిళా, సామాజిక సేవా శ్రేయోభిలాషి డాక్టర్ పి.సరస్వతి సంస్మరణ సభ శుక్రవారం ఉదయం చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కొండాపూర్‌లో వృద్ధాశ్రమ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ముందుగా పి.సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె గౌరవార్థం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ డాక్టర్ సరస్వతి గత 21 సంవత్సరాలుగా ఆశ్రమంలోనే ఉంటూ.. ఆశ్రమ సలహామండలి సభ్యురాలిగా ఆశ్రమ అభివృద్ధికి, సిఆర్ ఫౌండేషన్, మహిళా సమాఖ్యతోపాటు పలు సామాజిక కార్యకలాపాలకు ఎన్నో విధాలుగా తోడ్పాటు అందించారని ఆమె సేవలను స్మరించుకున్నారు. ఆమె సరోజినీ దేవి కంటి వైద్యశాలలో సూపరింటెండెంట్‌గా పని చేశారని, ఆమె జీవితం అందరితో స్నేహపూర్వకంగా వ్యవహరించే వారని చివరి దశలో కూడా ఆశ్రమంలో చాలా సంతోషంగా జీవించారని కొనియాడారు. అనంతరం సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సిఆర్ ఫౌండేషన్ ఆరోగ్య కేంద్రంలో ఆమె కంటి వైద్యురాలిగా 11సంవత్సరాలు ఉచిత సేవలందించారన్నారు. సిఆర్ పాలిక్లినిక్ మెడికల్ క్యాంపులకు, ఆశ్రమంలో వసతులు, సౌకర్యాలకు, సిబ్బంది సంక్షేమానికి వ్యక్తిగతంగా, ఆర్థికంగా తుదిశ్వాస వరకు తోడ్పాటు అందించారని ఆమె సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరస్వతి కుమారుడు పబ్బరాజు శ్రీనివాస్, కోడలు క్రాంతి, కె.అజయ్ కుమార్, (ఉపాధ్యక్షులు, చెన్నమనేని వెంకటేశ్వరరావు, (కార్యదర్శి) పీజే చంద్రశేఖర్ రావు, మాజీ ఎంఎల్‌సి (కార్యదర్శి), డాక్టర్ కె.రజని, డైరెక్టర్, సిఆర్ పాలిక్లినిక్, రాజేందర్‌రావు (ఆశ్రమ సలహామండలి సభ్యులు), ఆశ్రమ వాసులు సీనియర్ విశ్రాంత జర్నలిస్ట్ ఎబికె ప్రసాద్, విశ్రాంత సైంటిస్ట్ మల్లంపాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ అడపా రామారావు, మహిళా సంక్షేమ కేంద్ర కమిటీ సభ్యులు ప్రేమ పావని ప్రసంగించారు. ఫౌండేషన్ ట్రెజరర్ వృద్ధాశ్రమ డైరెక్టర్ వి.చెన్నకేశవరావు సభను నిర్వహించారు. చివరగా డాక్టర్ పి.సరస్వతి కుమారుడు పబ్బరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ తాను వృత్తిరీత్యా విదేశంలో నివసిస్తున్నప్పటికీ డాక్టర్ సరస్వతి నిశ్చింతగా సిఆర్ ఫౌండేషన్ ఆశ్రమంలో ఉన్నారని, తమ మాతృమూర్తిపై సీఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు చూపిన ప్రేమ, ఆదరణకు కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళా సంక్షేమ సంఘం సభ్యులు, సిఆర్ పాలిక్లినిక్ సిబ్బంది, ఆశ్రమం మేనేజర్ శ్రీనివాస్, ఆశ్రమ వాసులు తదితరులు పాల్గొన్నారు. చివరగా స్వాతంత్ర్య సమరయోధులు రామిరెడ్డి ప్రసంగించారు. ఆశ్రమవాసి ధనలక్ష్మి.. డాక్టర్ సరస్వతిపై రాసిన కవితను వినిపించారు.



## అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చాలి

### సిఇఓ సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చాలని ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఎన్నికల నమోదు అధికారులు(ఇఆర్‌ఓ)లకు సూచించారు. హైదరాబాద్‌లోని సిఇఓ కార్యాలయంలో శుక్రవారం ఎన్నిక నమోదు అధికారుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో అర్హులైన వారే ఉంటారన్నదానిని కాపాడడం ఈఆర్‌ఓల కీలక బాధ్యత అన్నారు. అనర్హులను చట్టబద్ధంగా తొలగించాల్సిన బాధ్యతతో పాటు అర్హులను ఓటరు జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ అమలులో ఎదురయ్యే సవాళ్లు, పరిష్కారాలపై జరిగిన చర్చలో అధికారుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఎన్నిక నిర్వహణకు చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన చెప్పారు. ఓటరు జాబితాల తయారీ,సవరణ, నిర్వహణ విధానాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పించారు. త్వరలో నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)పై వివరంగా చర్చించారు. జాబితాలో ఖచ్చితత్వం, పారదర్శకత, సమగ్రతను పాటించేందుకు ఫీల్డ్ స్థాయి అధికారుల సామర్థ్యం పెంపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని సిఇఓ వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి, రం గారెడ్డి, హైదరాబాద్ జిల్లాలలకు చెందిన 50మంది ఇఆర్‌ఓలు పాల్గొన్నారు.

## పోలీస్ భద్రత విభాగం కార్యదర్శి గోపాల్ రెడ్డి మృతి : డిజిపి సంతాపం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం సేవలందించిన రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, ప్రస్తుత భద్రత, ఆరోగ్య భద్రత విభాగాల కార్యదర్శి ఆల గోపాల్ రెడ్డి (80) మరణించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నానక్‌రామ్‌గూడలోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చేరిన ఏ.గోపాల్ రెడ్డి, అంకితభావంతో పనిచేసి ఐపిఎస్ అధికారిగా ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం గత 20 ఏళ్లుగా భద్రత, ఆరోగ్య భద్రత విభాగాల కార్యదర్శిగా ఆయన సేవలందిస్తున్నారు. గోపాల్‌రెడ్డి ఆరోగ్య భద్రత పథకం ద్వారా సిబ్బందికి మెరుగైన వైద్యం అందేలా చూడటంతో పాటు భద్రత స్కీం క్రింద గృహ రుణాలు, పిల్లల విదేశీ విద్య వంటి అంశాల పర్యవేక్షణలో ముఖ్య భూమిక పోషించారు. 80 ఏళ్ల వయసులోనూ, అనారోగ్యం బారిన పడే వరకు ఆయన తన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించడం విశేషం. గోపాల్ రెడ్డి మృతి పట్ల రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్న డిజిపి వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

## తెలంగాణ అవకాశాల గని.. ఎఐలో అపార టాలెంట్ పూల్ మా బలం

### ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం కృత్రిమ మేధ (ఎఐ) రంగంలో దేశంలోనే ముందంజలో ఉందని, అపారమైన టాలెంట్ పూల్ రాష్ట్ర బలమని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక ఎఐ సమ్మిట్‌లో స్వీడన్ వాణిజ్య ప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఎఐ పరిశోధనలు, ఆవిష్కరణలకు తెలంగాణలో ప్రభావశీలమైన నైపుణ్య వనరులు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. కృత్రిమ మేధ వెల్లువ వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూనే, అది తీసుకువచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ముందుగానే సంసిద్ధమైందని తెలిపారు. సాఫ్ట్‌వేర్ నిపుణుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ కార్యక్రమాలను గత రెండేళ్లుగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఏఐ విస్తృతితో ఉద్యోగ విధుల్లో గణనీయమైన మార్పులు వస్తాయని, అందుకు అనుగుణంగా యువత, వృత్తి నిపుణులను సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఇందుకు అవసరమైన అప్లికేషన్ల రూపకల్పనలో గ్లోబల్ టెక్ కంపెనీలు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించే లక్ష్యంతో టిఫైబర్ ద్వారా విస్తృత కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రపంచంతో ప్రతి గ్రామాన్ని అనుసంధానించే దిశగా రెండు సంవత్సరాలుగా శ్రమిస్తున్నామని చెప్పారు. పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంలాంటిదని, నిరంతర విద్యుత్ సరఫరా, స్థిర విధానాలు, అనుకూల ఎకోసిస్టంతో రాష్ట్రం ఎప్పుడూ కొత్తదనాన్ని స్వాగతిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణను గ్లోబల్ ఎఐ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు.

## వ్యవసాయ రంగంలో వేగంగా సాంకేతిక సంస్కరణలు

### మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాటిలైట్ ద్వారా మట్టి పోషకాలను గుర్తించి, వాటిని ఏఐ మోడలింగ్ ద్వారా విశ్లేషించే పైలట్ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిందని, త్వరలోనే ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. వీటి ద్వారా రైతులకు ఖచ్చితమైన మట్టి విశ్లేషణ, పంటలకు తగిన శాస్త్రీయ సలహాలను అందించనున్నామన్నారు. న్యూఢిల్లీ భారత్ మండపంలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్' లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న సాంకేతికత, డిజిటల్ మౌలిక వసతులు ప్రస్తావనకు రావడం గర్వకారణమని ఆయన శుక్రవారం తెలిపారు. ఎఐ సమ్మిట్ తెలంగాణ వ్యవసాయ సాంకేతికత ప్రస్తావన రావడం రాష్ట్రానికి గౌరవమని, జర్మన్ అగ్రికల్చరల్ కౌన్సిలర్ సహా అంతర్జాతీయ నిపుణులు తెలంగాణలో అమలు చేస్తున్న సాంకేతిక విధానాలను ప్రశంసించడం విశేషమన్నారు. వ్యవసాయానికి సాంకేతికతను జోడించడంలో తెలంగాణ రాష్ట్రం ఎప్పుడూ ముందుంటుందన్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత ఆధారిత సంస్కరణలు వేగంగా అమలవుతున్నాయన్నారు. వ్యవసాయ రంగంలో పలు సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. మొబైల్ యూరియా బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టడం ద్వారా బ్లాక్ మార్కెటింగ్, అధిక నిల్వలను నియంత్రిస్తూ, పారదర్శక పంపిణీ వ్యవస్థను తీసుకొచ్చిందని వివరించారు. శాటిలైట్ మ్యాపింగ్, ఉపగ్రహ ఆధారిత మట్టి విశ్లేషణ, ఎల్‌ఓటి సెన్సర్లు, పంట అంచనాలు, వాతావరణ ఆధారిత శాస్త్రీయ సలహా సేవలు వంటి ఆధునిక సాంకేతికతలను రాష్ట్రం విస్తృతంగా వినియోగిస్తోందన్నారు. తెలంగాణ అనుభవం దేశానికి మాత్రమే కాదని, ప్రపంచానికి కూడా మార్గదర్శకమని, భవిష్యత్తులో సాంకేతికత ఆధారిత వ్యవసాయ సంస్కరణలలో రాష్ట్రం ముందుండి నాయకత్వం వహిస్తుందన్నారు.

**డిజిటల్ వ్యవసాయ విస్తరణపై చర్చ**

స్టాండార్డ్, పాలిసీ పాత్‌వే ఫర్ స్కాలింగ్ ఎఐఎనెబుల్డ్ , ఫార్మర్ సెంట్రిక్ అగ్రిఫుడ్ సిస్టమ్ అనే అంశంపైన ఐసిఎఆర్, జర్మనీకి చెందిన ఫ్రాన్హోఫర్ హైన్రిచ్ హెర్ట్జ్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో గ్లోబల్ నిపుణులు, శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిజిటల్ వ్యవసాయ విస్తరణలో ప్రమాణాలు, పరిపాలన వ్యవస్థ, రైతుకేంద్రిత ఎఐ వినియోగంపై ప్రధానంగా చర్చించారు. ఫ్రాన్హోఫర్ హెచ్‌ఎచ్‌ఐ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అగ్వాబ్ ఫౌండేషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కలిసి అమలు చేసిన ఈ ప్రాజెక్ట్ ద్వారా రైతు రిజిస్ట్రీలు, భూమి వివరాలు, పంట సమాచారం, శాస్త్రీయ సలహాలు, మార్కెట్ ఇంటర్‌ఫేస్‌లు ఇలా డిజిటల్ వ్యవసాయ వేదికను రూపొందించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

## పెండింగ్ టౌన్‌ప్లానింగ్ ఫైల్స్‌పై.. ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సీరియస్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యాన్ని నివారించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. 'భవన నిర్మాణ అనుమతుల్లో మెరుపు వేగమేదీ?' అనే శీర్షికతో 'ప్రజాపక్షం'లో ప్రచురితమైన వార్తకు ఎంఎంసి కమిషనర్ స్పందించారు. అందుకు సంబంధించిన ఎంఎంసి పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. చీఫ్ సిటీ ప్లానర్ బి.ప్రదీప్‌కుమార్‌తో కలిసి, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జోనల్, సర్కిల్ వారీగా 'బిల్డ్ నౌ' పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల వివరాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లతో ఫైళ్ల జాప్యంపై చర్చించారు. నిర్ణీత కాలపరిమితి (ఎస్‌ఎల్‌ఎ) ముగిసినప్పటికీ ఫైళ్లను పెండింగ్‌లో ఉంచడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువు దాటిన ఫైళ్ల విషయంలో బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కేవలం కింది స్థాయి సిబ్బందిని సాకులుగా చూపడం కుదరదని, ఫైళ్లు ఎక్కడ ఆగిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత పైస్థాయి అధికారులదేనని కమిషనర్ గుర్తుచేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, నిర్దేశించిన గడువు లోపలనే అన్ని దరఖాస్తులను పరిష్కరించి, క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అయితే జోనల్ కమిషనర్ స్థాయిలో పెండింగ్ ఫైళ్ల అంశం సమావేశంలో ప్రస్తావనకు రాకపోవడం గమనార్హం.

## ట్రై కార్పొరేషన్‌లలో పరిశుభ్రతలో 'స్వచ్ఛ ఆటో' కార్మికులదే కీలక పాత్ర

### ట్రై కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి. కర్ణన్, జి.సృజన, టి.వినయ్ కృష్ణారెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :**గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి (ట్రై కార్పొరేషన్)ల పరిధిలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికులు పూర్తి సహకారం అందించాలని కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, జి.సృజన, టి.వినయ్ కృష్ణారెడ్డి సంయుక్తంగా పిలుపునిచ్చారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులతో ట్రై కార్పొరేషన్‌ల కమిషనర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు, విజ్ఞప్తులను కమిషనర్లు ఓపిగ్గా విన్నారు. కమిషనర్లు మాట్లాడుతూ ట్రై కార్పొరేషన్‌ల పరిధిలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలని ఇటీవల స్పష్టం చేశామని తెలిపారు. స్వచ్ఛ ఆటో కార్మికుల సహకారం లేకుండా ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదన్నారు.

**త్వరలో 100 రోజుల పారిశుద్ధ్య కార్యక్రమం..**

త్వరలో అమలు చేయనున్న 100 రోజుల కార్యచరణ ప్రణాళికలో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రాథమిక చెత్త సేకరణ కీలకమని, అందుకు స్వచ్ఛ ఆటోల పనితీరే ప్రధానమని స్పష్టం చేశారు. కేటాయించిన ప్రాంతాల్లో ప్రతి ఇంటి నుంచి రోజూ 100 శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణను పర్యవేక్షించేందుకు కార్పొరేషన్ పారిశుద్ధ్య సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు చేపడతారన్నారు. ఆర్‌టిఓ అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటామని, చెత్త అన్‌లోడింగ్ సమయంలో వెయిటింగ్ పీరియడ్‌ను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. అవసరమైన చోట ఇంటర్మీడియట్ పోర్టబుల్ ట్రాన్స్‌ఫర్ పాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగా విలీనమైన పురపాలికాల్లో మ్యాపింగ్ పూర్తి చేసి, ఇంటింటి చెత్త సేకరణను పర్యవేక్షిస్తామని తెలిపారు.

**ప్రమాదం జరిగితే నష్టపరిహారం..**

కార్మికులకు ప్రమాదం జరిగితే నష్టపరిహారం చెల్లిస్తామని, ప్రమాద బీమా సౌకర్యం వర్తింపజేస్తామని కమిషనర్లు హామీనిచ్చారు. ఉద్యోగ భద్రతకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విధులకు హాజరు కాలేని పరిస్థితుల్లో సంబంధిత ఎస్‌ఎఫ్‌ఏలకు సమాచారం అందించాలని సూచించారు. ట్రై కార్పొరేషన్‌లను పరిశుభ్రంగా ఉంచడంలో స్వచ్ఛ ఆటో కార్మికులు కీలక పాత్ర పోషించాలని, పారిశుద్ధ్యం విభాగాన్ని 'నెంబర్ వన్'గా తీర్చిదిద్దేందుకు పూర్తి సహకారం అందించాలని కమిషనర్లు కోరారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా ప్రతి ఇంటి నుంచి 100 శాతం చెత్త సేకరిస్తామని స్వచ్ఛ ఆటో కార్మికులు కమిషనర్లకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఎన్. రవికిరణ్, సి.ఎన్. రఘు ప్రసాద్, డాక్టర్ యాదగిరిరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ పాల్గొన్నారు.

## వారం రోజుల్లో జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని డి.పి.ఆర్.ఒలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్.ప్రియాంక ఆదేశించారు. జిఒ నంబ ర్ 252, 103ల పై పూర్తి అవగాహన ఉండాలని పిఆర్‌ఒలకు సూచించారు. 'అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ, విధి విధానాల'పైన హైదరాబాద్, నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆడిటోరియంలో డిపిఆర్ఒలకు క్షేత్ర స్థాయి సిబ్బందికి శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో 'జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ'ల ఏర్పాటు పక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, రిపోర్టులు, అప్రూవుడ్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నంబర్ అలాట్‌మెంట్, అక్రిడిటేషన్ కార్డుల డౌన్‌లోడింగ్, మొదలగు అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోని మీడియా రిలేషన్ వింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని తెలిపారు. సాంకేతిక సమస్యలు ఉత్పతన్నమైతే ప్రధాన కార్యాలయంలోని సాంకేతిక బృందాన్ని సంప్రదించాలని, ఎటువంటి తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా అక్రిడిటేషన్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆమె కోరారు.

**ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే 'అక్రిడిటేషన్ల' జారీ : కె.శ్రీనివాసరెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారమే రాష్ట్ర, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి డిపిఆర్‌ఒలను కోరారు. క్షేత్రస్థాయిలో అక్రిడిటేషన్ జారీలో ఏమైన సమస్యలు ఉంటే స్పెషల్ కమిషనర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల డిపిఆర్‌ఒలు, సంబంధిత సిబ్బంది హజరయ్యారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ, ఆన్‌లైన్ విధి విధానాలపైన క్షేత్రస్థాయి సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిపించారు. కాగా శిక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది లేవనెత్తన అంశాలపై మీడియా రిలేషన్ విభాగం అధికారులు డి.ఎస్.జగన్, యామిని, వెబ్‌సైట్ టీమ్ మేనేజర్ నంద, టెక్నీషియన్ సాయిలు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. అయితే అర్హత కలిగిన జర్నలిస్టులు http://ipr. telangana. gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే సెల్ నెం : 9154170881ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్, తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, జాయింట్ డైరెక్టర్లు శ్రీనివాస్, రమణ, మధుసూదన్, జాయింట్ డైరెక్టర్లు వై.వెంకటేశ్వర్లు, హష్మీ, రాజారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ యామిని పాల్గొన్నారు.

## తప్పుడు సమాచారం పట్ల జాగ్రత్త



### వ్యవసాయం, విద్యలో 'ఎఐ సాంకేతికత'పై ఎఐ, డీప్‌టెక్ స్టార్టప్‌ల సిఇఓలతో ప్రధాని మోదీ చర్చ

**న్యూఢిల్లీ :** వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, మాతృభాషలో ఉన్నత విద్యను ప్రోత్సహించడం, వివిధ రంగాలలో కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగించుకునే అవకాశాల గురించి శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), డీప్‌టెక్ స్టార్టప్‌ల సిఇఓలతో చర్చించారు. ప్రధానమంత్రి మోదీతో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో 16మంది ఎఐ, డీప్‌టెక్ స్టార్టప్‌ల సిఇఓలు, వ్యవస్థాపకులు తమ ఆలోచనలు, పని వివరాలను విపులీకరించారు. ఈ సందర్భంగా మోదీ బలమైన డేటా గవర్నెన్స్ ఆవశ్యకతను నొక్కిచెప్పారు. తప్పుడు సమాచారం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. భారతదేశ అవసరాలకు అనుగుణంగా పరిష్కారమార్గాలను అన్వేషించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ యుపిఐని సరళమైన, విస్తరించదగిన డిజిటల్ ఆవిష్కరణలకు ఒక నమూనాగా పేర్కొన్నారు. భారతీయ కంపెనీలపై విశ్వాసాన్ని, దేశీయ ఉత్పత్తులపై నమ్మకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అంతరిక్షరంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రభుత్వం విస్తరిస్తున్న తీరును మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ వంటి వివిధ రంగాలలో ఆర్టిఫీషియల్ టెక్నాలజీని ఉపయోగించుకునే సామర్థ్యాన్ని, పంట ఉత్పాదకతను పర్యవేక్షించడం, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి ఎరువుల వినియోగాన్ని గురించి ప్రధానమంత్రి వారితో లోతుగా చర్చించారు. భారతీయ భాషలు, సంస్కృతిని ప్రోత్సహించడం ప్రాముఖ్యతను ఆయన ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. మాతృభాషలో ఉన్నత విద్య కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలను విస్తరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. సాహసోపేతమైన రిస్క్‌లను స్వీకరించి ప్రభావవంతమైన పరిష్కారాలను నిర్మించినందుకు మోదీ ఆవిష్కర్తలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ గ్రూప్‌లో సైబర్ భద్రత, నైతికత, అంతరిక్షం, న్యాన్ని స్థానిక భాషలో యాక్సెస్ చేయడం ద్వారా సామాజిక సాధికారతపై దృష్టి సారించిన వెంచర్‌లు ఉన్నాయి. ఈ రౌండ్ టేండ్ సమావేశానికి ఎబ్రిడ్జి, అదాలత్ ఎఐ, బ్రెయిన్ సైట్ ఎఐ; ఎకాకేర్, గ్లీన్, ఇన్నోగిల్, ఇన్‌వీడియో, మైకో, ఒరిజిన్, ప్రోఫేజ్, రాసెన్, రుబ్రిక్, సాట్‌స్యూర్, సూనర్‌నోవా, సైఫా ఎఐ సిఇఓలు, వ్యవస్థాపకులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పి.కె.మిశ్రా, ప్రిన్సిపల్ సెక్రటరీ2 శక్తికాంత దాస్, కేంద్ర సహాయ మంత్రి జితిన్ ప్రసాద తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## భారత్-అమెరికా మధ్య ఒప్పందం

# త్వరలో కార్యరూపం

- ఏప్రిల్‌లో అమలులోకి రానుందని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వెల్లడి
- వచ్చేవారం వాషింగ్టన్‌లో ఇరుదేశాల ప్రధాన సంధానకర్తల సమావేశం

**న్యూఢిల్లీ:** భారతదేశంఅమెరికా నడుమ మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి త్వరలోనే ఒక ముందడుగు పడనుంది. ఇరుదేశాల మధ్య ఈ మధ్యంతర వాణిజ్య ఒప్పందం మార్చిలో కుదిరే అవకాశం ఉందని, ఈ ఒప్పందం ఎప్రిల్‌లో అమలులోకి రానున్నదని శుక్రవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ వెల్లడించారు. భారతదేశంఅమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం కోసం ఈ నెల ప్రారంభంలో ఒక ముసాయిదాను ప్రకటిస్తూ ఇరుదేశాలు ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేశాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం మొదటి దశ విధివిధానాలను ఖరారు చేయడానికి ఇరుదేశాలకు చెందిన ప్రధాన సంధానకర్తలు వచ్చే వారం వాషింగ్టన్‌లో సమావేశం కానున్నారు. రెండు టీమ్‌ల మధ్య మూడు రోజుల సమావేశం ఫిబ్రవరి 23న ప్రారంభం కానుంది. పియూష్ గోయల్ ఇ క్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఒప్పందంపై మార్చిలో సంతకం చేస్తారని అంచనా వేస్తున్నామన్నారు. అయితే ఎప్రిల్‌లో అమలు జరిగే అవకాశం కూడా లేక పోలేదని వివరించారు. ఇక్కడ జరిగిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌లో యుఎస్ అంబాసిడర్ సెర్జియో గోర్ మాట్లాడుతూ భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై త్వరలో సంతకం చేయనున్నట్లు చెప్పారు. కీలకమైన ఖనిజాల కోసం స్థిరమైన సప్లయ్ చైన్‌ను నిర్మించే లక్ష్యంతో భారతదేశం అమెరికా నేతృత్వంలోని వ్యూహాత్మక కూటమి 'పాక్స్ సిలికా'లో శుక్రవారం చేరింది. వాణిజ్య ఒప్పందం నుండి 'పాక్స్ సిలికా'వరకు రక్షణ సహకార



రంగంలో మన రెండు దేశాలు కలిసి పనిచేయడానికి ఉన్న సామర్థ్యం నిజంగా అపరిమితమైనదని సెర్జియా గోర్ వ్యాఖ్యానించారు. ఈనెల ప్రారంభంలో భారతదేశంఅమెరికా ఇరుదేశాలు విడివిడిగా విడివిడిగా విడుదల చేసిన ఉమ్మడి ప్రకటన మధ్యంతర వాణిజ్య ఒప్పందం రూపురేఖలను నిర్దేశిస్తుందని, ఇవి ఇప్పుడు చట్టపరమైన ఒప్పందంగా అనువదించబడ్డాయని, దీనికోసం ఇరుపక్షాలు వచ్చే వారం సమావేశం కానున్నాయన్నారు. భారతదేశం బృందానికి ప్రధాన సంధానకర్తగా డార్పన్ జైన్ నేతృత్వం వహిస్తారు. ఈ ఒప్పందం ప్రకారం ఇరుదేశాలు తమ మధ్య వర్తకం జరిగే అనేక వస్తువులపై పరస్పరం సుంకాల రాయితీల ఒప్పందాలను పొడిగిస్తాయి. భారత వస్తువులపై 25శాతం నుంచి 18శాతానికి పరస్పర సుంకాలను తగ్గిస్తున్నట్లు యునైటెడ్ స్టేట్స్ ప్రకటించింది. రష్యా ముడి చమురు కొనుగోలు చేసినందుకు భారతదేశంపై శిక్షాత్మక సుంకాలను ఇప్పటికే తొలగించింది. అమెరికా నుంచి 100శాతం సుంకాలను ఎదుర్కొంటున్న దేశీయ పరిశ్రమకు ఈ సుంకాల తగ్గింపు పెద్ద ఉపశమనం కానుంది. సుంకాలను 18 శాతానికి తగ్గించే ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ట్రంప్ పరిపాలన ఈ నెలలో జారీ చేస్తుందని పియూష్ గోయల్ ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. రూ.25,060 కోట్ల ఎగుమతి ప్రమోషన్ మిషన్ (ఇపిఎం)లోని ఎడు భాగాల ప్రారంభోత్సవంలో గోయల్ మాట్లాడుతూ భారత వాణిజ్య ఒప్పందం భారత ఎగుమతిదారులకు భారీ వ్యాపార అవకాశాలకు తలుపులు తెరిచిందని అన్నారు. అగ్రికల్చర్ సహా అన్ని సున్నితమైన రంగాలను భారతదేశం రక్షించిందని ఆయన చెప్పారు. ఇటీవల కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ స్పందిస్తూ భారతదేశం చాలా ఇచ్చి చాలా తక్కువగా పొందుతున్నదని చెబుతూ ఇది 'ఘోరమైన లొంగిపోవడం' అని ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీ విమర్శలపై మంత్రి పియూష్ గోయల్ ఘాటుగా స్పందించారు. మేము 1.4బిలియన్ల మంది వినియోగదారులకు సేవలు అందిస్తున్నాం. వారు కూడా అభివృద్ధిలో వాటాదారులుగా ఉన్నారు' అని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ జోడించారు. భారతదేశంపై పరస్పర సుంకాలు ఇప్పుడు దాని పోటీదేశాలతో పోలిస్తే అత్యల్పంగా ఉన్నాయన్నారు. ఈ దేశాలలో చైనాపై సుంకాలు (35శాతం), థాయ్‌లాండ్ (19శాతం), మయన్మార్ (40శాతం), కంబోడియా (19శాతం), ఇండోనేషియా(19శాతం), బ్రెజిల్ (50శాతం), వియత్నాం (20శాతం) ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఎప్రిల్‌జనవరి కాలంలో అమెరికాకు దేశ ఎగుమతులు 5.85శాతం పెరిగి 72.46 బిలియన్ డాలర్లకు చేరుకోగా దిగుమతులు 13.87శాతం పెఇరగి 43.92 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.



## ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో జరుగుతున్న ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. భారత్‌-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన చేపట్టారు. హాల్ నంబర్ 5లోకి ప్రవేశించిన సుమారు 10 మంది నిరసనకారులు ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రాలతో కూడిన టీషర్టులతో ఆందోళన చేశారు. ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌ను విమర్శిస్తూ, ప్రధాని మోదీ ట్రంప్‌తో రాజీపడ్డారని ఆరోపించారు. యూత్ కాంగ్రెస్ నిరసనలు చేపట్టిన నేపథ్యంలో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుని తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన తర్వాత భారత్ మండపం లోపల భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. మరోవైపు ఎఐ సమ్మిట్ వద్ద చేపట్టిన నిరసనను యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ సమర్థించారు. ఈ నిరసన దేశ వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతలోని ఆగ్రహానికి ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు. 'ఈ రోజు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఎఐ సమ్మిట్ వద్దకు వెళ్లి ప్రధాని మోదీ రాజీపడ్డారని నినాదాలు చేశారు. ఈ ఆగ్రహం కేవలం మా కార్యకర్తలది మాత్రమే కాదు. నేడు నిరుద్యోగులుగా ఉన్న యువతది. మన ప్రధాని రాజీపడ్డారని వారిలో ప్రతి ఒక్కరికీ తెలుసు. అమెరికాతో చేసుకున్న ట్రేడ్ డీల్ వల్ల మన రైతులు, పౌరులు నష్టపోతారు. ఈ ఒప్పందం వల్ల కేవలం అమెరికాకు మాత్రమే ప్రయోజనం. కనుక ప్రజల తరఫున గళమెత్తడం మా బాధ్యత. మన దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. కనుక మేము ఎక్కడైనా శాంతియుతంగా నిరసన చేపట్టవచ్చు' అని అన్నారు. నిరసనకారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు చేసిన ప్రకటనపై స్పందిస్తూ, తమ పార్టీ కార్యకర్తలు దేనికీ వెనకడుగు వేయరని చిబ్ చెప్పారు. 'బిజెపి ఏ స్థాయికైనా వెళ్లవచ్చు. కానీ మేము రాజ్యాంగ సైనికులం, రాహుల్ గాంధీ సైనికులం. మేము వెనక్కు తగ్గే ప్రసక్తే లేదు. దేశ యువత కోసం నిరంతరం గళమెత్తుతూనే ఉంటాం' అని ఐవైసి జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ స్పష్టం చేశారు.

## భారత్,అమెరికా ఒప్పందంతో 'డేటా కాలనీ'గా దేశం

### ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ

**న్యూఢిల్లీ :** అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శలను మరింత ముమ్మరం చేశారు. భారతదేశం చాలా ఎక్కువ ఇచ్చి, చాలా తక్కువ పొందుతున్నట్లు కనిపించే ఒప్పందానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎందుకు అంగీకరించారనే దానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందంతో భారతదేశం 'డేటా కాలనీ'గా మారబోతోందని పేర్కొన్నారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వంపై ధ్వజమెత్తుతూ.. ఒప్పందం ద్వారా మోదీ సర్కార్ అమెరికాకు అమ్ముడు పోయిందని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేశారు. ఇటీవల పార్లమెంటులో తాను చేసిన ప్రసంగాన్ని ప్రస్తావించారు. అందులో ఆయన జియు-జిట్సు సారూప్యతను ఉపయోగించారు. 'వాణిజ్య ఒప్పందంపై పార్లమెంటు ప్రసంగంలో నేను జియు-జిట్సు సారూప్యతను ఎందుకు ఉపయోగించాను? అమెరికన్లను సంతోషపెట్టడానికి మన రైతులను ఎందుకు బలి ఇచ్చారు? అమెరికా మన చమురు సరఫరాలను నిర్దేశించడానికి అనుమతించడం ద్వారా భారతదేశ ఇంధన భద్రత ఎందుకు రాజీ పడింది? పరస్పర వాగ్దానం లేకుండా సంవత్సరానికి 100 బిలియన్ల యుఎస్ దిగుమతులను పెంచడానికి ఎందుకు అంగీకరించాలి? ఈ ఒప్పందం భారతదేశాన్ని డేటా కాలనీగా మార్చగలదని నేను ఎందుకు చెప్పాను? భారతదేశం చాలా ఇచ్చి చాలా తక్కువ పొందుతున్నట్లు కనిపించే ఒప్పందానికి మోదీ జీ ఎందుకు అంగీకరిస్తారు? ఈ దారుణమైన లొంగుబాటుకు సమాధానం ప్రధాన మంత్రిపై ఉంచిన 'గ్రిప్స్' 'చోక్స్'లో ఉంది' అని రాహుల్ పేర్కొన్నారు.



గాంధీ తన పార్లమెంటు ప్రసంగంలో జియు-జిట్సు సారూప్యతను ఎందుకు ఉపయోగించారని చాలా మంది తనను అడిగారని చెప్పారు. 'నేను గ్రిప్, చౌక్ అనే ఆలోచనను ఉపయోగించటానికి కారణం ఆ పదాలు జియు-జిట్సులో ఉన్నాయి. ఆ క్రీడలో మీరు ప్రత్యర్థిని ఎలా నియంత్రిస్తారో అలాంటివి రాజకీయ రంగంలో కూడా ఉన్నాయి. నా రాజకీయ అనుభవంలో, రాజకీయ పట్టులు, రాజకీయ చౌక్‌లు ఎక్కువగా దాగి ఉన్నాయని నేను చూశాను. సగటు వ్యక్తి వాటిని చూడలేదు' అని అతను చెప్పారు. ఒకవైపు అమెరికాలో వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై క్రిమినల్ కేసు, మరోవైపు ఎప్‌స్టిన్ కుంభకోణం ఉందని రాహుల్ అన్నారు. 'మూడు మిలియన్ల ఫైళ్లు విడుదల కాలేదు. ఫైళ్లలో (కేంద్ర మంత్రి) హర్దీప్ పూరికి, అనిల్ అంబానీకీ ప్రమేయం ఉందని మాకు తెలుసు. ప్రధానమంత్రి పేరు కూడా కనిపిస్తుంది, ప్రధానమంత్రికి ఇఃకా ప్రమేయం ఎక్కువగా ఉంటుంది' అని ఆయన అన్నారు. మరోవైపు, చైనా ఉందని చెబుతూ మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే విడుదల కాని పుస్తకాన్ని ప్రస్తావించారు.'ఒకవైపు మన సరిహద్దులో కూర్చున్న చైనీయులు ఉన్నారు, మరోవైపు అమెరికా ఉంది. మన ప్రధాని ఈ పట్టుల మధ్య నలిగిపోతున్నారు. ఇరువైపులా ఆయన చిక్కుకున్నారని అందరికీ తెలుసు, అందరూ దానిని చూడగలరు. ఇక్కడ సమస్య ఎమిటంటే, నరేంద్ర మోడీపై నిజమైన పట్టు ఆయన నిర్మించిన నకిలీ ఇమేజ్, అది ఆయన కోసం నిర్మించబడింది, భారీ మొత్తంలో డబ్బు అవసరమైన ఇమేజ్' అని రాహుల్ ఆరోపించారు. ఆ ఇమేజ్‌కి కీ ఇప్పుడు అమెరికా చేతుల్లో ఉంది. అందుకే భారత రైతులు, భారతీయ వస్త్రాలకు నష్టం వాటిల్లుతోంది. మనం అమెరికా నుండి బలవంతంగా దిగుమతులను కొనుగోలు చేయవలసి వస్తుందన్నారు. అయితే అతి ముఖ్యమైనది డేటా అని, దానిని నరేంద్ర మోదీ అమెరికన్ కంపెనీలకు, అమెరికాకు అతి తక్కువ ధరకు అందజేస్తున్నారనేది వాస్తవం అన్నారు. 'నా మాటలను గమనించండి, మనం డేటా కాలనీగా మారబోతున్నాం. భారతదేశం అంత పెద్ద దేశం మన డేటా, వస్త్ర పరిశ్రమ, మన వ్యవసాయ రంగం సహా ప్రతిదాన్ని ఎందుకు అప్పగించింది, ఎందుకు సమాధానం ప్రధానమంత్రిపై వర్తించే పట్టులు, ఉక్కిరిబిక్కిరి చేయడంలో ఉంది' అని గాంధీ ప్రశ్నించారు. ఈ ఒప్పందానికి అంగీకరించడంలో మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు లొంగిపోయారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ ఒప్పందం రాష్ట్రాలలోని కోట్లాది మంది రైతుల జీవనోపాధిని నాశనం చేస్తుందని, భారతదేశ ఇంధన భద్రత, డిజిటల్ సార్వభౌమాధికారం, ఆర్థిక స్వావలంబనను త్యాగం చేస్తుందని కాంగ్రెస్ ఆరోపించింది. వాణిజ్య ఒప్పందాలు ఒక దేశ సార్వభౌమత్వాన్ని త్యాగం చేయడం ద్వారా బానిసత్వానికి మార్గంగా మారకూడదని, వాణిజ్య ఒప్పందం ముసుగులో జాతీయ ప్రయోజనాలను తాకట్టు పెట్టలేమని పేర్కొంది.

## అత్యధిక కేసులు ఎదుర్కోవడం గౌరవ చిహ్నంగా మారింది!

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ

**గువాహటి :** ప్రస్తుత రాజకీయ వాతావరణంలో అత్యధిక సంఖ్యలో కేసులు ఎదుర్కోవడం గౌరవ చిహ్నంగా మారిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపి ప్రియాంకాగాంధీ అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని 2018 పరువు నష్టం కేసులో సమర్థించారు. అసోంలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రియాంక మాట్లాడారు. వివిధ ఎజెన్సీలు బహుళ కేసులతో లక్ష్యంగా చేసుకోవడం సరైన మార్గంలో ఉన్నట్లే అనే సంకేతమని వాద్రా అన్నారు. తప్పుడు కేసులు నమోదు చేసి ప్రజలను దోపిడీ చేసే రాజకీయాలు నడుస్తున్నాయని, తాము చాలా సంవత్సరాలుగా దీనిని సహిస్తున్నామని, తన సోదరుడు పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరు కావడం గురించి అడిగినప్పుడు ప్రియాంక ఈ విధంగా స్పందించారు. రాహుల్ గాంధీ శుక్రవారం ఉత్తర ప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లోని ప్రజాప్రతినిధుల కోర్టు ముందు హాజరయ్యారు. అప్పటి బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో తన



వాంగ్మూలాన్ని నమోదు చేశారు. 'సత్యం, అభివృద్ధి, ప్రజల కోసం నిలబడేవారు, సానుకూల రాజకీయాలను కోరుకునే వారు ప్రభుత్వం నుండి అత్యధిక దాడులను ఎదుర్కొంటారని ఇది ఒక గుర్తింపుగా మారింది. అత్యధిక సంఖ్యలో కేసులు, ఇడి, ఐటి దాడులు ఆ వ్యక్తిపై జరుగుతాయి. మేము సరైన మార్గంలో ఉన్నామనడానికి ఇది గౌరవ చిహ్నం, అందుకే మాపై దాడి జరుగుతోంది' అని వాద్రా అన్నారు.

**పాక్ సంబంధిత ఆరోపణలపై గగోయ్ కుటుంబాన్ని లాగడం తగదు**

పాకిస్తాన్ సంబంధాలపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ గౌరవ్ గగొయ్‌పై విమర్శలు చేయడాన్ని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా మండిపడ్డారు. ఆయన కుటుంబాన్ని, పిల్లలను అందులోకి లాగడం తప్పుడు రాజకీయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. గువాహటి శివారు సోనాపూర్‌లో ఉన్న జుబీన్ ఖేత్రలోని జుబీన్ గార్గ్ శ్మశానవాటికలో జుబీన్ గార్గ్‌కు ప్రియాంక నివాళి అర్పించారు. గాయకుడు రాజకీయాలకు అతీతంగా ఉన్నారని, జీవితాంతం ప్రేమ సందేశాన్ని వ్యాప్తి చేశారని వాద్రా అన్నారు. 'రాజకీయాల్లో రెండు రకాల నాయకులు ఉంటారు. ఒకరు సానుకూల రాజకీయాలు చేసేవారు, మరొకరు ధ్రువణీకరణ చేసేవారు. గౌరవ్ గొగోయ్ ప్రేమ రాజకీయాలు చేస్తున్నారు' అని అసోం కాంగ్రెస్ చీఫ్ శర్మ పాకిస్తాన్ సంబంధాలపై పదేపదే చేస్తున్న దాడుల గురించి అడిగినప్పుడు ఆమె స్పందించారు. గొగోయ్ 'సానుకూల వ్యక్తి, రాజకీయాల్లో సానుకూలతను తీసుకురావాలనుకుంటున్నారని చెప్పారు. 'అందుకే ఆయనపై ఇటువంటి దాడులు జరుగుతున్నాయని, అసోం, ప్రజలు దీనిని అర్థం చేసుకుంటారని చెప్పారు. కానీ గౌరవ్, అతని కుటుంబంపై దాడులు తప్పుడు రాజకీయాలని, కుటుంబం, పిల్లలపై ఎవరూ దాడి చేయకూడదని ప్రియాంక పేర్కొన్నారు. అలాంటి రాజకీయాలకు బదులుగా, అసోం ముఖ్యమంత్రి 'ఉద్యోగాల కోసం చూస్తున్న రాష్ట్రంలోని యువత, మహిళల గురించి మాట్లాడాలని హితవు పలికారు.

## గుజరాత్, లక్షద్వీప్, పుదుచ్చేరిలో 69 లక్షల ఓట్ల కుదింపు

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (సర్) పూర్తయిన తర్వాత గుజరాత్, లక్షద్వీప్, పుదుచ్చేరిలలో ఓటర్ల సంఖ్య దాదాపు 69 లక్షలు తగ్గిపోయింది. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల సంఘం గణాంకాలను వెల్లడించింది. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా గుజరాత్, లక్షద్వీప్, పుదుచ్చేరి ఇటీవల తమ తుది ఓటర్ల జాబితాను ప్రచురించాయి. గత స ంవత్సరం అక్టోబర్ 27న సర్ ప్రకటించే ముందు, గుజరాత్, రెండు కేంద్రపాలిత ప్రాంతాలలో కలిపి ఓటర్ల సంఖ్య 5.19 కోట్లుగా ఉంది. తుది జాబితాల ప్రచురణ తర్వాత, వారి మొత్తం ఓటర్ల సంఖ్య 4.50 కోట్లకు తగ్గింది. గుజరాత్‌లో సర్‌కు ముందు ఓటర్ల సంఖ్య 5.08 కోట్లుగా ఉండగా, ఆ తరువాత 4.40 కోట్లకు తగ్గింది. లక్షద్వీప్‌లో ఓటరు జాబితా సవరణకు ముందు ఓటర్ల సంఖ్య 57,813గా ఉంది. కానీ తుది ఓటర్ల జాబితా ప్రచురించబడిన తర్వాత, అది 57,607కి తగ్గింది. ఎన్నికలు జరగనున్న పుదుచ్చేరిలో సర్ ప్రారంభానికి ముందు మొత్తం ఓటర్ల సంఖ్య 10.21 లక్షలకు పైగా ఉంది. తుది జాబితా ప్రచురించబడినప్పుడు 9.44 లక్షలకు కుదించబడింది.

## ఎపిలో ఎఐ, క్వాంటం ఎకో సిస్టం కోసం ఏడు ఒప్పందాలు

### నైపుణ్య శిక్షణ-మౌలిక వసతుల కల్పన లక్ష్యం
### ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఎపి సిఎం సమక్షంలో ఎంఒయులు

**అమరావతి:**ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ టెక్నాలజీ రంగంలో ఛాంపియన్ గా నిలిపేలా రాష్ట్ర ప్రభుత్వం దష్టి సారించింది. అమరావతిని క్వాంటం వ్యాలీగా అభివద్ధి చేసే ప్రక్రియలో భాగంగా అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. ఈ క్రమంలో ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియాఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఎడు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో కుదుర్చుకున్న ఈ ఒప్పందాలు సిఎం చంద్రబాబు సమక్షంలో కుదిరాయి. ఎపిలో క్వాంటం ఎఐ రంగాల్లో నైపుణ్యాభివద్ధి, మౌలిక వసతుల కల్పన దిశగా ఈ ఒప్పందాలు ఉపయోగపడనున్నాయి. ఎపిని క్వాంటంఎఐ హబ్ గా తీర్చిదిద్దడం అమరావతిలోని క్వాంటం వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తేవడానికి, ఎపిలో ఎఐక్వాంటం ఎకో సిస్టం పెంపొందించడానికి బాటలు వేసేలా ఈ ఎడు ఎంఓయులను ప్రభుత్వం కుదుర్చుకుంది. అలాగే భవిష్యత్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువతకు ఎఐ క్వాంటం రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రభుత్వ శాఖల్లో ఎఐక్వాంటం వినియోగం, టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దష్టి సారించింది. సిఎం చంద్రబాబు సమక్షంలో కుదుర్చుకున్న 7 ఒప్పందాల వివరాలు ఇలా ఉన్నాయి. క్వాంటం, ఎఐలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎర్పాటు చేసేందుకు యూనైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో ఈ ఎడాది చివరి నాటికి ఎఐ



క్వాంటం ఎక్స్ లెన్స్ సెంటర్ ఎర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఎంఓయూలో పేర్కొన్నారు. ఎఐక్వాంటం డిజిటల్ ఎంబసిగా సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌ను తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించేలా ఈ ఎంఒయూ ఉపకరించనుంది. రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం కార్యక్రమానికి యూఎన్ఐసిసి డైరెక్టర్ సమీర్ చౌహాన్ సహా ఆ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. మరో ఒప్పందంలో గ్లోబల్ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్ ఫాం ద్వారా ఐటీ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేలా ఐబీఎం అంగీకరించింది. భారత్ లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా టెక్ వర్క్ ఫోర్సును సిద్ధం చేసుకునే లక్ష్యాల్లో భాగంగా ఐబీఎం శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించింది. ఒప్పందం కార్యక్రమానికి ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, ఆ సంస్థ దక్షిణాసియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాలాజీ, ఐబీఎం రీసెర్చ్ లాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీ తదితరులు హాజరయ్యారు.ఎపిలో క్వాంటం ఎఐ యూనివర్సిటీ ఎర్పాటుపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎన్ఐఈఎల్ఐటీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. దక్షిణ భారతదేశంలో మొట్ట మొదటి ఎఐ, క్వాంటం డీమ్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను ఎర్పాటు చేసేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ప్రణాళిక రూపొందించింది. మౌలిక సదుపాయాలకు కేంద్రం నిధులు కల్పించనుంది. అలాగే భూమి, క్వాంటం హార్డ్‌వేర్ ను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చేలా ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిని క్వాంటం కంప్యూటింగ్ లో నేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఆ కంపెనీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి, కంట్రోలర్ జనరల్ డాక్టర్ అలోక్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి ఎఐ టెక్ హబ్5 లేయర్డ్ స్వదేశీ ఎఐ స్టాక్ నిర్మించేలా భారత్ జెన్ నెక్స్ జెన్‌ఐబీఎంతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వంలోని వివిధ సంస్థలకు సేవలందించడంతోపాటు 22 భారతీయ భాషలను అనుసంధానించేలా ప్లాట్ ఫామ్ ఎర్పాటు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం కార్యక్రమంలో భారత్ జెన్ సిఈఓ హృషీకేశ్ మోహల్ బాల్, ప్రతినిధి రామకష్ణన్ లు నెక్స్ జెన్ సిఈఓ రాజగోపాల్, ఎఐ ఇంటిగ్రేటెడ్ కరిక్యులమ్, నైపుణ్య శిక్షణ వంటి అంశాలపై ఫోకస్ పెట్టేలా కాలిబో సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం కుదుర్చుకుంది. ఈ ఎంఓయూ కార్యక్రమంలో రాజ్ వట్టికూటి, అరబిందో సాహూ, విపుల్ వలంజీ, పింటో జోయ్సన్, జోహన్నెస్ ష్రోడర్ తదితరులు పాల్గొన్నారు. అమరావతి క్వాంటం వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఎర్పాటు చేసేలా వైజర్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఎడాది చివరి నాటికి 3.50 లక్షల మంది ఎఐక్వాంటం లెర్నర్లు, 2027 నాటికి 6 లక్షల మందిని సిద్ధం చేసేలా ఈ ఒప్పందం ఉంది. ఈ ఎంఓయూలో క్వాంటం సొల్యూషన్స్ హెడ్ వర్ధన్ సెహగల్, రాజ్ వట్టికూటి బందం పాల్గొంది.ఎపిలో ఎఐ ట్యూటర్ ఎర్పాటు అంశంపై ఐఐటీ మద్రాస్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ ను అందుబాటులోకి తీసుకువచ్చేలా ఎంఓయూ కుదిరింది. ఈ కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామ కోటి, ప్రొఫెసర్ మితేష్ పాల్గొన్నారు.

## మళ్లీ అధికారంలోకి వస్తాం : స్టాలిన్

**చెన్నై:** రెండు నెలల్లో డిఎంకె తిరిగి ప్రభుత్వాన్ని ఎర్పాటు చేస్తుందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శుక్రవారం విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టిఎంకె తిరిగి అధికారంలోకి వస్తుందని పేర్కొంటూ, తాను అనేక అభివృ ద్ధి కార్యక్రమాలను ఉత్సాహంగా ప్రారంభిస్తానని అన్నారు. 'తమిళనాడు ప్రజల మాదిరిగానే, రానున్న 2 నెలల్లో డిఎంకె ప్రభుత్వ ం మళ్లీ ఎర్పడుతుందని విశ్వసిస్తున్నానని స్టాలిన్ అసెంబ్లీలో పేర్కొన్నారు. మన సొం త విజయాలను అధిగమించే ద్రవిడ మోడ ల్ 2.0 ప్రభుత్వం ఉంటుందన్నారు. తనకు సేవ చేయడానికి గొప్ప అవకాశం ఇచ్చినందుకు రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలుపు తూ, 'పెరియార్ (హేతువాది నాయకుడు ఇ.వి. రామసామి, పెరరిగ్నార్ అన్నా (మా జీ ముఖ్య



మంత్రి సి.ఎన్. అన్నాదురై), ముత్తమిళరిగ్నార్ కలైగ్నార్ (దివంగత ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి) మార్గంలో ఒక ద్రవిడ నమూనా ప్రభుత్వాన్ని ఎర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. 'నాకు ఇచ్చిన బాధ్యతను నేను చాలా బాగా నిర్వహించానని భావిస్తున్నాను. తమిళనాడును మరింత సంపన్నం చేయగలనని నేను గ్రహించాను. నాకు అవకా శం ఇచ్చినందుకు తమిళనాడు ప్రజలకు నే ను కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని ఈ ఎ న్నికల సంవత్సరంలో చివరి అసెంబ్లీ సమావేశాల ముగింపు సమావేశంలో స్టాలిన్ అ న్నారు. రాష్ట్రంలో దశాబ్ద కాలంగా ఉన్న ఎ ఐఎడిఎంకె పాలనకు ముగింపు పలికిన త ర్వాత మే 2021లో ఆయన ముఖ్యమంత్రి గా బాధ్యతలు స్వీకరించారు.2026-27 స ంవత్సరానికి తాత్కాలిక బడ్జెట్ సమర్పణతో ఫిబ్రవరి 17న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ 'రాబోయే రె ండు నెలల్లో మేము తిరిగి వచ్చినప్పుడు క చ్చితంగా వేగంగా పనిచేస్తామని' అన్నారు. గవర్నర్ ఆర్.ఎన్. రవితో తన సంబంధాలపై స్టాలిన్ మాట్లాడుతూ 'నాకు, గవర్నర్‌కు మధ్య వ్యక్తిగత విభేదాలు ఎవీ లేవన్నారు. అయితే, తమిళ సంస్కృతి, సం ప్రదాయాన్ని కాపాడుకుంటూ ఆయనకు కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అ ని స్పష్టం చేశారు

## దగ్గు మందు మరణాలపై 'సుప్రీం' ఆగ్రహం

**న్యూఢిల్లీ :** ఉజ్బెకిస్థాన్, గాంబియా దేశాలలో భారతీయ దగ్గు మందుల వల్ల పిల్లలు మరణించిన ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. నాణ్యతా ప్రమాణాలు లేని ఔషధాల తయారీ, అమ్మకాలకు పాల్పడిన ఫార్మా సంస్థ, దాని అధికారులకు సమన్లు జారీ చేసింది. డబ్బు కోసమే ఈ వ్యాపారం చేస్తున్నారా... మీ చర్యల వల్ల దేశ ప్రతిష్ట దెబ్బతింటోంది అని ధర్మాసనం మండిపడింది.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS07UB 5592 | Banothu Yakanna | Chevrolet Tavera NEO-P | 2015 |
| 2 | TG27 T0247 | Bhanothu Upendar | Mahindra Jeeto Strong BS6 Diesel | 2024 |
| 3 | TS30TA 6250 | Bhukya Narendar | Mahindra Jeeto BS6 16HP | 2023 |
| 4 | TS30D 4129 | Prashanth Bandi | Kubota MU5501 Combine Harvester | 2019 |

AUCTION DATE:21-02-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No.6-2-7/35-B, 3rd Floor, Hyderabad Raod, Jangaon. Cell - 9000014364 , 98499 11793

# మరోసారి డిఎంకె కూటమికే అవకాశం!

తమిళనాడు 16వ శాసనసభ చివరి సమావేశాలు శుక్రవారం ముగిసాయి. అదే సమయంలో త్వరలో శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యం లో తమిళ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. సినీనటుడు విజయ్ రాజకీయ ప్రవేశంతో ఈ సారి పోటీ ముక్కోణంగా మారింది. ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె కూటమి, మాజీ ముఖ్యమంత్రి పళని స్వామి నేతృత్వంలో బిజెపితో కూడిన ఎన్‌డిఎ కూటమి, సినీ హీరో విజయ్ కొత్త పార్టీ తమిళగ వెట్టి కళగం (టివికె)లు ఎన్నికల్లో తలపడనున్నాయి. వరుస ఎన్నికల్లో డిఎంకె కూటమి విజయపరంపరను కొనసాగిస్తోంది. అయితే, గత ఏడాది ఏర్పాటైన టివికె పార్టీతో రాజకీయ సమీకరణల్లో మార్పులు రావొచ్చనే సంకేతాలు వెలువడ్డాయి. దానిని అడ్డుకట్ట వేసేందుకు స్టాలిన్ తనయుడు, సినిమాలలో ప్రవేశమున్న ఉప ముఖ్యమంత్రిని ఉదయనిధి స్టాలిన్‌ను డిఎంకె ప్రయోగించింది. అలాగే ఇటీవల జరిగిన డిఎంకె యువజన విభాగం సమావేశానికి భారీ సంఖ్యలో యువకులు హాజరవడం ఆ పార్టీలో ఉత్సాహాన్ని నింపింది. దివంగత సినీనటుడు విజయకాంత్ ఏర్పాటు చేసిన డిఎండికె పార్టీ సైతం డిఎంకెతో చేతులు కలిపేందుకు రెండు రోజుల క్రితమే ముందుకు వచ్చింది. ఇప్పటి వరకు ఎన్‌డిఎ కూటమిలో ఉన్న ఆ పార్టీ ఇకపై డిఎంకె కూటమిలో చేరనున్నట్లు విజయకాంత్ సతీమణి ప్రేమలత ప్రకటించారు. ఈ పరిణామం డిఎంకెకు రెండు విధాల కలిసొచ్చింది. స్వంత కూటమిలో ఊగిసలాటను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టడమే కాకుండా, విజయ్‌కాంత్ అభిమానులను తన వైపు తిప్పుకోవడంతో విజయం సాధించినట్లే. ఎక్కువ స్థానాలతోపాటు, మంత్రివర్గంలో చోటు ఆశిస్తున్న కాంగ్రెస్ పార్టీ అవసరమైతే టివికెతో వెళ్ళేందుకు సిద్ధమన్నట్లుగా కాంగ్రెస్ ఎంపి మాణిక్కం ఠాగూర్, రాజకీయ వ్యూహకర్త ప్రవీణ్ చక్రవర్తి పరోక్ష సంకేతాలిచ్చారు. డిఎండికె పొత్తు పరిణామం ద్వారా కాంగ్రెస్ పార్టీకి డిఎంకె విషయం అర్థమయ్యేలా చేసింది. గతంలో బిహార్‌లో సైతం బేరమాడి అధిక సీట్లు పొంది చతికిల పడినప్పటికీ కాంగ్రెస్ గుణపాఠం నేర్చుకోవడం లేదు. తాను నేతృత్వం వహించే కూటమిలో మాత్రం మిత్రపక్షాల విషయంలో చివరి వరకు తెమల్చకుండా, ఆఖరు నిమిషంలో సీట్లు కేటాయించే ఆ పార్టీ, స్థానబలం లేనిచోట తనకు ఎక్కువ సీట్లు కావాల్సిందేనని పట్టుబట్టడం విడ్డూరం. స్టాలిన్ నేతృత్వంలోని 19 రాజకీయ పార్టీలతో కూడిన సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ ఆదర్శవంతమైన కూటమిగా సాగుతోంది. కూటమి భాగస్వాములతో గౌరవప్రదంగా వ్యవహరిస్తూ, తగిన స్థానాలు కల్పిస్తూ దేశంలోనే రాజకీయ కూటములకు ఆదర్శంగా నిలిచారు స్టాలిన్. గత ఏడాది శాసనసభలో ఇచ్చిన మాటను నిలపుకుంటూ ఇటీవల చెన్నైలో కారల్ మార్క్స్ నిలువెత్తు విగ్రహాన్ని సైతం ఆవిష్కరించారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాక, తాజాగా 1.31 కోట్ల మంది మహిళల ఖాతాల్లో కళైగ్నార్ మహిళా హక్కుల పథకం కింద రూ.5వేల నగదు జమ చేసి ప్రత్యర్థులకు అందనంత ఎత్తుకు చేరుకున్నారు.

ఇక అత్యధిక పారితోషికం పొందుతున్న తమిళ నటుడైన విజయ్‌కు యువతలో క్రేజ్ ఉంది. అలాగే రాష్ట్రమంతా ఫ్యాన్ క్లబ్బులే ఆయన పార్టీకి పునాది. ఆది నుంచి సినిమా ప్రభావం తమిళరాజకీయాలపై మెండుగానే ఉంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పని చేసిన కరుణానిధి, ఎం.జి.రామచంద్రన్, జె.జయలలితలు సినీ రంగానికి చెందిన వారే. కాబట్టి, జయలలిత మరణంతో ఏర్పడిన రాజకీయ శూన్యతను తన గ్లామర్‌తో భర్తీ చేయవచ్చనే నమ్మకంతో విజయ్ రాజకీయాలలోకి ప్రవేశించారు. ఒక దశలో ఆయన బిజెపితో కలిసి వెళ్తాడని వార్తలు వచ్చాయి. ద్రవిడ రాజకీయాలు, హిందీ వ్యతిరేకతను జీర్ణించుకున్న తమిళనేలపై ఉత్తరాది పార్టీగా పేరుబడిన బిజెపితో ఆరంభంలోనే కలిసివెళ్ళడం దుస్సాహసమే అవుతుందని దూరంగా ఉన్నారు. తాను మత రాజకీయాలకు వ్యతిరేకమనే ప్రకటన కూడా చేశారు. అనుకున్నట్లుగానే ఆయన సభలకు పెద్ద సంఖ్యలో యువత రావడం మొదలైంది. కానీ, ఆయన ప్రభావం తమ పై పడకుండా ఉండేందుకు డిఎంకె అన్ని రకాలుగా చర్యలు తీసుకుంది. గత ఎన్నికల్లో స్వంతంగా పోటీ చేసి ఓడిపోయిన కమల్ హాసన్ పార్టీని అక్కున చేర్చుకోవడమే కాకుండా, ఆయనను రాజ్యసభ సభ్యుడిని చేసింది.

ఇక ఎన్‌డిఎ కూటమి ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఆ పార్టీ ద్వితీయ స్థానం కోసం పోటీ పడాల్సిన పరిస్థితి. సోషల్ మీడియా వీడియోలతో ప్రచారం పొందిన మాజీ ఐపిఎస్ అధికారి అన్నామలైతో గత ఎన్నికల్లో చేసిన ప్రయోగం వికటించడంతో బిజెపి ఆయనను పక్కనబెట్టింది. అన్నాడిఎంకె ప్రభుత్వాలలో మంత్రిగా పనిచేసిన నయనార్ నాగేంద్రన్‌ను చేర్చుకొని తమిళనాడు పగ్గాలను అప్పగించింది బిజెపి. ఒంటరి పోరుతో గత లోక్‌సభ ఎన్నికల్లో ఘోర ఓటమిని మూటగట్టుకున్న అనుభవంతో ఆయన అనివార్యంగా ఈసారి తన పాత మిత్రుడు పళని స్వామి నేతృత్వంలోని అన్నా డిఎంకె పంచన చేరాల్సి వచ్చింది. అన్నాడిఎంకె అంతర్గత పోరుతో ఆగిపోలేదు. ఇటీవల ఆ పార్టీ సీనియర్ నేత ఎస్.రామచంద్రన్ ఎంజిఆర్ ఎడిఎంకె పార్టీని ఏర్పాటు చేశారు. ఈ నెల 24న జయలలిత జయంతి రోజున శశికళ కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. చివరి రోజు అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత ఎఐడిఎంకె మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో భేటీ అవ్వటం మరో విశేషం.

కాగా అధికారంలో భాగస్వామ్యం, ఎక్కువ సీట్లు డిమాండ్‌లతో తమ పార్టీ కూటమిలో ఇబ్బందులు సృష్టించబోదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల డిఎంకె ఎంపి కనిమొళి ద్వారా స్టాలిన్‌కు స్పష్టమైన సంకేతం పంపారు. టివికెతో పొత్తుపెట్టుకునే సమస్యే ఉత్పన్నం కాదని చెప్పారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరకుండా కూటమిలో కాంగ్రెస్ కొనసాగవచ్చని, అధికారంలో భాగస్వామ్యం కోసం పట్టుదలకుపోతే కూటమి నుంచి వైదొలగవచ్చునని డిఎంకె కాంగ్రెస్‌కు పరోక్ష సంకేతం ఇచ్చినట్లు చెప్పబడుతున్నది. దాంతో కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకున్నట్లుంది. రెండు పార్టీల లక్ష్యం తమిళనాడులో బిజెపి ప్రభావం పెరగకుండా చూడటమే అయినప్పుడు పాత సర్దుబాట్లు, అవగాహన ప్రకారమే ముందుకు సాగటం కూటమికి ప్రయోజనదాయకం. ఈ పరిణామాలన్నీ డిఎంకె కూటమికి సానుకూలంగా మారాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిపక్షాల నడుమ ప్రభుత్వ వ్యతిరేక ఓట్ల చీలిక మరింత లాభం చేకూర్చనుంది. తాము అమలు చేసిన సంక్షేమ పథకాలతో కూడిన ద్రవిడ నమూనా 2.0 వేసవిలో జరిగే ఎన్నికల్లో తమకు ఘనవిజయం సాధించిపెడుతుందని శాసనసభలో చివరి రోజున డిఎంకె అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ విశ్వాసం వ్యక్తం చేయడంలో అతిశయోక్తేమీ కాదు.



## మరోసారి డిఎంకె ప్రభుత్వం ఖాయం

**డిఎంకె ప్రభుత్వం మళ్లీ ఏర్పడుతుంది. డిఎంకె పాలనపై ప్రజలపై నమ్మకం ఉంది. నేను ఈరోజు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను కలిశాను. గత ఐదు సంవత్సరాలుగా ఆయన విజయవంతంగా సుపరిపాలన అందించారు. అందుకు ఆయనకు అభినందనలు తెలిపాను.**

\- తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం



# భారత ఆరోగ్య వ్యవస్థలో ప్రమాద ఘంటికలు

భారతదేశంలో వైద్యం అనేది ఒకప్పుడు పవిత్రమైన సేవగా పరిగణించబడేది, కానీ నేడు అది లాభాలే పరమావధిగా సాగే ఒక క్రూరమైన వ్యాపార సామ్రాజ్యంగా రూపాంతరం చెందింది. ఈ విషయాన్ని సామాన్యులే కాదు, స్వయంగా భారత పార్లమెంటరీ కమిటీ కూడా అంగీకరించడం దేశ ఆరోగ్య వ్యవస్థ ఎంతగా దిగజారిందో తెలియజేస్తోంది. ఇటీవలికాలంలో వెలువడుతున్న పరిశోధనాత్మక నివేదికలు భారత ఆరోగ్యరంగం కుప్పకూలే అంచున ఉందని హెచ్చరిస్తున్నాయి. జీ న్యూస్, వివిధ అంతర్జాతీయ ఆరోగ్య సంస్థల గణాంకాల ప్రకారం, దేశంలో జరుగుతున్న మానవ శస్త్రచికిత్సల్లో సుమారు 44% నకిలీవి, మోసపూరితమైనవి లేదా అసలు అవసరమే లేనివి అని తేలడం అత్యంత విషాదకరం. ఇదే విధమైన దోపిడీ మహిళల ఆరోగ్యం విషయంలో కూడా కొనసాగుతోంది. గర్భాశయ సమస్యలతో వచ్చే మహిళల్లో సుమారు 48% మందికి ఆ అవయవాన్ని తొలగించాల్సిన అవసరం లేకపోయినా, హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలు నిర్వహించి వారి సహజ శారీరక సమతుల్యతను దెబ్బతీస్తున్నారు. అలాగే క్యాన్సర్ ఆపరేషన్ల విషయంలో 47%, మోకాళ్ల మార్పిడి సర్జరీల్లో 48%, మరియు సిజేరియన్ డెలివరీల్లో 45% వరకు కేవలం ఆదాయం కోసమే ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని నివేదికలు ఘోషిస్తున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రుల పనితీరులో వస్తున్న ఈ మార్పులకు ప్రధాన కారణం వైద్యులపై ఉన్న టార్గెట్ల ఒత్తిడి. ప్రస్తుతం పెద్ద ఆసుపత్రుల్లో సీనియర్ వైద్యులకు నెలకు రూ.1,00,00,000(ఒక కోటి రూపాయల) వరకు జీతం ఇస్తున్నారంటే, అది వారి ప్రతిభకు మాత్రమే కాదు, వారు ఆసుపత్రికి తెచ్చే వ్యాపారానికి ఇస్తున్న ప్రతిఫలం. ప్రతి రక్త పరీక్ష, స్కాన్ లేదా ఎక్స్‌రే వెనుక 40% నుండి 50% వరకు కమీషన్లు ఉండటం, రోగికి ఉన్న సమస్య కంటే అతని జేబులో ఎంత డబ్బు ఉందన్న దానిపైనే ఆసుపత్రులు దృష్టిపెట్టడం దురదృష్టకరం.

మరోవైపు, హెల్త్ ఇన్సూరెన్స్ రంగం కూడా ఈ దోపిడీకి ఒక వేదికగా మారిం ది. దేశంలో సుమారు 68% మందికి ఆరోగ్య బీమా ఉన్నప్పటికీ, అవసరమైనప్పుడు క్లెయిమ్ తిరస్కరించబడటం లేదా స్వల్ప మొత్తమే చెల్లించడం జరుగుతోంది. అనేక కార్పొరేట్ ఆసుపత్రులు నకిలీ బిల్లులతో ఇన్సూరెన్స్ కంపెనీలను మోసంచేస్తూ ఇప్పటికే 3,000 వరకు ఆసుపత్రులు బ్లాక్‌లిస్ట్ అయ్యాయి. మరణించిన రోగులను సైతం బ్రతికే ఉన్నారని నమ్మించి, వెంటిలేటర్లపై ఉంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న ఉదంతాలు మానవత్వానికే మాయని మచ్చగా మిగిలిపోతున్నాయి. దీనికి తోడు ప్రాథమిక వైద్యులు రోగులను పెద్ద ఆసుపత్రులకు పంపిస్తూ భారీగా కమీషన్లు దండుకుంటున్నారు. ప్రముఖ ఆసుపత్రులు 40 నుండి 75 మంది వరకు రోగులను పంపిన వైద్యులకు రూ.1,00,000 నుండి రూ. 2,50,000 వరకు రివార్డులు, విదేశీ పర్యటనలు ఆఫర్ చేస్తున్నాయంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఔషధ కంపెనీల పాత్ర కూడా ఇందులో తక్కువ ఏమీ కాదు. సుమారు 25 పెద్ద ఔషధ కంపెనీలు ప్రతి సంవత్సరం రూ.1,000 కోట్ల రూపాయలకు పైగా వైద్యులపై ఖర్చు చేస్తున్నాయి. ప్రజలు తమను తాము రక్షించుకోవాలంటే వైద్యంపట్ల కనీస అవగాహన పెంచుకోవాలి. అనవసర పరీక్షల గురించి ప్రశ్నించడం, శస్త్రచికిత్సలకు ముందు మరో నిపుణుడి అభిప్రాయాన్ని తీసుకోవడం, జనరిక్ మందుల కోసం పట్టుబట్టడం వంటి చర్యలు కొంతవరకు మేలు చేస్తాయి. ఈ వ్యవస్థలో మార్పు రావాలంటే చట్టాలు కఠినతరం కావడమే కాకుండా, సామాన్య ప్రజల గొంతుకలు కూడా ఏకమవ్వాలి. ఈ విస్తుపోయే నిజాలు ప్రతి ఒక్కరికీ చేరినప్పుడే వ్యవస్థలో కదలిక వస్తుంది.

వెంకగారి భూమయ్య,
9848559863

# భారత్ – చైనా సరిహద్దులో అసలేం జరిగింది?


**డాక్టర్ జ్ఞాన్ పాఠక్**

2020లో లద్ధాఖ్‌లో భారతదేశంపై చైనా దురాక్రమణ చేసిన సమయంలో ఇండో–చైనా సరిహద్దులో ఏమి జరిగిందనే అంశం గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా వాస్తవాన్ని దాచిపెడుతోంది. చాలా వివరాలు రహస్యంగా ఉంచాల్సినవి కావొచ్చు. వాటిని బహిర్గతం చేయటం వ్యూహాత్మకంగా సరైనది కాకపోవచ్చు. కానీ భారతదేశ రాజకీయ, రక్షణ నాయకత్వాలు ఏమి చేశాయో తెలుసుకునే హక్కు దేశానికి ఉంది. వీటిని తెలుసుకోవడానికి ఏకైక మార్గం ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణే రాసిన ఆత్మకథ 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'. ఇది ప్రచురించినట్లు అధికారికంగా ప్రకటించక ముందే ముద్రించబడి ఆన్‌లైన్ బుక్‌స్టోర్స్‌లో దుకాణాలలో అమ్ముడవుతోంది. దీని కోసం ప్రచురణకర్త రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం వేచి చూస్తున్నారు. అది ఎప్పటికీ ఇవ్వబోరు.

ఈలోగా, ఈ పుస్తకం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేతుల్లోకి వచ్చింది. సంక్షోభానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రతిస్పందన అంశాన్ని ఆయన లేవనెత్తారు. ప్రభుత్వం వాస్తవానికి సంక్షోభాన్ని సృష్టించిందని, వారి నిర్ణయాలు భారతదేశ జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తడానికి ప్రయత్నించారు. కానీ ఆయన పుస్తకాన్ని ప్రస్తావించడానికి అనుమతించలేదు. ఇది ప్రభుత్వానికి సంబంధించినంత వరకు 'ప్రచురించబడలేదు'. రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రాంగణంలో మీడియాకు పుస్తకం కాపీని చూపించి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చి ఉంటే, దానిని ఆయనకు బహుమతిగా ఇచ్చేవాడినని అన్నారు. 'ప్రచురించబడలేదు' అనే పదాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రయత్నించినప్పుడు సాంకేతికంగా ప్రభుత్వం చెప్పింది సరైనదే కావ చ్చు. మీరు చేయని పనిని మీరు రద్దు చేయలేరు. అదే విధంగా పుస్తకం ఎప్పుడూ 'ప్రచురించబడకపోతే' 'ప్రచురించబడలే' అని మీరు చెప్పలేరు. పుస్తకం 'ప్రచురించబడలేదు' అనే స్థితి చాలా భిన్నంగా ఉంటుంది. పుస్తక పరిశ్రమలో పుస్తకాలు ముద్రణ తర్వాత పంపిణీదారులకు, దుకాణాలకు పంపిస్తారు. ప్రచురణకర్త అధికారికంగా దాని ప్రచురణను ప్రకటించిన తర్వాత వాటిని విక్రయిస్తారు. 'అధికారిక ప్రకటన' సమయం నుండి పుస్తకం అమ్ముడవుతుంది. ఇక్కడ ఒక ప్రచురణకర్త ఏ కారణం చేతనైనా, మార్కెట్ నుండి ఒక పుస్తకాన్ని 'ప్రచురించకుండా' 'రీకాల్' చేయవచ్చు.

పుస్తకం మార్కెట్లో ఉంది అనేది వాస్తవం. భారతదేశంలో కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆన్‌లైన్ స్టోర్‌లలో ఎవరైనా తనిఖీ చేయవచ్చు. ఇది అమెజాన్ ఇండియా ఆన్‌లైన్ స్టోర్‌లో అందుబాటులో ఉంది. కానీ ప్రభుత్వం ఇప్పుడు దానిని ఉపసంహరించుకునేలా చేయగలిగింది. ప్రస్తుతం అది ఎక్కడా కనిపించదు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పై కేసు నమోదు చేయబడింది. అయితే ఈ 'ప్రచురించని' పుస్తకం అమెజాన్ దుకాణంలో అందుబాటులో ఉందని ఆయన అన్నారు. ఆయన చెప్పింది నిజమే. amazon.com (యుఎస్ఎ), amazon. co.uk (UK) వంటి విదేశాలలో అమెజాన్ స్టోర్‌లో పుస్తకాన్ని చూడవచ్చు. అమెజాన్ యుఎస్ఎ, యుకె స్టోర్ పుస్తకం చిత్రాన్ని చూపిస్తుంది. amazon.comలో 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ (యాన్ ఆటోబయోగ్రఫీ) హార్డ్ కవర్ మే 1, 2024, మనోజ్ ముకుంద్ నరవనే (రచయిత)' అని, amazon.co.uk టెక్ట్స్ 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ:యాన్ ఆటోబయోగ్రఫీ, హార్డ్ కవర్ 31, మే 2024'రాసి ఉండడాన్నిచూడవచ్చు. రెండు స్టోర్లలో ప్రచురణ తేదీ స్పష్టంగా కనిపిస్తుంది. అయినప్పటికీ, పుస్తకం కాపీలు ప్రస్తుతం అందుబాటులో లేవు అని వర్గీకరించబడ్డాయి. మీరు ఆప్షన్ చూడండి బటన్ క్లిక్ చేసినప్పుడు ఈ అంశం ఎప్పుడు లేదా తిరిగి స్టాక్‌లోకి వస్తుందో మాకు తెలియదు అని చెప్పే పేజీ మీకు కనిపిస్తుంది. యుఎస్ అమెజాన్ వెబ్‌సైట్‌లో ఒక యూజర్ సమీక్ష ఉంది. అది ఇలా చెబుతోంది– ''రక్షణ మంత్రిత్వ శాఖ భారతదేశం ప్రచురణకు ఆమోదించకముందు అంతర్జాతీయంగా అమ్ముడవుతున్న కాపీలను అమెజాన్ ఉపసంహరించుకున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు పెంగ్విన్, అమెజాన్ ద్వారా ఈ ముందస్తు అనుమతి పొందిన పంపిణీపై భారతదేశంలో వ్యాజ్యం ఉంది... ఇది ఇద్దరికీ, అసంతృప్తి చెందిన జనరల్‌కు ఇబ్బందిని కలిగిస్తుంది.'' అమెజాన్ వెబ్‌సైట్ ప్రచురణ తేదీని స్పష్టంగా చూపిస్తుంది. అందువల్ల అమెజాన్ పుస్తకం ప్రచురణకు సాక్షిగా ఉంది. ఇందులో ISBN సంఖ్యలు కూడా ఉన్నాయి. అమెజాన్ యుఎస్‌లో ప్రొడక్ట్ వివరణ ''పబ్లిషర్:పెంగ్విన్ వీర్, ప్రచురణ తేదీ: మే1,2024, భాష: ఇంగ్లీష్, ముద్రణ పొడవు: 448 పేజీలు, ISBN10: 0670099759, ISBN13: 9780670099757, వస్తువు బరువు: 1.43 పౌండ్లు, కొలతలు: 8.46 x 5.51 x 1.14 అంగుళాలు.''

అయితే, లోక్‌సభలో రాహుల్ గాంధీ పుస్తకం నుండి కోట్ చేయాలనుకున్నప్పుడు, ప్రభుత్వం 2020 ఇండియా– చైనా సరిహద్దు ప్రతిష్టంభనను ఎలా నిర్వహించిందనే దానిపై ప్రశ్నలు లేవనెత్తడానికి ప్రచురించిన కథనాన్ని ఉపయోగించినప్పుడు, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సహ బిజెపి నాయకులు ఆయన ఉటంకించిన విషయాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రచురించని విషయాలను, ముఖ్యంగా రక్షణ విషయాలకు సంబంధించిన వాటిని పార్లమెంటులో ఉటంకించలేమని, పుస్తకం అధికారికంగా అందుబాటులో లేదని వారు వాదించారు. వారి ప్రకటన రెండు విషయాలపై ఆధారపడి ఉంది. మొదటిది రక్షణ మంత్రిత్వ శాఖ ప్రచురణకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. సున్నితమైన వివరాలతో కూడిన సైనిక జ్ఞాపకాల ప్రచురణకు ఇది అవసరం. రెండవది అది 'అధికారికంగా అందుబాటులో లేదు'. పుస్తకం ఉనికిలో లేదని వారు నొక్కి చెప్పారు. ఇది సరైనది కాదు, ఇది పార్లమెంటును తప్పుదోవ పట్టించేది. ఇది సభ సభ్యుల పార్లమెంటరీ హక్కులకు భంగం కలిగిస్తోంది. రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం లేకుండా పుస్తకం ముద్రించబడి, ప్రచురించబడి, విక్రయించబడిందని ఇప్పుడు మన దగ్గర రుజువు ఉంది అనేది వాస్తవ స్థితి. ఆ పుస్తకం 'అధికారికంగా అందుబాటులో లేదు' అని పార్లమెంటులో బిజెపి నాయకులు అంగీకరించడం కూడా పుస్తకం వాస్తవ స్థితిని పరోక్షంగా అంగీకరించడమే. అది వాస్తవానికి ఉనికిలో ఉందని కూడా సూచిస్తుంది.



లోకసభ స్పీకర్ ఈ విషయంపై తదుపరి చర్చను నిరోధించడానికి, 'ప్రచురించని మూలాల' నుండి చదవకుండా నిరోధించడానికి పార్లమెంటరీ నియమాలను (నియమం 349 వంటివి) ఉదహరించారు. అయితే, పుస్తకంతోపాటు ఆన్‌లైన్ స్టోర్లలో ప్రచురణ తేదీ, ISBN సంఖ్యలు ఉన్నందున ఇది వాస్తవంగా తప్పు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని మాట్లాడటానికి, ఈ అంశం పై కోట్ చేయడానికి అనుమతించకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష ఎంపిల నిరసన కారణంగా పార్లమెంటరీ కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలిగింది, సభను వాయిదా వేశారు. రాహుల్ గాంధీ పుస్తకంలోని అంశాలను కూడా ధృవీకరించారు, తద్వా రా అతను పార్లమెంటులో సారాంశాలను చదవగలడు. కానీ ఆయనను అనుమతించలేదు. నిరసనల ఫలితంగా ఎనిమిది మంది ఎంపిలు సస్పెన్షన్‌కు గురయ్యారు.

జనరల్ నరవాణే, ప్రచురణకర్త వివాదంలోకి దించబడ్డారు. మాజీ ఆర్మీ చీఫ్ బహిరంగంగా స్పందించారు. ప్రచురణకర్తలు పుస్తకం స్థితిని స్పష్టం చేశారు. ఢిల్లీ పోలీసులు ఎవరి ఆదేశాల మేరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారో ఆ మోదీ ప్రభుత్వం నుండి వచ్చే ఇబ్బందుల నుండి ఇద్దరూ తమను తాము రక్షించుకోవడానికి ఇలా ముందుకు వచ్చారు. ప్రచురించని పుస్తకం ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ చేతుల్లోకి ఎలా వచ్చిందోనని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవాణే జ్ఞాపకాల పుస్తకం 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'కి ప్రత్యేకమైన ప్రచురణ హక్కులను కలిగి ఉన్నట్లు, ఆ పుస్తకం ఇంకా ప్రచురించబడలేదని ప్రచురణకర్త పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఒక ప్రకటన చేసింది. ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి పుస్తకం అక్రమ సర్క్యులేషన్‌పై దర్యాప్తు ప్రారంభించిన తర్వాత ప్రచురణకర్త ప్రకటన వచ్చింది. 'ప్రచురించని' రచనకు సంబంధించిన లీక్ లేదా ఉల్లంఘనపై వివరణాత్మక దర్యాప్తు కోసం ఈ కేసును స్పెషల్ సెల్‌కు అప్పగించినట్లు సమాచారం. 'భారత సైన్య మాజీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణే రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తక ప్రచురణ హక్కులను మేము మాత్రమే కలిగి ఉన్నాము. ఈ పుస్తకం ప్రచురణలోకి రాలేదని మేము స్పష్టం చేయాలనుకుంటున్నాము' అని ప్రచురణకర్త చెప్పారు. ప్రచురణకర్త డిజిటల్ రూపంలో ముద్రించిన కాపీలు ప్రచురించబడలేదు, పంపిణీ చేయబడలేదు, విక్రయించబడలేదు లేదా అందుబాటులో ఉంచబడలేదు' అని కూడా ప్రచురణకర్త చెప్పారు, అయితే దాని అనధికార పంపిణీ కాపీరైట్ ఉల్లంఘనగా పరిగణించబడుతుందని చెప్పారు.

జనరల్ నరవాణే ఫిబ్రవరి 10న ఎఫ్ఐఆర్ తర్వాత ఒక రోజు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో 'ఇది పుస్తకం ప్రస్తుత స్థితి' అనే శీర్షికతో ఒక ప్రకటన చేశారు, దాని కింద పెంగ్విన్ ఇండియా ప్రకటనను ఉంచారు.

ఇప్పుడు అసలు ప్రశ్న చైనా దురాక్రమణకు మోదీ ప్రభుత్వం ఇచ్చిన ప్రతిస్పందనలో నిజం ఏమిటి అనే దాని నుండి పుస్తకం 'ప్రచురించబడిందా', 'ప్రచురించబడలేదా' లేదా 'ప్రచురించబడలేదు' అనే దానివైపు మళ్ళింది. పుస్తకం కాపీ రాహుల్ గాంధీకి చేరుకోవడంలో చట్టవిరుద్ధం ఏమిటి అనే దానివైపు మళ్ళింది. జాతీయ ప్రాముఖ్యత కలిగిన సత్యాన్ని అణచివేసినట్లే. ప్రభుత్వం కొంతమందిని జైలులో పెట్టే అవకాశం కూడా ఉంది. కానీ నిజం ఏమిటి? ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ప్రచురణకర్త ముద్రించిన పుస్తకం వివరణలో, జనరల్ నరవాణే తన జీవితం, వివిధ కాలాలు, ఆయన పాత్ర ను రూపొందించిన అనుభవాల గురించి సరళమైన, హృదయపూర్వకమైన కథనాన్ని రాశారు. బాల్యం నుండి తాను సేవలో ఉన్న సంవత్సరాల వరకు, సోపానక్రమం ద్వారా భారత సైన్యం ఇరవై ఎనిమిదవ అధిపతిగా ఎదిగారు.''

పుస్తకం చట్టబద్ధంగా ప్రచురించబడినా, లేకున్నా, అందుబాటులో ఉంది. వాస్తవానికి ఇది ముద్రించబడింది, ప్రచురించబడింది, పంపిణీ చేయబడింది, విక్రయించబడింది. అయితే, అసలు ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. చైనా దురాక్రమణ సమయంలో ఏమి జరిగింది, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రతిస్పందన ఏమిటి? దేశానికి నిజం తెలుసుకునే హక్కు ఉంది. జనరల్ నరవాణే పుస్తకాన్ని ఆమోదించకుండా ఆయన మాటలను అణచివేయకూడదు. నేరుగా సంక్షోభం సాక్షి భారత మాజీ ఆర్మీ చీఫ్ నుంచి వచ్చిన కథనం ఆధారం గా పౌరులు తమ సొంత అభిప్రాయాన్ని కలిగి ఉండటానికి అవకాశం ఇవ్వాలి.

(ఐపిఎ సర్వీస్)

# మేధస్సు వ్యవస్థలలో నమ్మకాన్ని నిర్మించడం ఎఐ కర్తవ్యం

కృత్రిమ మేధస్సు పరిశోధనా రంగంగా ప్రారంభమై, ఇప్పుడు ప్రభుత్వం, పరిశ్రమలు దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే ప్రాథమిక సాంకేతికతగా వేగంగా అభివృద్ధి చెందింది. ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ, విద్య, భద్రత ప్రజా విధానాల వంటి రంగాల్లో ఎఐ ఆధారిత వ్యవస్థలు కీలక నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బాధ్యతాయుత అభివృద్ధి, పరిపాలన అత్యంత అవసరంగా మారింది. బాధ్యతాయుత ఎఐ అనేది మేధస్సుగల వ్యవస్థలు నైతికత, పారదర్శకత, బాధ్యతతో కూడిన సామాజిక విలువలకు అనుగుణంగా రూపకల్పన చేయబడి, అమలు చేయబడి, నిర్వహించబడేలా చేసే ఒక వ్యవస్థీకృత రూపకల్పన. బాధ్యతాయుత ఎఐ అనగా హానిని తగ్గించే, పక్షపాతాన్ని తగ్గించే, గోప్యతను రక్షించే సమానత్వం, భద్రతను ప్రోత్సహించే విధంగా ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడం, ఉపయోగించడం. ఇది కేవలం సాంకేతిక పనితీరుకే పరిమితం కాకుండా, సమాజంపై విస్తృత ప్రభావం, చట్టపరమైన అనుసరణ, నైతిక సమన్వయాన్ని కూడా కలిగి ఉంటుంది. నైతిక ఎఐ ప్రధానంగా న్యాయం, మానవ హక్కులు వంటి నైతిక అంశాలపై దృష్టి పెడితే, బాధ్యతాయుత ఎఐ అనేది నైతికత, ప్రమాద నిర్వహణ, నియంత్రణ అనుసరణ, కార్యాచరణ బాధ్యతలను సమగ్రంగా కలిగిన పరిపాలనా నమూనా. 2010 దశకంలో బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, డీప్ లెర్నింగ్ అభివృద్ధి కారణంగా మెషిన్ లెర్నింగ్ విస్తృతంగా ఉపయోగించబడింది. దీనివల్ల అల్గారిథమిక్ పక్షపాతం, అపారదర్శక నిర్ణయ ప్రక్రియలు, వ్యక్తిగత డేటా దుర్వినియోగం, బాధ్యతాలోపం వంటి నైతిక సవాళ్లు ఉద్భవించాయి. ప్రస్తుతం జనరేటివ్ ఎఐ వ్యవస్థలు సంస్థల్లో వేగంగా అమలవుతున్నందున ఈ సవాళ్లు మరింత ప్రాముఖ్యత పొందాయి.

**నమ్మకపు స్తంభాలు**

ఎఐ స్వీకరణకు నమ్మకం ప్రాథమిక ఆధారం. భాగస్వాములు ఎఐ వ్యవస్థలపై ఆధారపడాలంటే కొన్ని ముఖ్యమైన అంశాలు అవసరం. అనేక ఆధునిక ఎఐ నమూనాలు, ముఖ్యంగా డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లు, బ్లాక్ బాక్స్ లాగా పనిచేస్తాయి. ఒక వ్యవస్థ ఏ నిర్ణయం ఎందుకు తీసుకుందో అర్థం కావాలి. ఖచ్చితత్వం పరీక్షలు, ధృవీకరణ ప్రక్రియలు విశ్వసనీయతను పెంచుతాయి. డేటా మూలాలు, నమూనా ఎంపికలు, ప్రక్రియల డాక్యుమెంటేషన్ ట్రేసబిలిటీ నిర్ధారిస్తుంది.



డేటాలో ఉన్న చారిత్రక అసమానతలు లేదాతక్కువ ప్రాతినిధ్యంవల్ల పక్షపాతం ఏర్పడవచ్చు. విభిన్నమైన, ప్రాతినిధ్య డేటాసెట్‌లు, పక్షపాతం అవగాహన కలిగిన అల్గారిథమ్‌లు, ఫెయిర్‌నెస్ ప్రమాణాలు, సమీక్షా కమిటీలు సమానత్వాన్ని నిర్ధారించడంలో సహాయపడతాయి. అలాగే దృఢత్వం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఎఐ వ్యవస్థలు అసాధారణ పరిస్థితులు లేదా దాడులను తట్టుకునేలా ఉండాలి. నిరంతర పర్యవేక్షణ, సైబర్ భద్రతా చర్యలు, పరీక్షలు అవసరం.పారదర్శకత ఎఐ ఎలా నిర్మించబడింది, ఎలా అమలైంది అన్న విషయాల్లో స్పష్టత ఉండాలి. డేటా మూలా లు, శిక్షణ విధానాలు, పరిమితులు వెల్లడించాలి. ఈ మధ్యకాలంలో గోప్యత రక్షణ ప్రముఖంగా వినిపిస్తోంది. ఎఐ వ్యవస్థలు వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించే సందర్భంలో డేటా పరిపాలన, చట్టబద్ధ ప్రాసెసింగ్, అవగాహనతో సమ్మతి, భద్రతా చర్యలు తప్పనిసరి.

**బాధ్యతాయుత ఎఐ ఎందుకు ముఖ్యం?**

ఎఐ 2020లలో అత్యంత ప్రభావవంతమైన సాంకేతికతగా భావించబడుతోంది. వ్యక్తులు, సంస్థలు కీలక నిర్ణయాలకు అల్గారిథమ్‌లపై ఆధారపడుతున్నందున, అవి నమ్మదగినవిగా ఉండాలి. బాధ్యతాయుత ఎఐ పక్షపాతాన్ని తగ్గిస్తుంది, పారదర్శకతను పెంచుతుంది, చట్టపరమైన అనుసరణను నిర్ధారిస్తుంది, భాగస్వాముల నమ్మకాన్ని బలోపేతం చేస్తుంది. ఎఐ జీవచక్రంలో ముందుగానే ప్రమాదాలను గుర్తించడం ద్వారా సంస్థలు చట్టపరమైన, సామాజిక ప్రమాదాలను తగ్గించగలవు. అమలు విధానం బాధ్యతాయుత ఎఐ అమలు ఒకే దశలో పూర్తయ్యే ప్రక్రియ కాదు; ఇది మొత్తం జీవచక్రంలో సమన్వయంతో ఉండాలి. సంస్థలు మొదట తమ విలువలకు అనుగుణమైన స్పష్టమైన సూత్రాలను నిర్వచించాలి. ఎఐనిపుణులు, న్యాయ నిపుణులు, నైతిక శాస్త్రవేత్తలు మరియు వ్యాపార నాయకుల భాగస్వామ్యంతో విధానాలు రూపొందించాలి. ప్రభావ మూల్యాంకనాలు, పక్షపాతం పరీక్షలు, నిరంతర ఆడిట్లు, మానవ పర్యవేక్షణ అనివార్యం. గోప్యత, భద్రతతా చర్యలను నిరంతరం నవీకరించాలి. భవిష్యత్తు దిశ బాధ్యతాయుత ఎఐ ఒక నిరంతర నిబద్ధత. ఎఐ సాంకేతికతలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ పరిపాలనా రూపకల్పనలు కూడా అనుసరించాలి. పరిశ్రమ, అకాడెమియా, విధాన నిర్ణేతలు, పౌర సమాజం కలిసి పని చేయడం ద్వారా మాత్రమే సాంకేతిక నవీనత సామాజిక విలువలకు అనుగుణంగా ఉంటుంది. సమానత్వం, పారదర్శకత, బాధ్యత, గోప్యత, భద్రతను తమ ఎఐ వ్యూహాలలో సమగ్రపరిచే సంస్థలు కేవలం ప్రమాదాలను తగ్గించడమే కాకుండా దీర్ఘకాలిక నమ్మకాన్ని నిర్మించగలవు. అల్గారిథమ్‌ల ఆధిపత్యం పెరుగుతున్న ఈ ప్రపంచంలో, నైతికమైన, నమ్మదగిన మేధస్సు గల వ్యవస్థలకు బాధ్యతాయుత ఎఐ బలమైన పునాది అందిస్తుంది.

ప్రొ. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

## కన్నతండ్రిని కడతేర్చిన కసాయి కొడుకు

తాగుడు మత్తులో దారుణం -సమభావన సంఘం డబ్బులపై వివాదం



**ప్రజాపక్షం/నకిరేకల్ (శాలిగౌరారం):** నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని బండమీదిగూడెం గ్రామంలో గురువారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. తాగుడు మత్తులో కుమారుడు కన్న తండ్రిని హత్య చేసిన సంఘటన స్థానికులను కలచివేసింది.గ్రామానికి చెందిన బుర్రె సత్తయ్య యాదవ్ (60) భార్య లింగమ్మ (55) అవసరాల కోసం సమ భావన సంఘం నుంచి కొంత మొత్తాన్ని తీసుకుంది. ఆడబ్బులు తనకు ఇవ్వాలని కుమారుడు బుర్రె బాలకృష్ణ (32) తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగాడు. మద్యం కోసం డబ్బులు కావాలని అతడు ఒత్తిడి చేసినట్లు సమాచారం. మాటల తగాదా తీవ్రరూపం దాల్చడంతో బాలకృష్ణ ఇంట్లో ఉన్న తండ్రి సత్తయ్యను బయటకు లాగి సీసీ రోడ్డుపై బలంగా నెట్టివేశాడు. తలకు తీవ్ర గాయమై సత్తయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.బాలకృష్ణకు మద్యం, గంజాయి అలవాటు ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నిత్యం మద్యం సేవించి ఇంట్లో గొడవలు సృష్టించేవాడని తెలిపారు. మృతుడి భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

అధికారుల కనుసన్ననలో ఇసుక అక్రమ రవాణా

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామంలోని బిక్కేరువాగు నుండి ఉదయం రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ వాగు నుండి ఇసుకను మొత్తం తోడేస్తున్నారని, అధికారుల కనుసన్ననలో ఈ అక్రమ ఇసుక దందా సాగుతూ మూడు ట్రాక్టర్లు ఆరు టిప్పర్లుగా కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురుస్తుందని అధికారుల మామూళ్ల మత్తులో మునిగి ఇసుకను మొత్తం వాగు నుండి తోడేస్తుండదంతో కాలువపై ఆధారపడి పంటలను పండిస్తున్న రైతులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని, వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో ఇసుక మొత్తం వాగు నుండి తోడేస్తే వాగు చుట్టుపక్కల గ్రామాలలో రైతులు వేసిన పంటలకు భూగర్భ జలాలు లేక ఎండిపోయి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకొని ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని బొట్ల సుదర్శన్ ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.

## నల్లగొండ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆదిరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ని సిపిఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి శుక్రవారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్‌కు శాలువా కప్పి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా ఆదిరెడ్డి మాట్లాడుతూ నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం,తాగునీటి సరఫరా వంటి అంశాలలో మేయర్ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేయాలి అన్నారు.ఈ కార్యక్రమంలో శాంతి సంఘీభావ సంఘం జిల్లా అధ్యక్షులు కట్ట వెంకటరెడ్డి, మాజీ కౌన్సిలర్ కయ్యూం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 రిజర్వేషన్లు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు

బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాబోయే ఎంపిటిసి,జడ్‌పిటిసి ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి లకు పాత విధానంలో 17 శాతం మాత్రమే అమలు చేసి ఎన్నికలకు వెళితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం అవుతాయని అన్నారు.42 శాతం రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.గత ఏడాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు,ధర్నాలు, ర్యాలీలు,నిరాహార దీక్షలు,రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడబోయిన సాయికుమార్,అనంత్ నాగరాజుగౌడ్,కొంపెల్లి రామన్న గౌడ్,కుందారపు శివ,తాదూరి మహేష్,వీరేటి కృష్ణ,అంబటి స్వామి,భాషపాక శ్రీహర్ష,బైరగోని చందు,గుండబోయిన చరణ్ తేజ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సిఎం కప్ కబడ్డీ పోటీలకు చెరుకుపల్లి విద్యార్థులు

**ప్రజాపక్షం/డిండి;** నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సిఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో గుండ్లపల్లి మండలం, చెరుకుపల్లి జెడ్పిహెచ్‌ఎస్ విద్యార్థినులు ఎంపికయ్యారు. కబడ్డీ బాలికల విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచిన ఇస్లావత్ మౌనిక పదవ తరగతి, జర్పుల రేణుక, తొమ్మిదవ తరగతి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ (బాలికల విభాగం) ఇస్లావత్ మౌనిక, జర్పుల రేణుక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెరుకుపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులను మండల విద్యాశాఖ అధికారి ఇస్లావత్ గోప్యానాయక్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించడం గర్వకారణం అని, రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చాటి జిల్లా కు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.




# కాంగ్రెస్‌పై ప్రజల్లో బలమైన విశ్వాసం

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో వరుస విజయాలతో దూసుకుపోతూ కాంగ్రెస్ బలమైన శక్తిగా ఎదుగుతుందని ప్రజల్లో బలమైన విశ్వాసం పెరిగిందని రానున్న రోజుల్లో రెండో దఫా రాష్ట్రంలో అధికారం చేపడుతుందని రెండవసారి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పోచంపల్లి మున్సిపాలిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన తడక వెంకటేశ్వర్లు పదవి బాధ్యల స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 90 శాతం మున్సిపాలిటీ చైర్మన్లు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం అభివృద్ధి సంక్షేమానికి ఓటర్లు జై కొట్టారని సంతోషం వ్యక్తం చేశారు. తను ఎమ్మెల్యేగా గెలిచిన కొద్ది సంవత్సరాల్లోనే పోచంపల్లి పట్టణానికి దాదాపు రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసి మౌలిక వసతుల కల్పనకు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు : చైర్మన్**

పోచంపల్లి మున్సిపాలిటీ చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన తడక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోచంపల్లి మున్సిపాలిటీలో అత్యవసర వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉండేలా డాక్టర్లను నియమించాలని ఎమ్మెల్యేని కోరారు. విద్యార్థులు, వ్యాపారస్తులు నిత్యం పట్టణానికి హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారిలో వాళ్లకు రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు బస్సులు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్స్ కొండమడుగు ఎల్ల స్వామి, రావుల జంగయ్య, దేవరాయ కుమార్, జింకల లావణ్య, యాదగిరి ముదిరాజ్, సూరేపల్లి రాధిక రమేష్ పాల్గొన్నారు.

# యాదాద్రి జిల్లాలో డ్రగ్స్ అరికట్టేందుకు చర్యలు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో డ్రగ్స్ వినియోగం , అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు నెలల్లో కొత్తగా ఎన్ని కేసులు నమోదు అయ్యాయని ఆరా తీసి డ్రగ్స్ ఏమైనా పట్టుకున్నారా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మూత పడిన కంపెనీలు, చిన్న చిన్న కంపెనీల పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. మూత పడిన కంపెనీలలో ఏమైనా డ్రగ్స్ తయారీ, సరఫరా చేస్తున్నారా అని తనిఖీ చేసి రీ ఓపెన్ చేస్తే కేసులు నమోదు చేసి తగు చర్యలు చేపట్టాలన్నారు. మెడికల్ షాపులు కూడా నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. కొత్తగా గ్రామపంచాయతీలు ఏర్పడినందున సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. అందులో భాగంగా సర్పంచ్‌లకు కూడా మత్తు పదార్థాల నియంత్రణ పై శిక్షణ ఇచ్చి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మున్సిపాలిటీలలో కొత్త పాలక వర్గాలు ఏర్పాటు అయ్యాయి కాబట్టి వార్డ్ మెంబెర్‌లకు కూడా అవగాహన కల్పించి వార్డులలో ఏమైనా గంజాయి, మత్తు పదార్థాలు వాడుతున్నా, ఏమైనా అనుమానాలు ఉంటే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలో అంద రూ సమన్వయంతో డ్రగ్స్ నిర్మూలన జిల్లాగా ఉండేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీ నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహ రావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి మనోహర్, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత

మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి

మేకల అభినవ్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి సిఎం కప్ ఖో..ఖో పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శుక్రవారం నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్ డోర్ స్టేడియంలోరాష్ట్రస్థాయి సీఎం కప్ ఖో..ఖో క్రీడా పోటీలను కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు.క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్ అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి ఇలాంటి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీలు క్రీడాకారులకు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు పేద విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటూ ఆర్థిక సహాయం అందిస్తున్నారని అన్నారు.జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి జూనియర్ ఖో..ఖో.. పోటీలు నిర్వహించడం 33 జిల్లాల క్రీడాకారులు కష్టపడి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు.గ్రామీణ స్థాయి నుంచి విద్యార్థులను గుర్తించి తోడ్పడదించడమే సిఎం కప్ పోటీల ముఖ్య ఉద్దేశం అని అన్నారు.రాష్ట్రస్థాయిజూనియర్ బాలికలకు, బాలురకు కోకో పోటీలను జిల్లాలో నిర్వహించడం గర్వంగా ఉందని తెలిపారు.

# పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

ఇంటర్ విద్య జాయింట్ డైరెక్టర్ భీమ్‌సింగ్




**ప్రజాపక్షం/సూర్యాపేట :** పరీక్షల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఇంటర్ విద్య జాయింట్ డైరెక్టర్ భీమ్‌సింగ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిఐఈఓ భానునాయక్ అధ్యక్షతన నిర్వహించిన సిఎస్ డిఓల ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పరీక్షలకు గత మూడు నెలలుగా విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి కళాశాలలో అధ్యయన తరగతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి కళాశాలలో నిఘా నేత్రాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో చీఫ్ సూపర్డెంట్ డిపార్టుమెంట్ ఆఫీసర్‌తోపాటు ప్రైవేటు జూనియర్ కళాశాల సెంటర్లలో ఏసిఎస్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాలను మానిటరింగ్ చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్ష కేంద్రాలలో ఉన్న సిసి కెమెరాలను అనుసంధానం చేసి హైదరాబాద్ కమీషనరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ప్రత్యేకంగా 13 ఒకేషనల్ సెంటర్లు ఏర్పాటు చేయగా అందులో మూడు ప్రత్యేక సెంటర్లు ఉన్నాయన్నారు. అందుకు అనుగుణంగా అనుభవం ఉన్న అధ్యాపకులను నియమించినట్లు వివరించారు. డిఐఈఓ భాను నాయక్ మాట్లాడుతూ ఈసారి పరీక్షలకు అనుభవజ్ఞులైన సీనియార్టి అధ్యాపకులను బోర్డు నుంచే నియమించినట్లు తెలిపారు. సిఐఆర్‌టి ప్రకారం జాబితాలను బోర్డుకి పంపించగా ర్యాండమైజేషన్‌లో అధ్యాపకులకు డ్యూటీలు వేశారని పేర్కొన్నారు. శుక్రవారం నుంచే నియమించబడిన ఉద్యోగులు వారి వారి డ్యూటీలో జాయిన్ కావాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చైర్మన్‌గా, ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు నిరంతరం పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సీనియర్ అధ్యాపకుల బృందం ఇద్దరిని ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామన్నారు. సిఎస్‌డిఓలుగా నియమింపబడిన అధ్యాపకులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి విధిగా పేపర్లు తీసుకురావడం పరీక్షలు పూర్తయిన తరువాత మళ్లీ పోస్ట్‌ఆఫీసులో డిపార్ట్ చేయడం వారి బాధ్యత అన్నారు. ఎలాంటి అవకతవకలు జరిగిన సిఎస్‌డిఓలతోపాటు గదులలో మాల్ ప్రాక్టీస్ నిర్వహిస్తే ఇన్విజిలేటర్లను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసి సభ్యులు రాజమోహన్, వీడిసి ప్రసాద్, ప్రిన్సిపాల్స్ పెరుమాళ్ల యాదయ్య, విజయ నాయక్, మారం హరిప్రసాద్, మృత్యుంజయ, మద్దిమడుగు సైదులు, శీను పాల్గొన్నారు.

## రోగులకు మైరుగైన వైద్య సేవలందించాలి



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పరిసర ప్రాంత ప్రజలకు అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రారంభిస్తున్న శ్రీలేఖ హస్పటల్ యాజమాన్యం మైరుగైన వైద్యసేవలందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు సూచించారు. శుక్రవారం హుజూర్‌నగర్ రోడ్డులో చైర్‌పర్సన్ ఆసుపత్రిని ప్రారంభించి మాట్లాడారు. లక్షలాది రూపాయలు వెచ్చించి చికిత్స నిమిత్తం దూర ప్రాంతాలకు వెళాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అన్ని హంగులతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఆర్థిక పరిస్థితులను గమనించి రోగులకు వైద్య సేవలందించాలని సూచించారు. అనంతరం ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు మాట్లాడుతూ వ్యాపార దృక్పదంతో రోగులకు సేవలందించాలన్నారు. ఎండి, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు మీసా రోహిత్, ప్రసూతి వైద్యురాలు కూరపాటి శ్రీలేఖతో పాటు మరో ఇరువురు యువ వైద్యులు సేవలందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కారింగుల అంజన్‌గౌడ్, డాక్టర్ దశరథ, వైద్యులు రామారావు, అశోక్, గౌరినాథ్, ప్రసాద్, కరుణశ్రీ, సురేష్, కొత్తమాసు జానార్ధన్ పాల్గొన్నారు.



## నల్లగొండ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి సమగ్ర మాస్టర్ ప్లాన్

కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలో సహజ,ఆధ్యాత్మిక,చారిత్రక ప్రాధాన్యత గల ప్రదేశాలను అభివృద్ధి చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో టూరిజం పై నిర్వహించిన సమావేశంలో పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై సమీక్షించారు.పచ్చల ఛాయా సోమేశ్వర ఆలయం, లతీఫ్ సాబ్ గుట్ట, కాపురాల గుట్టపై రోప్‌వే ఏర్పాటు, డిండి ప్రాజెక్ట్ వద్ద బోటింగ్ సదుపాయాల విస్తరణ,దేవరచర్ల శివాలయం, కాశిరాజుపల్లి ఏలేశ్వరం, ఏకేబీఆర్ అజిలాపురం జలపాతం, పాలెం లక్ష్మీనరసింహస్వామి ఆలయం,నెల్లికల్లు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాలను అభివృద్ధి చేసే అంశాలపై చర్చించారు. గుట్టల ప్రాంతాల్లో రోప్‌వేలు, వ్యూ పాయింట్లు ఏర్పాటు చేసి ప్రత్యేక అనుభవం కల్పించాలని, సంబంధిత ప్రాజెక్టులకు సాంకేతిక సాధ్యత నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.జలపాతాలు,అడవి ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధి చేసి ప్రకృతి సంరక్షణకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఏఎస్పీ రమేష్, ఆర్డీవోలు, జిల్లా యువజన క్రీడల అధికారి అక్బర్ అలీ, బుద్ధవనం ఇంచార్జ్ శ్యాంసుందర్,టూరిజం,అటవీ,ఆర్కియాలజీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పారిశ్రామిక సంస్థలు,రైస్ మిల్లర్లు,వాణిజ్య బ్యాంకులు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద అవసరమైన రంగాలలో క్రమ పద్ధతిలో జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా అతిపెద్ద జిల్లా అని ,అనేకమంది నిరు పేదలకు వివిధ రంగాలలో సహకారం అవసరం ఉందని,దీనిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యంగా విద్య,వైద్యం,సంక్షేమ రంగాలలో పేద ప్రజలకు సహకారం అందించడానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పరిశ్రమలు,రైస్ మిల్లులు,వాణిజ్య బ్యాంకుల వంటివి సంస్థలు ముందుకు రావాలని కోరారు.ఒకే ప్రాంతంలో, కొన్ని రంగాలలో మాత్రమే పారిశ్రామిక సంస్థలు, ఇతరులు సిఎస్ఆర్ నిధులు అందజేయడం వల్ల ఒక ప్రాంతం మాత్రమే అభివృద్ధి చెందుతుందని,అలా కాకుండా ఒక క్రమ పద్ధతిలో అన్ని రంగాలలో సహకారం అందిస్తే బాగుంటుందని తెలిపారు.ఇందుకుగాను ఆయా పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలు,బ్యాంకర్లు, రైస్ మిల్లర్లు అంగీకరించడమే కాకుండా జిల్లా కలెక్టర్ చర్యకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ సతీష్,వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు,రైస్ మిల్లర్లు,బ్యాంకు నియంత్రణ అధికారులు పాల్గొన్నారు.

## తప్పని యూరియా తిప్పలు

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని శెట్టి పాలెం గ్రామానికి చెందిన రైతులు యూరియా కోసం కోఆపరేటివ్ బ్యాంకు దగ్గర పడిగాపులుగా, రైతులు తెలిపిన వివరాల ప్రకారం పంట చేతికి వచ్చే దశలో యూరియా అందక పంట అంతా నేలపాలయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని గత పది రోజులుగా యూరియా కోసం ఆన్‌లైన్ కేంద్రాల చుట్టూ కోఆపరేటివ్ బ్యాం కు చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నామన్నారు. ప్రతిరోజు కోపరేటివ్ బ్యాం కు అధికారులు సాయంత్రం వస్తుంది రేపు ఉదయం 6 గంటలకు వస్తుందని కాలం వెళ్లదీస్తున్నారు తప్ప యూరియా అందించలేకపోతున్నారన్నారు.



# యాదగిరిగుట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

మత్స్యావతారంలో మెరిసిన స్వామివారు!

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** లోక రక్షకుడైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో నిత్యారాధనల అనంతరం శ్రీస్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శోభాయమానంగా అలంకరించిన మత్స్యావతార మూర్తిని తిరువీధుల్లో ఊరేగిస్తుండగా భక్తులు నీరాజనాలు పలికారు.

**మత్స్యావతార విశిష్టత..**

శ్రీమన్నారాయణుని దశావతారాల్లో మొదటిదైన మత్స్యావతారం భక్త రక్షణకు ప్రతీక. వేదాలను అపహరించిన సోమకాసురుడిని సంహరించి, సృష్టి చక్రం ఆగిపోకుండా బ్రహ్మదేవునికి వేదాలను అప్పగించిన ఘట్టాన్ని ఈ అలంకారం స్మరింపజేస్తుంది. లోకమంతా తన సంతానమని, వారిని తన చల్లని చూపులతో సంరక్షించే పరమాత్మ తత్త్వం ఈ అవతారంలో దాగి ఉందని అర్చకస్వాములు తెలిపారు. ఘనంగా నిర్వహించిన అధికారులు, పండితులు.. శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితుల బృందం ఈ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కార్యనిర్వహణాధికారి భవాని శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఉప కార్యనిర్వహణాధికారి, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**రాత్రి 'శేష వాహన' సేవ..**

రాత్రి స్వామివారు పడగ విప్పిన ఆదిశేషునిపై శేష వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు.భూమండలాన్ని తన శిరస్సుపై మోసే ఆదిశేషుడు, భగవంతునికి శయ్యగా, ఆసనంగా, పాదుకలుగా కైంకర్యం చేస్తూ భక్తులకు సేవాభావాన్ని చాటి చెబుతారు. బ్రహ్మోత్సవాల ప్రారంభంలోనే ఈ వాహన సేవ నిర్వహించడం విశేషం. ఆధ్యాత్మిక, సాంస్కృతిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు కనువిందు చేస్తున్నాయి.



## యూరియా యాప్‌ను రద్దు చేయండి

పాత విధానాన్ని అమలు చేయండి: హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యూరియా యాప్‌ను రద్దు చేసి పాత విధానంలో, ఎటువంటి షరతులు లేకుండా రైతులకు యూరియాను సరఫరా చేయాలని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో జూబ్లీహిల్స్ ప్యాలెస్‌ను ముట్టడించే రోజులు వస్తాయని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోనే కాదని, యూరియా సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నదని ఆరోపించారు.

## కర్రెగుట్ట నుంచి సాయుధ బలగాలను వెనక్కి తీసుకోండి : జాన్‌వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :**'ఆపరేషన్ కాగర్2' పేరుతో కర్రెగుట్ట అటవీ ప్రాంతాన్ని వేలాది మంది సాయుధ బలగాలు చుట్టుముట్టి, మావోయిస్టులను హతమార్చడాన్ని సిపిఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఖండించారు. సాయుధ బలగాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, 'ఆపరేషన్ కాగర్2' పేరుతో సాగిస్తున్న మారణకాండను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో గత రెండు రోజులుగా సాయుధ బలగాలు జరిపిన కాల్పుల్లో ఇప్పటికే ఐదుగురు మావోయిస్టులు మరణించినట్లు ప్రచారం జరుగుతున్నదని ఆయన శుక్రవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు.



## రంజాన్ మాసం సమైక్యతకు ప్రతీక

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అక్బరుద్దీన్

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట :** ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభం కావడంతో పాతబస్తీ రియాసత్ నగర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ పార్టీకి చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసి హాజరయ్యారు. రంజాన్ మాసంలో సూర్యాస్తమయం తర్వాత, మగ్రిబ్ ప్రార్థన అనంతరం కుటుంబం, స్నేహితులతో కలిసి ఉపవాసాన్ని పండ్లు, ఇతర ఆహారంతో విరమించడం జరుగుతుంది. అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ... రంజాన్ ఉపవాసదీక్షలు ఐకమత్యం, బంధుత్వాన్ని, దాతృత్వాన్ని, సమైక్యతను పెంచుతాయని అన్నారు. ఇఫ్తార్‌లో ఎంఐఎం నేతలు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు రాయితీపై ద్విచక్రవాహనాలు

ఈనెల 26లోగా దరఖాస్తులు చేసుకోవాలి

-జిల్లా మత్స్యశాఖ అధికారిణి వి.రజని

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ బ్యూరో :** హైదరాబాద్ జిల్లాలోని మత్స్యకారులకు తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ రాయితీపై ద్విచక్రవాహనాలను మంజూరు చేసిందని మత్స్యశాఖ అధికారిణి వి.రజనీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 26వ తేదిలోగా జిల్లా మత్స్యశాఖ అధికారిణి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం ద్వారా చేపల అమ్మకం కోసం 202526 సంవత్సరానికి మంజూరు చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. జనరల్ కేటగిరీకి చెందిన వారికి రూ.30వేలు, మహిళలకు రూ.45వేలు, ఎస్‌సి, ఎస్‌టి కేటగిరీల వారికి రూ.30వేలు రాయితీపై మొత్తం 16 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. చేపల అమ్మకంలో అనుభవం కలిగి ఉండి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు అర్హులని ఆమె తెలిపారు. గతంలో ఏదైనా పథకం ద్వారా లబ్ధి పొందిన వారు అనర్హులని ఆమె పేర్కొన్నారు.

## తిరుమల లడ్డూ కల్తీ .. ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు

**అమరావతి :** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై ఇప్పటికే సిట్ దర్యాప్తు పూర్తయ్యి నివేదిక సమర్పించిన నేపథ్యంలో..ఆ నివేదికను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. విశ్రాంత ఐఎఎస్ అధికారి దినేశ్ కుమార్ అధ్యక్షతన ఏకసభ్య కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏకసభ్య కమిషన్ 45 రోజుల్లోగా తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. ప్రధానంగా సిట్ నివేదికలో పేర్కొన్న అంశాలను పూర్తిగా పరిశీలించడం, దర్యాప్తులో బయటపడ్డ విషయాలను విశ్లేషించడం, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈ కమిషన్ సిఫార్సులు చేయనుంది.

## వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్యకేసులో సుప్రీం సీరియస్

నవంబర్ 18లోపు ట్రయల్ పూర్తి చేయాలని ఆదేశం

**అమరావతి :** వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. శుక్రవారం ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. కేసు దర్యాప్తులో పోలీసుల నిర్లక్ష్యంపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అప్పట్లో అధికారంలో ఉన్న పార్టీలో ఉన్న అనంతబాబుతో పోలీసులు కుమ్మక్కయ్యారని వ్యాఖ్యానించింది. డీఫాల్ట్ బెయిల్ వచ్చేలా ఛార్జ్ షీట్ దాఖలు చేశారని ఆక్షేపించింది. తప్పుచేసిన పోలీసులపై ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించింది. డీజీపీ, ఎస్పీలు ఏం చేస్తున్నారని నిలదీసింది. నిందితుడితో పోలీసులు ఇప్పటికీ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నట్లు కనిపిస్తోందని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఏపీ పోలీసుల దర్యాప్తు తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రోజువారి విచారణ చేయాలని, మార్చి 31లోపు ప్రత్యేక జూడిషియల్ అధికారిని నియమించాలని, నవంబర్ 18లోగా ట్రయల్ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఈ కేసులో అనంతబాబు భార్యను ఏ 2గా చార్జ్‌షీటులో పేర్కొంది. ఆమె కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అనంతబాబు వ్యక్తిగత సిబ్బంది, గన్ మెన్‌లను వదిలివేసి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది.

## ఎల్లమ్మ తల్లికి పుష్పాలంకరణ

**ప్రజాపక్షం/సనత్‌నగర్ :** కోరిన కోర్కెలు తీర్చే బల్కంపేట్ ఎల్లమ్మ అమ్మవారిని శుక్రవారం రంగు రంగుల పువ్వులతో అందంగా అలంకరించారు. ఎల్లు ఎల్లమ్మ ఎల్లు బాయి నుంచీ బయటకి ఎల్లు... అంటూ నమ్మకంతో కొలిచే భక్తులు, ఆలయ నిర్వాహకులు అమ్మవారిని చేమంతి, బంతి, ఎర్ర గులాబీ, మల్లె పువ్వులతో పాటు పూదీన, సన్నజాజి పువ్వులతో కూడిన దండలు వేసి అలంకరించడం జరిగింది. పాల్గుణమాసం మొదటి శుభ శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని పూజించి మొక్కులు తీర్చుకున్నారు.

# బిసి సబ్‌ప్లాన్ అమలు చేయాలి

ప్రభుత్వానికి బిసి సంఘాల నేతల డిమాండ్

గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నిరసన




**ప్రజాపక్షం/సోమాజిగూడ :** రానున్న బడ్జెట్‌లో బిసిల అభివృద్ధికి రూ.55వేల కోట్ల నిధులు కేటాయించాలని, తక్షణమే బిసి సబ్‌ప్లాన్ అమలు చేయాలని పలు బిసి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు, ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణతో పాటు పలువురు నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో బిసి సబ్‌ప్లాన్‌ను ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసిల అభివృద్ధికి కేటాయించాల్సిన వేల కోట్ల నిధులను దారిమళ్లించడం అన్యాయమన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి విద్యార్థుల ఉన్నత విద్యకు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
విదేశీ విద్యకు పరిమితి, నిబంధన ఎత్తివేసి అర్హులైన వారికి వర్తింపజేయాలని కోరారు. చిరంజీవులు మాట్లాడుతూ బిసి నిరుద్యోగులకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ 42శాతం బిసి కాంట్రాక్టుల రిజర్వేషన్ హామీ అమలు చేసి, మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బిసి సంఘాలు ఏకమవడం బిసి రాజ్యాధికారానికి సంకేతమన్నారు.
అనంతరం బిసి సంఘాల నేతలంతా అసెంబ్లీ వైపు దూసుకెళ్లగా, పోలీసులు అడ్డుకొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నేతలు వట్టె జానయ్య, బిసి నేతలు కుల్కచర్ల శ్రీనివాస్ వందలాది మంది నేతలు పాల్గొన్నారు.

# మార్కెట్‌లోకి రిలీఫ్ వెల్‌నెస్ ఉత్పత్తులు

సహజ ఆయుర్వేద ఉత్పత్తులకు ప్రజల ఆదరణ

సినీనటి కాజల్ అగర్వాల్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశ ప్రాచీన ఆయుర్వేద జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రీయ ఆవిష్కరణలతో ఎంతో సహజంగా కలిపే ఉత్పత్తులను ప్రజలు ఆదరిస్తారని ప్రముఖ సినీనటి కాజల్ అగర్వాల్ అన్నారు. సహజ ఆయుర్వేద ఉత్పుత్తులతో మరింత ఆరోగ్యంగా ఉండేందుకు ప్రయత్నించాలని సూచించారు. ప్రఖ్యాత హెర్బల్ ఫార్మాస్యూటికల్ బ్రాండ్ 'రిలీఫ్ వెల్‌నెస్ ' ఉత్పత్తులను హైదరాబాద్‌లో కాజల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వసనీయత, పరిశోధనల ఆధారంగా ఉత్పత్తులు ఉండాలని, ఆ దిశగా రిలీఫ్ వెల్‌నెస్ ముందడుగు వేసిందన్నారు. రిలీఫ్ వెల్‌నెస్ స్థాపకుడు డోలేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ హెర్బల్స్‌ను ఫార్మాస్యూటికల్ ఔషధాల స్థాయిలో వేగంగా, ప్రభావవంతంగా పనిచేయించేలా చేయగలమా? అనే ప్రశ్నతో తొమ్మిది సంవత్సరాలు పరిశోధనలు చేపట్టామని వివరించారు. తమ టెక్నాలజీ ఆయుర్వేదానికి ప్రత్యామ్నాయం కాదని, దాని పనితీరును మరింత పెంచుతుందని, మొక్కల నుండి ఖచ్చితమైన, వ్యక్తిగతీకరించిన, శక్తివంతమైన వైద్యం తమ విధానంలో సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ప్రకృతిలో అసాధారణమైన చికిత్సా శక్తి ఉన్నదని, దీనిని సరిగ్గా వెలికితీయడానికి తాము కృషి చేస్తున్నామన్నారు. సినీ నటుడు మురళీమోహన్ మాట్లాడుతూ కాళ్లు, ఒళ్లు నొప్పులకు డోలో వాడే పరిస్థితులు ఉన్నాయని, వీటిని నిత్యం వాడడం ద్వారా పలు రకాల సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరిత గతిన వ్యాదులు తగ్గాలని పలు రకాల మందులను వాడుతున్నామని, వాటి వల్ల కలిగే ఇబ్బందులకు, సైడ్ఎఫెక్ట్స్‌కు మరిన్ని మందులు వాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సంస్థ సిఇఒ తరుణ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ కీళ్లు,ఎముకల ఆరోగ్యం, మెటాబాలిక్ వెల్‌నెస్, జ్ఞాపకశక్తి, మహిళల ఆరోగ్యం, జీర్ణక్రియ, నిద్ర, రోగనిరోధక శక్తి, ఒత్తిడి తదితర ఆరోగ్య సమస్యలకు రిలీఫ్ వెల్‌నెస్ ఉత్పత్తులు పరిష్కారాన్ని చూపుతాయని వివరించారు. ప్రస్తుతం డిజిటల్ మార్కెటింగ్ ద్వారానే తమ ఉత్పత్తులను విక్రయిస్తామన్నారు.

## మెరుగైన సేవలు లక్ష్యం

జలమండలి ఎండి అశోక్‌రెడ్డి స్పష్టం




**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** మెరుగైన సేవలను సమర్థవంతంగా అందించే విధంగా... క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించడం కోసం... ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకునే విధంగా జలమండలి బస్తీ బాట ప్రారంభమయ్యింది. మొదటి రోజు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఉదయం 6 గంటలకు శేరిలింగంపల్లి వార్డులోని శంకర్ నగర్, హుడా కాలనీ, దీప్తిశ్రీ నగర్, మియాపూర్ ప్రాంతంలో పర్యటించారు. శంకర్‌నగర్‌లో నీటి సరఫరా సమయంలో పలు ఇండ్లలో తనిఖీలు చేసి నీటి నాణ్యత గురించి స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే నీటిని వృథా చేస్తున్న విషయాన్ని గమనించి సంబంధిత యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరొకరు ఇంటిలో బోరు నీటిని మొక్కలకు, ప్రాంగణం కడగడం చూసిన ఎండీ ఇంకుడు గుంత నిర్మించేంత ఖాళీ స్థలం ఉండటంతో ప్రాంగణంలోని వృథా నీటిని ఇంకుడు గుంతలోకి మళ్లించుకోవాలని సూచించారు. అనంతరం హుడా కాలనీలో సీవరేజ్ మ్యాన్ హోల్ డీసిల్టింగ్ పనులను పరిశీలించిన ఎండీ.. మాల్‌హోల్‌లలో వెలువడ్డ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. రోడ్డుకు సమాంతరంగా లేని మ్యాన్ హోళ్ళను, ధ్వంసమైన మ్యాన్ హోళ్ళను గుర్తించి పునర్నిర్మాణం చేయమని సూచించారు. దానికి సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించమని చెప్పారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. జలమండలి పరిధిలో తాగునీటి, మురుగునీటి సమస్యలు, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం కోసం జలమండలి బస్తీ బాట కార్యక్రమాన్ని రూపొందించిందని.. ఇందులో భాగంగా ఎండీ నుంచి మేనేజర్ వరకు క్షేత్రస్థాయిలో పర్యటించడం జరుగుతుందన్నారు.
ఈ వార్తకు ఫొటో బస్తీబాట పేరుతో ఉన్నది



## బిసిలకు 42శాతం రిజర్వేషన్లతో 'పరిషత్తు' ఎన్నికలకెళ్లాలి

బిసి నేతల ర్యాలీలో ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** బిసిలకు చట్టబద్ధంగా 42శాతం రిజర్వేషన్లు అమలు చేసినంకనే ఎంపిటిసి,జడ్పిటిసి ఎన్నికలకు వెళ్లాలని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బిసి జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం లిబర్టీ చౌరస్తా నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీలో వందలాది మంది బిసి నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉద్యమాలను, ప్రజల మనోభావాలను గుర్తించాలని కోరారు. పరిషత్తు ఎన్నికలకు బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు, ర్యాలీలకు పిలుపునిచ్చామన్నారు. పార్టీపరంగా బిసిలకు అత్యధిక సీట్లు ఇచ్చినందున కార్పొరేషన్‌లో 58శాతం, సర్పంచ్ ఎన్నికల్లో 53శాతం బిసిలు గెలిచారని సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పుకోవడం స్వాగతిస్తున్నామన్నారు. కానీ, ఎప్పటికీ పార్టీపరంగా బిసిలకు ఎక్కువ సీట్లు ఇవ్వలేరని, చట్టబద్ధంగా 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసి సంఘం నేతలు గుజ్జ సత్యం, నీలం వెంకటేశ్., జిల్లపల్లి అంజి, పగిళ్ల సతీశ్, అనంతయ్య, రాందేవ్ మోదీ, భీంరాజు, శివకుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



## 27న బిసిల నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** బడ్జెట్‌లో బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 27న హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బిసిల నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ తెలిపారు. ఈ దీక్షకు వేలాది మంది బిసి మేధావులు, నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి, జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ కన్వీనర్ ఎస్.దుర్గయ్య గౌడ్ అధ్యక్షతనజరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 61శాతానికిపైగా ఉన్న బిసిలకు ప్రతిఏటా అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. 21 బిసి కార్పొరేషన్లకు కేటాయించిన రూ.4,400 కోట్లలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ఏటా రూ.20వేల కోట్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో కేవలం రూ.2,060 కోట్లు ఖర్చు చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా ఎపి తరహాలో బిసి సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి రూ.50వేలకోట్లు కేటాయించాలన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే చెల్లించాలని కోరారు. ఫ్రంట్ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ 21 బిసి కార్పొరేషన్లకు కేటాయించిన నిధులు ఇతర పథకాలకు మళ్లించకుండా ఆయా కులవృత్తుల అభివృద్ధికి వెచ్చించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్లు బైరు శేఖర్ గౌడ్, యెలికట్టె విజయ్‌కుమార్, అంబాల నారాయణ, సింగం నాగేశ్, ఎర్రమాద వెంకన్న, నాగభూషణం, బోయ గోపి, కర్నాటి మనోహర్ , లింగేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యునిగా అవకాశం కల్పించండి

ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కోరిన చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజ్యసభ సభ్యునిగా తనకు అవకాశం కల్పిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేను కోరారు. ఈ మేరకు ఆయన న్యూఢిల్లీలోని ఇందిరాభవన్‌లో మల్లికార్జున ఖర్గేతో చిన్నారెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర తాజా రాజకీయ పరిస్థితులను ఆయన మల్లికార్జున్ ఖర్గేకు వివరించారు. రానున్న ఎంపిటిసి , జెడ్‌పిటిసి ఎన్నికల్లో, ఇతర ఏ ఎన్నికలు వచ్చినా మున్సిపల్ ఎన్నికల తరహా ఫలితాలు వస్తాయని అన్నారు. రెండేళ్ల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వనపర్తి నియోజకవర్గం నుంచి తనకు కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్‌ను ఇచ్చి మళ్లీ వెనక్కి తీసుకున్నదని, ఈ క్రమంలో తనకు రాజ్యసభ సభ్యునిగా అవకాశం కల్పిస్తామని అధిష్టానం హామీనిచ్చిన విషయాన్ని చిన్నారెడ్డి గుర్తు చేశారు.



## విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** సీతాఫల్‌మండీ కూడలిలో సొంత ఖర్చుతో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రాం విగ్రహాల పనులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రజల్లో నిరంతరం స్ఫూర్తిని రేకెత్తించేలా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మహనీయుల అదర్శాలను పాటించేలా తన వంతు కృషి చేస్తున్నానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట సీతాఫలమండీ ఎస్సీ, ఎస్సీ సంఘాల నేత జీ.చంద్రశేఖర్, బీఆర్ఎస్ సమన్వయకర్త రాజా సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలేయ మార్పిడి చికిత్సలో 'గ్లెనగల్స్ హాస్పిటల్' మరో మైలురాయి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వయోజన లాప్రోస్కోపిక్ డోనర్ లివర్ శస్త్రచికిత్స, పిల్లల లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ఫోర్టిస్ హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌లో భాగమైన గ్లెనగల్స్ హాస్పిటల్ మరో మైలురాయిని సాధించినట్టు గ్లెనగల్స్ హాస్పిటల్స్ రీజినల్ సిఇఒ భరత్‌కాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని గ్లెనగల్స్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రఖ్యాత లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ విశాల్, కె.చౌరాసియా , పీడియాట్రిక్ హెపటాలజిస్ట్ డాక్టర్ కావ్య దెందుకూరితో కలిసి ఆయన మాట్లాడారు. గత 15ఏళ్లలో 1500కుపైగా లివర్ ట్రాన్స్‌ప్లాంట్లు విజయవంతంగా నిర్వహించి, 95శాతంపైగా సర్వైవల్ రేటును సాధించామన్నారు. దీంతో దేశంలోనే అగ్రగామి కాలేయ మార్పిడి కేంద్రాలలో తమ హాస్పిటల్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్నదన్నారు. త్వరలోనే రోబోటిక్ డోనర్ హెపటాక్టెమీ విధానం ప్రారంభించనున్నామని తెలిపారు. డాక్టర్ విశాల్ కె.చౌరసియా మాట్లాడుతూ ఇప్పటివరకు లాప్రోస్కోపిక్ విధానం ద్వారా లివర్ డోనర్లకు నొప్పి తక్కువగా ఉంటుందని, తక్కువ రోజుల్లోనే కోలుకొంటారన్నారు. డాక్టర్ కావ్య దెందుకూరి మాట్లాడుతూ చిన్నారుల కాలేయ చికిత్సకు తమ దగ్గర ప్రత్యేక వైద్య బృందం ఉన్నదన్నారు. లివర్ ఫెయిల్యూర్ వంటి తీవ్ర సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు చికిత్స అందించడంలో తమ హాస్పిటల్ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. సమావేశంలో ఫోర్టిస్ హెల్త్‌కేర్ గ్రూప్ సిఒఒ అనిల్ నాయక్, కాలేయ మార్పిడి సర్జన్ డాక్టర్‌తరుణ్ గట్టు, పలువురు వైద్యులు, లివర్ మార్పిడి పిల్లల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ జి. సృజన హెచ్చరించారు. పారిశుద్ధ్య, ఎంటమాలజీ కార్యకలాపాలపై శుక్రవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఆమే సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జోనల్ కమిషనర్లు, అదనపు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకల్లా పారిశుద్ధ్య సిబ్బంది, వాహనాల హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. గైర్హాజరు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వార్డు వారీగా రహదారుల పొడవు ఆధారంగా సిబ్బందిని సమానంగా కేటాయించాలని సూచించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు అపూర్వ్ చౌహాన్, భోకాడే హేమంత్ సహదేవ్ రావు, సందీప్ కుమార్ ఝా, అదనపు కమిషనర్ డాక్టర్ యాదగిరి రావు, డిప్యూటి కమిషనర్లు, ఎస్‌డబ్ల్యుఎం ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రూఫ్‌టాప్ హోర్డింగ్‌లకు అనుమతి ఇవ్వాలి

తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలో రూఫ్‌టాప్ హోర్డింగ్‌లకు అనుమతిస్తూ నూతన అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ తీసుకురావాలని తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట అసోసియేషన్ నాయకులు ఆందోళన నిర్వహించారు. జిహెచ్‌ఎంసి కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పోలీసులు నచ్చజెప్పడంతో ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఇఫ్తికార్, ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసిలో మూడు పెద్ద యాడ్స్ ఏజెన్సీలు వ్యవస్థను శాసిస్తున్నాయని ఆరోపించారు. కొత్త పాలసీని ఖరారు చేసే ముందు అసోసియేషన్‌తో సంప్రదింపులు జరపాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# మార్ష్, హెడ్ వీరబాదుడు



## లీగ్ దశలో ఆఖరి పంచ్ ఆస్ట్రేలియాదే..!

చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా గర్జించింది. నాకౌట్ బెర్తు చేజారిన బాధను దిగమింగుతూ ఒమన్‌పై పంజా విసిరింది. స్వల్ప ఛేదనలో మిచెల్ మార్ష్(64 నాటౌట్), ట్రావిస్ హెడ్(32)లు ప్రత్యర్థి బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డారు. వీరిద్దరూ ఎడాపెడా బౌండరీల మోత మోగించగా ఆసీస్ వడివడిగా లక్ష్యాన్ని కరిగించింది. హెడ్ ఔటయ్యాక.. ఓష్ ఇంగ్లిస్(12 నాటౌట్) రెండు ఫోర్లతో జట్టును గెలిపించాడు. పదో ఓవర్లోనే లక్ష్యాన్ని అందుకున్న కంగారూ టీమ్ రెండో విజయంతో గ్రూప్ బీలో మూడో స్థానానికి ఎగబాకింది.

గ్రూప్ దశలోనే ప్రపంచకప్ నుంచి నిష్క్రమించిన ఆస్ట్రేలియా చివరి పోరులో చెలరేగిపోయింది. పసికూన ఒమన్‌ను వణికిస్తూ 9 వికెట్లతో ఘన విజయం సాధించింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ మిచెల్ మార్ష్(64 నాటౌట్) తొలి ఓవర్లోనే మూడు ఫోర్లతో తన ఉద్దేశమేంటో చాటాడు. రెండో ఓవర్లో బౌండరీతో జోరందుకున్న ట్రావిస్ హెడ్(32) మార్ష్‌తో పోటీగా చెలరేగాడు. వీరిద్దరి మెరుపులతో 4.1 ఓవర్‌కే స్కోర్ యాభై దాటింది. మార్ష్, హెడ్ విధ్వంసంతో పవర్ ప్లేను 73 రన్స్ చేసింది. అలీకి చుక్కలు చూపిస్తూ.. మూడు ఫోర్లు, సిక్సర్ బాదాడు మార్ష్. వీరిద్దరి జోరు చూశాక అజేయంగా మ్యాచ్‌ను ముగిస్తారనిపించింది. కానీ, 9వ ఓవర్లో హెడ్ గాల్లోకి లేపిన బంతిని వికెట్ కీపర్‌తో పోటీపడిన షకీల్ ఒడుపుగా అందుకున్నాడు. తొలి వికెట్ తీసిన సంతోషంలో ఒమన్ ఆటగాళ్లకు దక్కినా.. అప్పటికే ఆసీస్ విజయం ఖాయమైంది. 17 పరుగులే అవసరమవ్వగా.. జోష్ ఇంగ్లిస్ (12 నాటౌట్)తో కలిసి మార్ష్ లాంఛనం పూర్తి చేశాడు.

**జంపా మ్యాజిక్**

వరల్డ్‌కప్‌లో బోణీ కొట్టని ఒమన్‌కు చివరి మ్యాచ్‌లోనూ బ్యాటర్లు పెద్ద స్కోర్ అందించలేదు. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ అమిర్ కలీం(0)ను బౌల్డ్ చేసి గ్జావియర్ బార్ట్‌లెట్(2–27) వికెట్ల వేటకు తెరతీశాడు. బార్ట్‌లెట్, ఎల్లిస్ విజృంభణతో పవర్ ప్లేలో కీలక వికెట్లు పడగా.. ఒమన్ కష్టాల్లో కూరుకుపోయింది. అసలే తడబడుతున్న ప్రత్యర్థి బ్యాటర్లను ఆడం జంపా (4–21) మరింత దెబ్బకొట్టాడు. హమ్మద్ మిర్జా (16) వికెట్‌తో ఖాతా తెరిచిన లెగ్ స్పిన్నర్ కోలుకోలేకపోయింది. వసీం అలీ(32) పోరాడినా.. సహచరులు డగౌట్‌కు క్యూ కట్టారు. చివరి బ్యాటర్ షఫీక్ జైన్(0)ను బౌల్డ్ చేసిన జంపా 104 వద్ద ఒమన్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. నాలుగు వికెట్ల పడగొట్టిన జంపా.. పొట్టి వరల్డ్‌కప్ చరిత్రలో రెండో అత్యధిక వికెట్ల వీరుడిగా అవతరించాడు. బంగ్లాదేశ్ వెటరన్ షకీబుల్ హసన్50 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా.. రషీద్ ఖాన్ (43 వికెట్లు) మూడో స్థానానికి పడిపోయాడు.

## ఆసియా కప్ ఫైనల్లో భారత్!

మహిళల ఆసియా కప్ రైజింగ్స్ స్టార్స్‌లో భారత ఏ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీ ఫైనల్లో భారీ విజయంతో శ్రీలంకను ఇంటికి పంపి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ విందా దినేశ్(42), రాధా యాదవ్(32 నాటౌట్, 4–19) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడడంతో 5 వికెట్ల తేడాతో లంకను చిత్తు చేసింది. ఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది. బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో భారత ఏ జట్టు పంజా విసిరింది. లీగ్ దశలో అదరగొట్టిన టీమిండియా సెమీఫైనల్లోనూ చెలరేగిపోయింది. భారీ స్కోర్‌తో భారత్‌కు చెక్ పెట్టాలనుకున్న లంక ఆశలకు కెప్టెన్ రాధా యాదవ్ (4–19) అడ్డుకట్ట వేసింది. వికెట్ల వేటతో రెచ్చిపోగా.. ప్రత్యర్థి 118 పరుగులకే కుప్పకూలింది. లంక జట్టులో ఓపెనర్లు సంజనా కవింది (31), హన్సిమ కరుణరత్నే(14)లను విడదీసి తనూజ కన్వర్ బ్రేకివ్వగా.. అక్కడి నంచి రాధా యాదవ్ తిప్పేసింది. మిడిలార్డర్‌ను పడగొట్టిన తను.. లోయర్ ఆర్డర్‌ను డగౌట్ చేర్చింది. ఆఖర్లో శశిని గుహ్మని(22) మాత్రమే రాణించగా లంక 118కి ఆలౌటయ్యింది.



**విందా, రాధ దూకుడు**

ప్రత్యర్థిని తక్కువకే కట్టడి చేసి సగం విజయం సాధించిన భారత్‌కు ఓపెనర్లు నందినీ కశ్యప(14), విందా దినేశ్‌లో (42) అదిరే ఆరంభమిచ్చారు. వీరిద్దరూ ఔటయ్యాక క్రీజునంటుకుపోయిన రాధా యాదవ్(31 నాటౌట్) లంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొంది. అజేయంగా నిలిచి జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లింది. 5 వికెట్ల తేడాతో టీమిండియా జయకేతనం ఎగురవేసిన భారత్ ఆదివారం జరుగబోయే టైటిల్ పోరులో బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది.

# సైన్స్

## పదార్థంపై కాంతి ప్రభావం?

కొన్ని మినహాయింపులను పక్కకుపెడితే, ఒక పదార్థం గుండా కాంతి ప్రసరించదు. అయితే, కాంతి ఏకంగా పదార్థాన్ని వక్రీభవానికి గురి చేస్తుందని లేదా వంచగలుగుతుందని, అంతర్జాతీయ పత్రికలను ఉటంకిస్తూ వార్తలు వస్తున్నాయి. అన్నిటికీ క్వాంటం సిద్ధాంతాన్ని జోడించడం, అర్థంకాని పదజాలంతో వార్తను నింపేయడంతో, వాస్తవాలు మరుగునపడే ప్రమాదం ఉంది. అనేకానేక చర్యలు శాస్త్రపరంగా సాధ్యమేగానీ, వాస్తవంలో అసాధ్యం. వెలుగు చుంబన శక్తిగా మారి, పదార్థం వక్రీభవనానికి కారణమవుతుందనే ప్రతిపాదన కూడా ఇలాంటిదే. దీనిని క్వాంటం ఆప్టిక్స్, ఘనస్థితి భౌతిక శాస్త్ర విస్తరణలుగా చూడాలి. సాధారణంగా వెలుగు ఒక శక్తి. దీనికి రేఖీయ గతి పరిమాణం (రుజుమార్గంలో ప్రయాణించే తత్వం) ఉంటుంది. రేడియేషన్ ప్రెషర్ వంటి ఘటనలు ఈ సిద్ధాంతాన్ని నిరూపించాయి. అయితే క్వాంటం సిద్ధాంతం ప్రకారం ఫోటాన్లు కోణీయ భ్రమణం (యాంగ్యులర్ మూమెంట్) కూడా తీసుకెళతాయి. ఇందులో స్పిన్ యాంగ్యులర్ మొమెంటమ్ (పోలరైజేషన్‌కు సంబంధించినది), ఆర్బిటల్ యాంగ్యులర్ మొమెంటమ్ (తిరుగుతూ వ్యాపించే తరంగ ముఖరేఖలకు సంబంధించినది) ఉంటాయి. ఇలాంటి కాంతిని స్ట్రక్చరల్ లైట్ లేదా ట్విస్టెడ్ లైట్ అని వ్యవహరిస్తారు.




ఈ కోణీయ భ్రమణం కలిగిన కాంతి పదార్థంలోని ఎలక్ట్రాన్లతో పరస్పర చర్యలోకి వచ్చినప్పుడు, వాటి సమూహ కదలికలో మార్పులు కలిగించగలనరై వాదన ప్రస్తుతం బలంగా వినిపిస్తున్నది. ముఖ్యంగా ఇన్వెర్స్ ఫారాడే ఎఫెక్ట్ అనే ప్రభావం ఇక్కడ ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. సాధారణ ఫారడే ప్రభావంలో మాగ్నెటిక్ ఫీల్డ్ కాంతి ధ్రువీకరణాన్ని ప్రభావితం చేస్తుంది. కానీ ఇన్వెర్స్ ఫారాడే ఎఫెక్ట్ వృత్తాకార ధ్రువీకరణ (సర్క్యులర్ పోలరైజేషన్) గల కాంతి ఒక పదార్థంపై పడినప్పుడు, ఆ పదార్థంలో తాత్కాలిక మాగ్నెటిక్ మొమెంటమ్‌ను ప్రేరేపించగలదు. ఇది బయటి మాగ్నెట్ లేకుండానే జరుగుతుంది. ఈ ప్రభావం వెనుక ఉన్న భౌతికతను సూత్రప్రాయంగా పరిశీలిస్తే, ఎలక్ట్రాన్లు ఛార్జ్ కలిగిన కణాలు కావడంతో కాంతి యొక్క ఎలక్ట్రిక్, మాగ్నెటిక్ ఫీల్డ్‌తో పరస్పరం చర్యలోకి వస్తాయి. వృత్తాకార ధ్రువీకరణ గల కాంతి ఎలక్ట్రిక్ ఫీల్డ్ కాలానుగుణంగా తిరుగుతూ ఉంటుంది. ఇది ఎలక్ట్రాన్లలో ఒక సమన్విత కదలికను ప్రేరేపించి, సమూహ స్థాయిలో అది మాగ్నెటిక్ ఆర్డరింగ్ మార్పుగా వ్యక్తమవుతుంది. ఇది నిజమైన స్థిర మాగ్నెట్ కాదు. అల్ట్రాఫాస్ట్, తాత్కాలిక, కాంతి ఆధారిత మాగ్నెటిక్ ప్రతిస్పందన మాత్రమే. కాగా, ప్రస్తుత మాగ్నెటిక్ నియంత్రణ పద్ధతులు ప్రధానంగా విద్యుత్ ప్రవాహాలపై ఆధారపడి ఉంటాయి. విద్యుత్ ప్రవాహం ఉష్ణాన్ని ఉత్పత్తి చేస్తుంది, శక్తి నష్టాన్ని కలిగిస్తుంది, వేగ పరిమితులు కలిగి ఉంటుంది.ఇది అల్ట్రాఫాస్ట్ స్పిన్‌ట్రానిక్స్, తక్కువ ఉష్ణ నష్టంతో డేటా నిల్వ, క్వాంటం నియంత్రణలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే ఇది ఇంకా ప్రయోగశాల స్థాయి పరిశోధన. అధిక తీవ్రత గల లేజర్లు, నియంత్రిత నమూనాలు, ప్రత్యేక పదార్థాలు అవసరం. వినియోగదారుల ఎలక్ట్రానిక్స్‌లో ప్రత్యక్ష అమలు దూరంలోనే ఉంది. సాంకేతిక మార్పిడికి పదార్థ శాస్త్రం, పరికర ఇంజనీరింగ్, స్థిరత్వ విశ్లేషణలో మరింత పురోగతి అవసరం. శాస్త్రీయ దృష్టిలో ఇది ముఖ్యమైన అంశాన్ని స్పష్టంచేస్తుంది.

## ఆర్కిటిక్‌లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



ఇటీవలి శాస్త్రీయ అధ్యయనాలు ఆర్కిటిక్ ప్రాంతంలో వేగంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు అక్కడి సున్నితమైన జీవవ్యవస్థలను విదేశీ ఆక్రమణ మొక్కల ప్రమాదానికి గురిచేస్తున్నాయని హెచ్చరిస్తున్నాయి. గతంలో ఆర్కిటిక్‌లో తీవ్ర చలి, చాలా చిన్న పెరుగుదల కాలం, శాశ్వత మంచు నేలలు (పర్మాఫ్రాస్ట్), మానవ జోక్యం తక్కువగా ఉండటం వలన విదేశీ మొక్కలు స్థిరపడే అవకాశాలు చాలా తగ్గేవి. అయితే ఇప్పుడు ఉష్ణోగ్రతలు వేగంగా పెరగడం వల్ల ఈ సహజ నిరోధకాలు బలహీనపడుతున్నాయి. మంచు కరుగుదల పెరగడం, పెరుగుదల కాలం పొడవు కావడం, నేల ఉష్ణోగ్రతలు పెరగడం వంటివి అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఒక తాజా నమూనా అధ్యయనం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 2,554 రక్తనాళిక మొక్కల జాతులు వేడెక్కుతున్న ఆర్కిటిక్‌లో అనుకూల వాతావరణాన్ని పొందే అవకాశం ఉంది. ఇప్పటికే ఆర్కిటిక్ వ్యాప్తంగా 341 విదేశీ టాక్సాలను గుర్తించగా, అందులో 188 సహజీకరించబడ్డాయి. స్వాల్‌బర్డ్ ద్వీప సమూహంలో సాధారణంగా కనిపించే 'కామన్ మీడో ర్యూ' వంటి విదేశీ జాతులను గుర్తించారు. ఇది ప్రమాదం ఊహ కాదు, వాస్తవమని సూచిస్తోంది. పశ్చిమ అలాస్కా, దక్షిణ పశ్చిమ మరియు దక్షిణ తూర్పు గ్రీన్‌లాండ్ ఉత్తర ఐస్లాండ ఫెనోస్కాండియా, కానిన్–పెచోరా ప్రాంతాలు ప్రధాన ఆక్రమణ హాట్‌స్పాట్‌లుగా గుర్తించబడ్డాయి.

## వాయువులు, ధూళితో నిండిన నెబ్యులా



నెబ్యులర్ సిద్ధాంతం సౌర కుటుంబం ఏర్పాటును వివరించే తొలి శాస్త్రీయ సిద్ధాంతాలలో ఒకటి. సూర్యుడు, గ్రహాలు, ఇతర ఖగోళ వస్తువులు ఒక విస్తారమైన వాయు–ధూళి మేఘం నుండి అభివృద్ధి చెందాయని ఇది వివరిస్తుంది. ఈ ఆలోచనను 18వ శతాబ్దంలో ఇమ్మాన్యుయెల్ కాంట్, పియెరీసిమన్ లాప్లేస్ ప్రతిపాదించారు. ఆధునిక గ్రహాల ఆవిర్భావ సిద్ధాంతాలకు ఇది పునాది అయింది. నెబ్యులా అనేది అంతరిక్షంలో కనిపించే వాయువులు, ధూళి , సూక్ష్మ కణాలతో కూడిన భారీ మేఘం. ఇవి ప్రధానంగా హైడ్రోజన్, హీలియం వాయువులతో కూడి ఉంటాయి. నక్షత్రాల పేలుళ్లు లేదా గురుత్వాకర్షణ శక్తి వల్ల వాయు–ధూళి సమాహారం ఏర్పడినప్పుడు నెబ్యులాలు ఉత్పత్తి అవుతాయి. కొన్ని నెబ్యులాలు సమీప నక్షత్రాల కాంతి వల్ల ప్రకాశిస్తాయి. మరికొన్ని కాంతిని అడ్డుకోవడం వల్ల చీకటి మేఘాలుగా కనిపిస్తాయి. కాంట్ 1755లో ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకారం విశ్వం మొదట చల్లటి, స్థిర కణాలతో నిండి ఉండేది. గురుత్వాకర్షణ వల్ల కణాలు ఢీకొని వేడి ఉత్పత్తి అయ్యింది.. అప్పుడే చలనము ప్రారంభమైంది. ఈ చలనంతో కోణీయ సవరణ ఏర్పడి భ్రమణం మొదలైంది. ఈ భ్రమణం వేగవంతమవడంతో కేంద్రాభిముఖ శక్తి ప్రభావంతో వలయాలు ఏర్పడి, అవి చల్లబడుతూ గ్రహాలు, ఉపగ్రహాలుగా మారాయని ఆయన పేర్కొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి సహకారం



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మహబూబాబాద్ మున్సిపాలిటీ 25వ వార్డు సిపిఐ కౌన్సిలర్ నర్రా సంధ్య శ్రావణ్‌ను అంగన్‌వాడీ కేంద్రం ధర్మన్న కాలనీ సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో కమ్యూనిటీ బేస్ ఈవెంట్ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం సిబ్బంది అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాకి డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ డిడబ్ల్యుఒ సబిత హాజరయ్యారు. ఈ సందర్భంగా 25వ వార్డుకు కౌన్సిలర్‌గా ఎన్నికైన నర్రా సంధ్య శ్రావణ్, సిడిపిఒ శిరీష పాల్గొన్నారు. అనంతరం నర్రా సంధ్య శ్రావణ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యల పరిష్కారినికి సహకారం అందిస్తానన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మాణానికి కృషిచేస్తానని కౌన్సిలర్ సంధ్యశ్రావణ్ హామీ ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం టీచర్ కె.అండాలు ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ గోపి కృష్ణ , సూపర్వైజర్ కవిత, హెల్పర్, పిల్లలు, గర్భిణిలు పాల్గొన్నారు.

## సివిల్ సప్లయ్ హమాలీలకు నూతన వేతన ఒప్పందం జరగాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ హమాలీలకు లారీ అసోసియేషన్ యజమాన్యం లారీ మామూలు పెంచి నూతన ఒప్పందం చేసుకోవాలని శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్త సమావేశం బద్దం ఎల్లారెడ్డి భవన్ కరీంనగర్‌లో రాకేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లా సివిల్ సప్లయ్ హమాలీలకు ఐదు సంవత్సరాల క్రితం బియ్యం దిగుమతి లోడింగ్ మామూలు లారీ అసోసియేషన్ యజమాన్యం తో రూ.1.40 పైసలు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారమే లారీ మామూలు ఇస్తున్నారు.. కానీ రెండు సంవత్సరాలకు ఒకసారి లారీ మామూలు పెంచాలి .. లారీ మామూలు పెంచాలని అనేకసార్లు విన్నవించినా కూడా ఒక్క రూపాయి కూడా పెంచ లేదనీ, ఇప్పటికైనా లారీ అసోసియేషన్ యాజమాన్యం చర్చలు జరిపి నూతన ఒప్పందం చేసుకోవాలన్నారు. యాజమాన్యం స్పందించకుంటే సివిల్ సప్లయ్ కార్పొరేషన్ గోదాంలలో బియ్యం బస్తాల దిగుమతిని అడ్డుకొని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో వి.సాంబమూర్తి, ఎం.కుమార్, ఏం.తిరుపతి, గట్టయ్య, మల్లేష్, శ్రీనివాస్, మల్లేశం, రాజేష్, దుర్గయ్య, పోషమల్లు, సాయిబాబా, నరసయ్య, బి.శ్రీనివాస్, కదారి శంకర్, గుర్రం నరేష్, కే.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ విస్తరణ, ప్రజా పోరాటాలే లక్ష్యం

కౌన్సిలర్ల అభినందన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదరి కూనంనేని





**ప్రజాపక్షం/ఖమ్మం :** పార్టీ విస్తరణ, ప్రజా ఉద్యమ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల అధర్మ యుద్ధం జరిగిందని సిపిఐని ఒంటరిని చేసి ఓడించేందుకు ప్రయత్నాలు జరిగాయని, అధర్మ యుద్ధంలోనూ ధర్మంగా గెలిచామని ఆయన తెలిపారు. సిపిఐ పక్షాన ఏదులాపురం, వైరా మున్సిపాలిటీలలో గెలుపొందిన కౌన్సిలర్ల అభినందన సభ శుక్రవారం సిపిఐ కార్యాలయంలో జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నికలు ఒక భాగమన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పొత్తు ధర్మాన్ని పాటించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 41చోట్ల మున్సిపల్, కార్పొరేషన్లలో విజయం సాధిస్తే అందులో 30 స్థానాల్లో సిపిఐ ఒంటరిగానే పోటీ చేసి గెలిచిందన్నారు. ఐదు చోట్ల కాంగ్రెస్ మద్దతు, ఆరు చోట్ల బిఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసి విజయం సాధించామన్నారు. ఎన్నికల్లో గెలుపు ప్రజలు హర్షించేవిధంగా ఉండాలి తప్ప ఏదో ఒకవిధంగా గెలవాలన్న ఆలోచన ప్రమాదకరమైందని అది ప్రజామోదం పొందదని కూనంనేని తెలిపారు. అధికార యంత్రాంగం సైతం ప్రజాస్వామ్య పద్ధతులను పరిరక్షించేందుకు కృషి చేయాలని, అధికారంలో ఉన్న వారు ఏమి చెబితే అది చేయడం ఉద్యోగ ధర్మం కాదని సాంబశివరావు సూచించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమే అయినా గెలుపును స్ఫూర్తిగా తీసుకోవాలని ఓటమి నుంచి విజయం వైపు అడుగులు వేయాలని ఆయన అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పట్టుదలతో పని చేసి విజయం దిశగా పార్టీని నడిపించాలని ఆయన కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఏదులాపురం మున్సిపాలిటీలో గెలుపొందిన దండి రంగారావు, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, వైరా మున్సిపాలిటీలో గెలుపొందిన నల్లమోతు శైలజను కూనంనేని ఘనంగా సన్మానించారు. కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ అద్భుత విజయం సాధించిన సందర్భంగా ఖమ్మంజిల్లా నాయకులు కూనంనేనిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, కొండపర్తి గోవిందరావు, బిజి క్లెమెంట్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐలో చేరిన సర్పంచ్ సరస్వతి

కండువా కప్పి ఆహ్వానించిన కూనంనేని

**భద్రాద్రి కొత్తగూడెం :** పాల్వంచ మండల పరిధిలోని నారాయణరావు పేట ఎస్సీ కాలనీ సర్పంచ్ బండా సరస్వతి శుక్రవారం సిపిఐలో చేరారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎర్రకండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇండిపెంటెంట్‌గా గ్రామపంచాయతీ ఎన్నికల్లో 178 ఓట్ల మెజార్టీతో సర్పంచ్‌గా గెలిచిన సరస్వతి ఎమ్మెల్యే కూనంనేని సారథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితురాలై సిపిఐలో చేరినట్లు తెలిపారు. పాల్వంచ మండల సిపిఐ అనుబంధ రైతు సంఘం అధ్యక్షుడు కొంగర అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికలో సిపిఐ నాయకులు వాసిరెడ్డి మురళీ, చలిగంటి శ్రీనివాస్, బొర్రా కేశవులు, రాంబాబు పాల్గొన్నారు.



# క్యాతనపల్లిలో కాంగ్రెస్ అరాచకాలు

సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆగ్రహం



**ప్రజాపక్షం /మంచిర్యాల :** క్యాతనపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అధికార అహంకారంతో అరాచకాలకు పాల్పడుతోందని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మండిపడ్డారు. శుక్రవారం క్యాతనపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునిసిపల్ ఎన్నికల్లో సిపిఐ, బిఆర్ఎస్ కూటమి 22 స్థానాల్లో పోటీ చేసి 14 వార్డులను గెలుచుకుని స్పష్టమైన మెజార్టీ సాధించిందని తెలిపారు. కేవలం 7 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్ దొడ్డిదారిన చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపి గడ్డం వంశీకృష్ణ ప్రజాతీర్పును గౌరవించి ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. మెజారిటీ సభ్యులు తమ వైపు ఉన్నప్పటికీ అధికారులు, పోలీసులతో సహకారంతో చైర్మన్ ఎన్నికను రెండుసార్లు వాయిదా వేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం కాంగ్రెస్ నాయకులు తమ కూటమి సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. 8వ వార్డు సభ్యుడు మునిపై దాడి చేసి బలవంతంగా తమ వైపు లాక్కునే ప్రయత్నం చేశారని, ఎస్‌టి కులానికి చెందిన సభ్యుడిపై దాడి జరుగుతుంటే అధికారులు మౌనంగా ఉండటం గమనార్హమని పేర్కొన్నారు. ఈనెల 17న జరిగిన సంఘటనలకు సంబంధించిన సిసి ఫుటేజీలను జిల్లా కలెక్టర్ బహిర్గతం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 21వ వార్డు సభ్యురాలు బబ్బర స్వర్ణలతను కిడ్నాప్ ఫిర్యాదు పేరుతో పోలీసులు అడ్డుకోవడం కుట్రలో భాగమేనని విమర్శించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, బిఆర్ఎస్ నాయకులు బాల్క సుమన్ తదితరులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే ఆ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌల్, కాదండి సాంబయ్య, వనం సత్యానారాయణ, నక్క వెంకటస్వామి, ఏగుడ మొండి, మహిళా సమాఖ్య కార్యదర్శి గాజుల మణెమ్మ, నాయకులు రాజేశం, రాయలింగు, శ్రీనివాస్, లక్ష్మణ్, శంకర్, భాస్కర్, నరేష్, రాజన్న పాల్గొన్నారు.

## వైద్యశిబిరాలు అభినందనీయం

సిపిఐ 24వ వార్డు కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కారల్ మార్క్స్ కాలనీ 24 వార్డులో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని శరత్ మ్యాక్సీ విజన్ వారి సహకారంతో ప్రారంభించడం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు, 24 వ వార్డు ఇంచార్జ్ వేముల శ్రీకాంత్, కౌన్సిలర్ వేముల జ్యోతి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వేముల జ్యోతి మాట్లాడుతూ నిరుపేదలకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. 24వ వార్డులో ఉన్న ప్రజలందరూ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదే విధంగా ఇటువంటి వైద్య శిబిరాలు 24 వార్డులో కౌన్సిలర్ వేముల జ్యోతి ఆధ్వర్యంలో ఇంకా ఎన్నో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వార్డు అధ్యక్షులు అశోక్ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఇర్ఫాన్, షాబీర్ ఖాన్, సతీష్, చారి తదితరులు పాల్గొన్నారు.



# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
ఆస్తిపన్ను బాకాయిలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి
ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు, ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మునగనూరు రోడ్ వెంకటేశ్వర కాలనీ, సాహెబ్ నగర్ జోడు బావి ప్రాంతాల్లోని చెత్త తరలింపు ప్రక్రియను పరిశీలించారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో చెత్త సేకరణ, తరలింపు విధానాలపై సమీక్ష నిర్వహించి, సమయపాలనతో పని చేయాలని సూచించారు. కుమ్మరి కుంట చెరువు పరిసరాల్లో చెత్త పేరుకుపోవడాన్ని గమనించిన ఆయన, వెంటనే చెత్త తొలగింపు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువు పరిరక్షణ, శుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పరిసరాల్లో ఉన్న గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి భవిష్యత్తులో మళ్లీ పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

**ఇంజనీరింగ్ పనుల పరిశీలన..** మునగనూరు రోడ్‌లో కొనసాగుతున్న స్టార్మ్ వాటర్ డ్రైన్, అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్, నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వనస్థలిపురం వాటర్ ట్యాంక్ సమీపంలో నిర్మించనున్న నూతన హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయ భవన స్థలాన్ని పరిశీలించారు. సచివాలయ నగర్‌లో జరుగుతున్న థీమ్ పార్క్ పనులను సందర్శించి, పనులు నాణ్యత ప్రమాణాలతో కొనసాగించాలని అధికారులకు సూచించారు.

## ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్ష

సర్కిల్ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్ల పురోగతిపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత డిమాండ్ బకాయిలు, వసూళ్ల శాతంపై వివరాలు తెలుసుకున్నారు. బకాయి పన్నుదారులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి వార్డు వారీగా లక్ష్యాలను నిర్దేశించి, దినసరి సమీక్షల ద్వారా వసూళ్లను మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.వంశీకృష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ (హెల్త్) డాక్టర్ సూరజ్ కిరణ్ గౌడ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యుఎం) నీలిమ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు దినేష్ సింగ్, వెంకన్న, నర్సింగరావుతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌బినగర్ 'చట్నీస్‌లో పేలుడు




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎల్‌బినగర్‌లోని ఆర్కేపురం చట్నీస్ హోటల్లో శుక్రవారం పేలుడు సంభవించింది. భారీ శబ్దానికి వినియోగదారులు పరుగు లు తీశారు. ఈ ఘటనలో ముగ్గురు హోటల్ సిబ్బందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎల్ బి నగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. హైడ్రా సిబ్బంది, బాంబు స్క్వాడ్ బృందాలు పేలుడు సంభవించిన కిచెన్‌ను పరిశీలించారు. ఇడ్లీ స్టీమర్ వేడెక్కడంతోనే పేలుడు సంభవించిందా..?మరి ఇంకేమైనా కారణాలు ఉన్నాయా..!? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## 24న ఆర్‌టిసి జెఎసి చలో సెక్రటేరియట్




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఈ నెల 24న నిర్వహించే చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్‌టిసి జెఎసి నాయకులు, ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ అధ్యక్షుడు ఆమనగంటి వెంకన్న పిలుపునిచ్చారు. శుక్రవారం హయత్ నగర్ డిపో1, 2 వద్ద చలో సెక్రటేరియట్ పోస్టర్‌ను జెఎసి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమనగంటి వెంకన్న, జెఎసి రాష్ట్ర కో కన్వీనర్ కత్తుల యాదయ్య, రాష్ట్ర నాయకులు బుద్ద విశాల్ మాటాడుతూ చలో సెక్రటేరియట్‌కు ఆర్‌టిసి కార్మికులు భారీగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో చంద్రయ్య, మల్లారెడ్డి, దీవిరెడ్డి, పిఎస్ రావు, సత్యనారాయణ, బాల సింహం, పాషా, ఎస్విరెడ్డి, గుత్తాచారి, సంజన, అంతిరాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

## పాఠశాలకు మైక్‌సెట్ అందజేత



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–1986 చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం మైక్‌సెట్ అందజేశారు. పూర్వ విద్యార్థులు ఈనెల 8న ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకోని ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు అకాంక్షిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## రైతు భరోసా విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** యాసంగి రైతు భరోసా తక్షణమే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొంతం మాధవ రెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శుక్రవారంమంచాల మండలం ఆరుట్ల, మంచాలలో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు సభ్యత్వం కార్డులను అంద చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎల్లేష్, విజయ్, ముజీబ్, యాదయ్య, మల్లారెడ్డి, చంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

## కిన్నెర మొగులయ్యకు సన్మానం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** తెలంగాణ సంస్కృతిలో అరుదైన కళగా పేరుపొందిన 12 మెట్ల కిన్నెర గానాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్య అని వనస్థలిపురం పోలీస్ ఇన్స్‌పెక్టర్ టి. మహేష్ అన్నారు. శుక్రవారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో మొగులయ్యను ఘనంగా సన్మానించారు.

## నిధులు మంజూరుకు వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కార్పొరేటర్ల పదవీ కాలం పూర్తి కావడంతో వారి డివిజన్ అభివృద్ధికి ఎంపి నిధుల నుంచి మంజూరు చేయాలని మల్కాజ్గిరి ఎంపి ఈటెల రాజేందర్‌ను శుక్రవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కార్పొరేటర్లు కోరారు. బియన్ రెడ్డి నగర్ డివిజన్, హయత్ నగర్ డివిజన్ తాజా, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి,, నాయకులు పవన్‌రెడ్డి, రవిశంకర్, సురేష్ కుమార్‌పాల్గొన్నారు.

## డ్వాక్రా భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/కొందుర్గు:** మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామంలో మహిళా డ్వాక్రా భవన నిర్మాణానికి సర్పంచ్ బోయ అశోక్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేఖ, ఉపసర్పంచ్ దామోదర్‌రెడ్డి, వార్డు సభ్యులు కాశ యాదయ్య, నాగులపల్లి సునీత అశోక్ గౌడ్, డబ్బు రాకేష్, దేవునిపల్లి మల్లేష్, మరాఠీ సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, మరాఠీ మల్లేష్, షేగా శ్యాంసుందర్, చాకలి పాండు పాల్గొన్నారు.

# కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

పరుగులు పెట్టిన విద్యార్థులు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్/అమీర్‌పేట్:** కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో భయానక పరిస్థితి నెలకొంది. మంటలతో దట్టమైన పొగ వ్యాపిస్తుండటంతో పరిసరాల్లోని కోచింగ్ సెంటర్లు, కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల ప్రజలు భయంతో పరుగులు పెట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలను ఆర్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ ఘటన అమీర్‌పేట్ మైత్రివనం సమీపంలోని ఆదిత్య ఎంక్లేవ్ నీలగిరి బ్లాక్‌లో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ఆదిత్య ఎంక్లేవ్ నీలగిరి కాంప్లెక్స్‌లోని నాల్గవ అంతస్తులోని ఓ కోచింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటల కారణంగా దట్టమైన పొగ కాంప్లెక్స్ మొత్తం వ్యాపించింది. నాలుగవ అంతస్తులో కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు అందులో చిక్కుకుపోయారు. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం చేరవేశారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది, ఎస్‌ఆర్ నగర్ పోలీసులు ఘట నా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కోచింగ్ సెంటర్‌లోని దాదాపు 60మంది విద్యార్థులను నిచ్చెన సహాయంతో కిందికి దించారు. నీలగిరి బ్లాక్‌లోని షాపులను మూసివేయించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ప్యానెల్‌బోర్డులో షార్ట్ సర్క్యూట్ కావడంతో వంటలు చెలరేగినట్లు పోలీసులు తెలిపారు. అదృష్టవశాత్తు ఎవరికి ఎటువంటి హాని కలగలేదు. చాకచక్యంతో విద్యార్థుల ప్రాణాలను కాపాడిన ఆరుగురు యువకులను పోలీసులు ఈ సందర్భంగా అభినందించారు. ఘటన స్థలానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ చేరుకుని పరిస్థితి సమీక్షించి సహాయక చర్యలు చేపట్టేలా తోడ్పాటు అందించారు. రద్దీగా ఉండే అమీర్‌పేట్ ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో భయానక వాతావరణం నెలకొంది.



# మెరుగైన సేవలందించడమే లక్ష్యం

జలమండలి ఎండి అశోక్‌రెడ్డి



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** మెరుగైన సేవలను సమర్థవంతంగా అందించే విధంగా... క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించడం కోసం... ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకునే విధంగా జలమండలి బస్తీబాట ప్రారంభమయ్యింది. మొదటి రోజు జలమండలి ఎండి అశోక్‌రెడ్డి ఉదయం 6 గంటలకు శేరిలింగంపల్లి వార్డులోని శంకర్ నగర్, హుడా కాలనీ, దీప్తిశ్రీ నగర్, మియాపూర్ ప్రాంతంలో పర్యటించారు. శంకర్‌నగర్‌లో నీటి సరఫరా సమయంలో పలు ఇండ్లలో తనిఖీలు చేసి నీటి నాణ్యత గురించి స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే నీటిని వృథా చేస్తున్న విషయాన్ని గమనించి సం బంధిత యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరొకరు ఇంటిలో బోరు నీటిని మొక్కలకు, ప్రాంగణం కడగడం చూసిన ఎండి ఇంకుడు గుంత నిర్మించేంత ఖాళీ స్థలం ఉండటంతో ప్రాంగణంలోని వృథా నీటిని ఇంకుడు గుంతలోకి మళ్లించుకోవాలని సూచించారు. అనంతరం హుడా కాలనీలో సీవరేజ్ మ్యాన్ హోల్ డీసిల్టింగ్ పనులను పరిశీలించిన ఎండి మాన్‌హోల్‌లలో వెలువడ్డ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. రోడ్డుకు సమాంతరంగా లేని మ్యాన్ హోళ్ళను, ధ్వంసమైన మ్యాన్ హోళ్ళను గుర్తించి పునర్నిర్మాణం చేయమని సూచించారు. దానికి సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించమని చెప్పారు. ఈ సందర్భంగా ఎండి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. మెరుగైన సేవలు సమర్థవంతంగా తమ లక్ష్య మన్నారు. జలమండలి పరిధిలో తాగునీటి, మురుగునీటి సమస్యలు, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం కోసం జలమండలి బస్తీ బాట కార్యక్రమాన్ని రూపొందించిందని.. ఇందులో భాగంగా ఎండి నుంచి మేనేజర్ వరకు క్షేత్రస్థాయిలో పర్యటించడం జరుగుతుందని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి పేర్కొన్నారు.

# మైనారిటీలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని చింతలకుంటలోని జాంగిర్ నగర్ కాలనీలో మసీద్ ఈ ఫిర్దోస్ మసీదు, బిస్మిల్లా వెల్ఫేర్ సర్వీసెస్ ఓవర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పేద ప్రజలకు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మైనారిటీలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బిస్మిల్లా వెల్ఫేర్ సర్వీసెస్ ఫౌండర్ అంజాద్ ఖాన్, కైసర్, నవీద్, ముక్తార్, హకాని, అఫ్జల్ పాల్గొన్నారు.

# షాద్‌నగర్ మునిసిపాలిటీ అభివృద్ధికి పనిచేస్తా

చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** షాద్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి కంకణ బద్ధులై పని చేస్తామని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప వివరించారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, ఇందు కు ప్రజలందరు సహకరించాలని కోరారు. పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు నిరంతర విద్యుత్ ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. వీధి దీపాలకు సంబంధించిన మొదటి ఫైల్‌పై తొలి సంతకం చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు కనీస సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. తనపై నమ్మకం పెట్టి బాధ్యతలు అప్పగించినందుకు ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానన్నారు. వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజలు తమపై పెట్టుకున్న విశ్వాసానికి అదే నమ్మకంతో పనిచేస్తామని వివరించారు. బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్‌లను పలువురు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# నిరుపేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొత్తూరు:** గ్రామీణ నిరుపేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం కొత్తూరు, నందిగామ మండలాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటించి వివిధ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కొత్తూరు మండల పర్యటనలో భాగంగా హెచ్‌ఎండిఏ నిధులతో పెద్దగుట్ట తండాలో డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన, గిరిజన సంక్షేమ శాఖ నిధులతో గూడూరు నుండి పెద్దగుట్ట తండాకు బీటి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు వివరించారు. గూడూరు గ్రామంలో సిసి రోడ్డు, రూ.8లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన, హెచ్‌ఎండిఏ నిధులతో సిసిరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ నుండి గూడూరు వరకు బిటి రోడ్డు నిర్మాణం, రెడ్డిపాలెం గేట్ నుండి రాగ్యతండా వరకు బిటి రోడ్డు నిర్మాణం, రెడ్డిపాలెం గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, నాయకులు జంగ నర్సింహులు యాదవ్, చేగూరు సర్పంచ్ మంకాల శ్రీశైలం, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**కేశంపేట:** పేద ప్రజల సొంతింటి కలను నేరవేర్చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. గృహ ప్రవేశం చేయించి కుటుంబ సభ్యులకు చీరసారె పెట్టి ఎమ్మెల్యే వారిని ఆశీర్వధించారు. నిర్దవెల్లి గ్రామంలో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. పాటిగడ్డ గ్రామంలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కేశంపేట నుండి చెవులపల్లి రోడ్డు బ్రిడ్జి నిర్మాణాల మరమ్మత్తులకు శంకుస్థాపన చేశారు. బోదునంపల్లి గ్రామంలో కల్వర్టుకు భూమిపూజ చేశారు. సిసి రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేయడంతోపాటు కానునూరు గ్రామంలోని మహాలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో పందెం బండలాగుట పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేష్, మహిళా అధ్యక్షురాలు రాణి, సర్పంచులు కరుణాకర్‌రెడ్డి, చిన్న నరసింహా, జగదీశ్వర్, ఎదిరే నాగేశ్వర్, అఖిల్, నాయకులు తైదా పర్వతాలు, కొడూరు రాములు కోదూరు నరసింహా తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత...** సంతాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామాభివృద్ధి కోసం రంగారెడ్డి జిల్లా బిజెపి సాంస్కృతిక శాఖ కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అధ్వానంగా ఉందని, తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. శ్రీ పాలకాల లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయానికి విద్యుత్ సరఫరాను ఇస్తామని చెప్పి నేటి వరకు ఇవ్వలేదని పేర్కొన్నారు.

## పార్టీలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధి

**షాద్‌నగర్:** పార్టీలకతీతంగా మున్సిపాలిటీతని అభివృద్ధి చేస్తామని, ఇందుకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌గా అగ్గనూరి బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్‌గా అందె మోహన్ ముదిరాజ్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు కౌన్సిలర్లను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినంధించారు. వేద పండితుల ఆశీర్వాదం తీసుకొని నూతన పాలకవర్గం సభ్యులు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ నూతన పాలకవర్గం సభ్యులు బాధ్యతతో మెలుగుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. పాలకవర్గంలో ఎక్కువ శాతం యువకులే ఉన్నారని, మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హెచ్‌ఎండిఏ కమిషనర్‌తో మాట్లాడి షాద్‌నగర్ మున్సిపాలిటీకి ఎన్ని నిధులు కావాలో తెస్తామని తెలిపారు. ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ విశ్వం, కాంగ్రెస్ నేతలు కాశీనాథ్‌రెడ్డి, శివశంకర్ గౌడ్, రఘునాయక్, బాబర్‌ఖాన్, తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మహ్మద్ ఇబ్రహీంతోపాటు కౌన్సిలర్లు, నేతలు పాల్గొన్నారు.



# నేటినుండి నూతన డిసిసిలకు శిక్షణ

* పార్టీ జిల్లా అధ్యక్షులకు పదిరోజుల శిక్షణ
* హరిత రిసార్ట్స్ వేదికగా ట్రైనింగ్
* హాజరుకానున్న ఉమ్మడి ఎపి డిసిసిలు, అధ్యక్షులు, మల్లికార్జునకార్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్:** పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాల నుండి కొత్తగా ఎన్నికైన డిసిసిలకు శిక్షణ ఇవ్వనుంది. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంలోని ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రమైన అనంతగిరి గుట్టపై గల హరిత రిసార్ట్స్‌లో తేదీ 21నుండి ప్రత్యేక తరగతులునిర్వహిస్తున్నారు. జిల్లా బాధ్యులకు నైపుణ్యాలను అందించటం ద్వారా పూర్తిస్థాయి లీడర్లను తయారు చేయలన్నాదే పార్టీ లక్ష్యంగా కనిపిస్తుంది. ఇప్పటికే రిసార్టు లో పనులను జిల్లా నేతలతో కలిసి కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ సందర్శించి పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా ఎస్‌పి.స్నేహమెహ్రా సందర్శించి బందోబస్తు, ఏర్పాట్లపై సమీక్షించారు. గంతలో ఎప్పుడు లేని విధంగా కాంగ్రెస్ పార్టీ ఈసారి డిసిసి అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ గత సంప్రదాయానికి విరుద్ధంగా వినూత్నంగా నిర్వహించింది. ఎఐసిసి ఏర్పాటు చేసిన సంఘటన సృజన్ అభియన్ అబ్జర్వర్ల బృందం రాష్టంలోని అన్ని జిల్లాలను పర్యటించి పార్టీకి చెందిన అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించింది. పార్టీ నేతల సిఫారసులను పక్కన పెట్టి కమిటీ క్షేత్రస్థాయిలో సమాచారం ఆధారంగా జిల్లా అధ్యక్షులను ఎంపిక చేసింది. ఈ శిక్షణా తరగతులు సైతం సంఘటన్ సృజన్ అభియన్ విధివిధానాల ప్రకారమే నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ శిక్షణా తరగతులు ప్రముఖ రాజకీయ విశ్లేషకులు సచిన్ ఇవ్వనున్నారు.

ఈ నెల 21నుండి మర్చి 2వరకు క్లాసులు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులను స్వయంగా పరిశీలించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులు, అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి , డిసిసల విధులు బాధ్యతలు, పార్టీ బలోపేతం వంటి అంశాలపై పదిరోజుల శిక్షఇవ్వనున్నా రు. తెలంగాణ, ఏపికి చెందిన అన్ని జిల్లాల్లో అధ్యక్షులతో పాటు పార్టీ ముఖ్య నేతలు హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమ నిర్వహణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఎలాంటి లోటు పాట్ల కు తావు లేకుండా చూస్తున్నారు. హరిత రిసార్టులోని 36గదులు ఉండగా అన్నింటిని బుక్ చేసుకున్నారు. భోజనం, పార్కింగ్ ఏర్పాటు, సెక్యూరిటి తదితర అంశాలపై పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చూసుకుంటున్నారు. తెలంగాణలో అధికారం ఉన్న కారణంగానే ట్రైనింగ్ సెంటర్ ఇక్కడ ఎంచుకున్నట్లు తెలుస్తుంది. హైదరాబాద్ కు సమీపంలో ఉండటం ఆహ్లాదకరమైన వాతావరణం నేపథ్యంలో అనంతగిరి ఎంపిక చేసిన ట్లు తెలుస్తుంది. నేడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్లు తెలుస్తుంది.



## ప్రభుత్వ భూములు కాపాడండి

### అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి ఆకుల సతీష్ వినతి

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ గండిమైసమ్మ మండల పరిధిలోని ప్రభుత్వ భూములు కాపాడాలని ఆకుల సతీష్ పేర్కొన్నారు. దుండిగల్ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలని మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆకుల సతీష్ మాట్లాడుతూ, దుండిగల్ గ్రామ పరిధిలో సర్వే నెంబర్లు 322/2, 323/2, 324/2, 359/2, 360/2, 361/2, 362/2లో ల్యాండ్ రిఫార్మ్స్ చట్టం ప్రకారం ప్రభుత్వానికి వచ్చిన 48.8 ఎకరాల భూమిని ప్రణీత్ కన్‌స్ట్రక్షన్ నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించి చదును చేయడంతో పాటు కిర్బీ షీట్లతో ఫెన్సింగ్ వేసి అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపడుతోందనీ ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. అక్రమంగా వెంచర్ పేరిట ప్రజలకు అమ్మకాలు చేస్తున్నారని, కాబట్టి అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి, ప్రణీత్ కన్‌స్ట్రక్షన్‌పై క్రిమినల్ కేసు నమోదుచేసి, 48.8 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేసి రక్షించడంతో పాటు ప్రజా అవసరాలకు వినియోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.



## వేతనాలు చెల్లించిన నాయకులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇందిరా గృహకల్ప కాలనీలో గత మూడు నెలల క్రితం బిజెపి నాయకుల సహకారంతో ఏర్పడిన ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో 50 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాలనీవాసులు, నాయకులు డి నాథం,కె నర్సింగ్‌రావులను కలసి వాలంటీర్లకు వేతనాలు ఇవ్వాలని కోరారు. ప్రతి నెల 5 వేల రూపాయలు చెల్లించే వేతనాన్ని నాయకులతో కలసి అందించారు. అదే విధంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు, టీచర్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, వి రాంబాబు,రాజేష్ వంశరాజ్, రాపోలు సోమేశ్వర్,తదితరులుపాల్గొన్నారు.




## దోమల ఫాగింగ్ మిషన్లు వితరణ

**ప్రజాపక్షం/ఉప్పల్ :** రామంతాపూర్ డివిజన్ పరిధిలో దోమల తీవ్ర బెడదతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గంధం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా కొనుగోలు చేసిన రెండు కొత్త దోమల ఫాగింగ్ మిషన్లను ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ రాజుకు అందజేశారు. దోమల వల్ల వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ఈ ఫాగింగ్ మిషన్లు ఉపయోగపడతాయని, ప్రజల ఆరోగ్యం పరిరక్షణలో ఇది ఒక చిన్న సహకారమని జోత్స్నా నాగేశ్వరావు తెలిపారు. ప్రజా సంక్షేమమే తన ధ్యేయమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసి ఎంటమాలజీ ఎస్ఇ మాధవరెడ్డి, డిఇ సాయి తరుణ్, ఎఇ భారతి, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందజేస్తాం : ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** శుక్రవారం తాండూరు పట్టణ శివారులోని నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్స్ ఇళ్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలసి, స్థానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటి వరకు నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు కొనసాగు



తున్నాయని, కొన్ని గ్రామాలలో గృహప్రవేశాలు కూడా చేయడం జరిగిందని వివరించారు. పూర్తిగా మౌళిక సదుపాయాలు కల్పించిన వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో అర్హుల జాబితా సిద్ధం చేయడం జరుగుతుందన్ని తెలిపారు. నిరుపేదలు, ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడానికి ఖాళీస్థలం లేని అర్హులైన వారికి నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్స్‌ను కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరజా బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబుల్ రజాక్, కౌన్సిలర్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

**మాతా శిశు హాస్పిటల్ ఆకస్మిక సందర్శన..**

తాండూరు పర్యటనలో ఉన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలసిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాత శిశు హాసుపత్రిని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ఆసుపత్రిలో గల సమస్యలను, ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు, బాలింతలకు, మెరుగైన వైద్యం అందజేయాలని, వారికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రులలో అందించే వైద్య సేవలపై నమ్మకం కల్గించేలా సేవలు అందించాలని సూచించారు. వారి వెంట అదనపు కలెక్టర్ సుధీర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరాజబాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, డిసిఎచ్ఎస్ ఆనంద్, హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ వినయ్‌కుమార్, కౌన్సిలర్‌లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

# ఐసిఎంఎఐ ప్రాంతీయ సదస్సు ప్రారంభం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేటలోని లియోనియా రిసార్ట్స్‌లో కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్ వృత్తిని పునర్నిర్మించడమే లక్ష్యంగా ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మక రీజినల్ కాస్ట్ మెనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ కన్వెన్షన్ 2026 ను నిర్వహించారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాకు చెందిన సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ ఆద్వర్యంలో రెండు రోజులు జరుగనున్న ఈ సదస్సుకు ముఖ్య అతిదిగా విచ్చేసిన ఎన్విస్ చైర్మన్ ఐసిఎంఎఐ మాజి అధ్యక్షులు సిఎంఎ డాక్టర్ దుర్గాప్రసాద్ శుక్రవారం ప్రారంబించారు. సిఎంఎ వృత్తిని పునర్నిర్మించడం స్థిరిమైన విలువలను, వ్యూహాత్మక ప్రభావాన్ని పెంపొందించడం అనే ఇతివృత్తంతో జరుగనున్న ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి సుమారు 500 మందికి పైగా ప్రతినిధులు హజరయ్యారు. వీరిలో పరిశ్రమల అధిపతులు, విద్యావేత్తలు, విధానకర్తలు సిఎంఎ నిపుణులు ఉన్నారు. పనితీరులో అత్యుత్తమ ప్రమాణాలు బాద్యతయుతమైన వృద్ధి, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే లక్షణాలు పెంపొందించడంలో సిఎంఎ పాత్రను బలోపేతం చేయడంపై ఈ సదస్సు దృష్టి సారించింది. ఈ సందరగా ఎన్సిపి చైర్మన ఐసిఎంఎఐ మాజి అధ్యక్షులు సిఎంఎ డాక్టర్ దర్గాప్రసాద్ మాట్లాడుతూ సంస్థాగత పనితీరును మెరుగుపరుచడంలో దేశ నిర్మాణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో ఇంటిగ్రేటెడ్ కాస్ట లీడర్‌షిప్ అమలు డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం వంటివి అత్యంత కీలకమన్నారు. అనంతరం సిఎంఎ టిసిఎ శ్రీనివాస్‌ప్రసాద్ మాట్లాడుతూ వ్యూహాత్మక వ్యాపార భాగస్వాములుగా సిఎంఎ పాత్ర మారుతుందన్నారు. ఈఎస్జి (పర్యావరణం, సామాజిక పాలన) గవర్నెన్స్, వ్యాల్యూ ఇంజనీరింగ్ వంటి కీలక రంగాలలో నిపుణులు న్యాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిఎంఐఎ విజయ్‌కిరన్ అగస్త్య, ఎస్ఐఆర్సి ట్రెజరర్ సిఎంఎ కెవిఎన్ లావణ్య, ఐసిఎంఎఐ హైద్రాబాద్ చాప్టర్ చైర్మన్ సిఎంఎ ఖాజు జలాల్ ఉద్దీన్, ఎస్ఐఎఫ్ఎ మాజి అద్యక్షులు సిఎంఎఎన్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

## చిలుకానగర్ డివిజన్‌లో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుకానగర్ డివిజన్‌లో బిఆర్ఎస్‌కు రాజకీయ షాక్ తగిలింది. మాల, మాదిగ సంఘాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత పదేళ్లుగా సాగిన భారత రాష్ట్ర సమితి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పేరుతో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. హైకోర్టు కాలనీ సమీపంలోని సుమారు రూ.100కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా జరిగిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో రాంచర్ల బలరాం, కొంద్ర రాములు, కూరెల్లి యాదగిరి, మారేపాక సాయిలు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పర్వతాధిరోహకుడు తులసీ రెడ్డి మరెన్నో విజయాలు సాధించాలి : ఎమ్మెల్యే వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** పర్వతాధిరోహకుడు తులసీ రెడ్డి మరెన్నో విజయాలను సాధించాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పేట్‌బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బౌరంపేటకు చెందిన పర్వతాధిరోహకుడు పల్సునూరి తులసీ రెడ్డి ఎమ్మెల్యే వివేక్‌ని కలిశారు. రాబోవు ఏప్రిల్ మాసంలో తులసీ రెడ్డి ఎవరెస్ట్ శిఖర అధిరోహణ చేయనున్న సందర్భంగా వివేక్‌కి వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ అత్యున్నత శిక్షణ పొందుతూ పర్వతాధిరోహణలో ఎన్నో విజయాలు సాధించిన తులసీరెడ్డి రాబోవు కాలంలో మరిన్ని విజయాలను సాధించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా తులసీ రెడ్డి పేరు ప్రఖ్యాతలను తెచ్చుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పేరుని చాటాలని పిలుపునిచ్చారు. తులసీరెడ్డికి తనవంతు సంపూర్ణ మద్దతు, సహకారం ఎల్లవేళలా ఉంటుందని వివేక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



**ఫుడ్‌కోర్ట్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే వివేక్**

నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాంశీ ఫుడ్ కోర్ట్‌ని స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని ఫుడ్ కోర్ట్ అందించాలని అన్నారు. భోజన ప్రియులకు సరికొత్త రుచులను అందిస్తూ మరిన్ని ఫుడ్‌కోర్ట్‌ల బ్రాంచ్‌లను ప్రారంభించి దినదినాభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, నాయకులు దన్‌రాజ్ యాదవ్, రాఘవేంద్ర రావు, శ్రీనివాస్ రెడ్డి, మన్నెరాజు, సతీశ్, అజయ్,సాంబశివరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## పదవీ బాధ్యతలు స్వీకరించిన చైర్ పర్సన్ కమఠం శిరీష

### పూలబొకే, శాలువాతో సత్కరించి అభినందించిన డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్





**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్‌గా కమఠం శిరీషా కృష్ణారెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అలియాబాద్ పురపాలక సంఘం కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌లతో కలిసి నూతన చైర్మన్ శిరీషా కృష్ణారెడ్డి తన చాంబర్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. చైర్ పర్సన్‌గా బాధ్యతలు తీసుకుంటు రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. నూతన చైర్మన్ శిరీషా కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మాలతి మాధవరెడ్డిలను డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిలు ఆశీర్వదించారు. అనంతరం పదవీ బాధ్యతలు చేపట్టిన చైర్ పర్సన్ శిరీషా మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపల్‌లో ప్రజలకు కావాల్సిన మెరుగైన మౌళిక వసతులను కల్పించుటకు తనవంతు కృషి చేస్తానని చెప్పా రు. తాగునీరు, డ్రైనేజిలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తానని ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు శిరీషకు పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, అలియాబాద్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్, కౌన్సిలర్‌లు ముద్దం సుధాకర్ రెడ్డి, యూసుఫ్, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## నేడు వికారాబాద్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/వికారాబాద్:** నేడు వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే ఎఐసిసి శిక్షణ తరగతుల నిర్వహించే హరిత రిసార్ట్స్‌లో ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న సందర్భంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా ఎస్‌పి స్నేహమేహ్రా, ఇంటలిజెన్స్ సిఎం సెక్యూరిటీ వింగర్ ఎస్పి చటర్జీ కృష్ణ, డిఎస్‌పిలతో కలిసి హెలిప్యాడ్ ఏర్పాటు తదితర విషయాలపై అధికారులతో కలిసి చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపుకలెక్టర్ సుధీర్, రాజేశ్వరి, ఆర్‌డిఓ వాసుచంద్ర, మున్సిపల్ కమిషనర్ విక్రంనరసింహరెడ్డి, అర్ఎంబి అధికారిశ్రీధర్, వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మి నారాయణ, ఆర్టీవో వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఫాక్స్ సాగర్ వద్ద కెమెరాలను బిగించిన హైడ్రా

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఫాక్స్ సాగర్ నార్త్ ట్యాంక్ రక్షణకు హైడ్రా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నార్త్ ట్యాంక్ పరిసరాలలో హైడ్రా అధికారులు సిసి కెమెరాలు అమర్చారు. చెత్తా, వ్యర్థాలు డంపింగ్ చేయకుండా, కబ్జాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు హైడ్రా అధికారులు తెలిపారు.





## నూతన భవన నిర్మాణ స్థల పరిశీలన

**ప్రజాపక్షం/ఉప్పల్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్ల నిధులతో చేపట్టనున్న నూతన భవన నిర్మాణ పనుల స్థలాన్ని ఆయన మండల విద్యాశాఖ అధికారి రామారావు,మాజీ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్ రెడ్డి లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా రంగానికి కావాల్సినన్ని నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలతో భవనాలు నిర్మించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇదే తరహాలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిరీష, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ఆధ్యాత్మిక చింతనతో ప్రజలందరికి ప్రశాంతత నెలకొంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్‌లోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ద్వారశక్తి, వారాహి, మహాలక్ష్మి , సరస్వతి దేవీ అమ్మవార్లతో పాటు శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త, కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు లీడర్ నర్సింహా రెడ్డి, మాజీ ఎంపిటిసి బొర్ర చందు ముదిరాజ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అయినోలు సత్యనారాయణ చార్యులు, ఉపార్చకులు శాండిలియాతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం నుండి విచ్చేసిన స్వాములచే అంగరంగ వైభవంగా హోమాలు, పూర్ణాహుతి లు, అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి, నర్సింహారెడ్డి, చందులు మాట్లాడుతూ నిజాంపేట్ చౌరస్తా ఓ ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని, భక్తులతో నిత్యం నిజాంపేట్ కిటకిటలాడుతుందని అన్నారు. అమ్మవార్ల ఆశీస్సులతో ప్రజలందరికి సుఖఃసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని వేడుకున్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## అన్ని విధాల అభివృద్ధి చేస్తాం: చైర్‌పర్సన్ రజిత

**ప్రజాపక్షం/పరిగి :** మున్సిపల్‌లో అని విధాల అభివృద్ధి చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత తెలిపారు. 16,17వ వార్డుల్లో ఉన్న సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటించడం జరుగుతుందన్నారు. పరిగి మున్సిపల్‌లో ఎక్కడా సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.



## విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** రామంతపూర్ పెద్ద చెరువు ట్యాంక్ బండ్‌పై మహనీయులు, చరిత్రకారులు, పోరాట యోధుల విగ్రహాల ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో రామంతపూర్ లోని నెహ్రూనగర్ బద్దీపోచమ్మ గుడి నుండి పబ్లిక్ స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు, వివిధ కుల సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ దేశ సమగ్రతను కాపాడుటకు, యువతలో దేశభక్తి భావన పెంపొందించేందుకు మహనీయుల విగ్రహాల ఏర్పాటు అవసరమని పేర్కొన్నారు. విగ్రహాల ఏర్పాటు ద్వారా సేవాభావం, దేశభక్తి, స్ఫూర్తిదాయకమైన విలువలు పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ట్యాంక్ బండ్‌పై విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుమతి ఇవ్వకపోతే రామంతపూర్‌హబ్సిగూడ ప్రాంత ప్రజలతో కలిసి బంద్‌తో పాటు ప్రత్యేక ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గంలోని బిజెపి నేతలు, అన్ని కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
21-02-2026
www.prajapaksham.in

"పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలోని సెకండ్ సింగిల్ పాటను విడుదలకు ముస్తాబయింది. ఈనెల 22వ తేదిన ఈ పాటను విడుదల చేయనున్నారు."




# 'బూకి' ఫ్యామిలీకి కనెక్ట్ అయ్యే సినిమా

## నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ



అజయ్ దిషన్, ధనుషా హీరో హీరోయిన్స్ గా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బూకి'. విజయ్ ఆంటోనీ సమర్పణలో శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ సినిమా ఫిబ్రవరి 20న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. కథ మాత్రం బ్రేకప్‌తో మొదలవుతుంది. బ్రేకప్ తర్వాత ఇప్పటి టీనేజర్స్ ఎలా సఫర్ అవుతున్నారు? ఎలాంటి డిప్రెషన్ కి వెళ్తున్నారు? ఆ బాధను ఎలా హ్యాండిల్ చేస్తున్నారు? అనేది ఈ సినిమాలో ఆసక్తికరంగా చూపించడం జరిగింది. సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కావడం చాలా ఆనందంగా వుంది. దాదాపు 200కు పైగా స్క్రీన్స్ లో ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. 2012లో నేను తమిళ్ లో బ్యాక్ టు బ్యాక్ డిస్ట్రిబ్యూషన్ చేస్తుండే వాడిని. ఆయన మ్యూజిక్ డైరెక్టర్ గా ఉండే సమయం నుంచి నాకు పరిచయం. ఫస్ట్ హీరోగా చేస్తున్నప్పుడు మా ఆఫీస్ కి వచ్చి హీరోగా పరిచయం అవుతున్నానని చెప్పారు. వారి ఫస్ట్ సినిమా కూడా మేము తెలుగులో రిలీజ్ చేయడం జరిగింది. ఆయనతో మళ్లీ రీకనెక్ట్ అయి మంచి సినిమాలు చేయాలని ప్లాన్ చేసాము. మార్గాన్, భద్రకాళి సినిమాలు చేశాం. ఇప్పుడు బూకి వస్తుంది. అలాగే వందదేవుళ్ళు సినిమా చేస్తున్నాము. అది కూడా మేలో రిలీజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.విజయ్ అంటోని బ్యాగ్రౌండ్ స్కోరు సాంగ్స్ అద్భుతంగా ఉంటాయి. క్లైమాక్స్ చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టుకుంటారు. సీన్స్ అన్ని అంత అద్భుతంగా వచ్చాయి. మా బ్యానర్ సత్య దేవ్ తో ఒక సినిమా పూర్తయింది. అది తొందరలోనే రిలీజ్ చేస్తాం. అలాగే 100 దేవుళ్ళు సినిమా మేలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం.


# యస్ఎల్‌వి సినిమాస్ చిత్రం ప్రారంభం



మా ఊరి ప్రేమ కథ' చిత్రంతో హీరోగా పరిచయం అయిన మంజునాథ్.. తెలుగు చిత్ర పరిశ్రమలో గుర్తింపు తెచ్చు కోవాలని వరుసగా సినిమాలు చేస్తూ ఇండస్ట్రీలో దూసుకుపోతున్నారు. 'రౌడీ విక్రమ్', 'పక్కా ప్రేమికుడు', చిత్రాలు షూటింగ్ చివరి దశలో ఉండగానే మరొక చిత్రానికి శ్రీకారం చుట్టారు.. హీరో మంజునాథ్. శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి క్రియేషన్స్ పతాకంపై నూతన దర్శకుడు అభిరామ్ గంటా దర్శకత్వంలో టాలెంటెడ్ యాక్టర్ మంజునాథ్ హీరోగా వి. లక్ష్మి దేవి నిర్మిస్తోన్న ప్రొడక్షన్ నంబర్ వన్ చిత్రం ఫిబ్రవరి 19న హైదరాబాద్ సంస్థ కార్యాలయం లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి హీరో మంజునాథ్ క్లాప్ నివ్వగా డీవోపీ శేఖర్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సన్నివేశానికి చిత్ర దర్శకుడు అభిరామ్ గంటా గౌరవ దర్శకత్వం వహించారు.

అనంతరం హీరో మంజునాథ్ మాట్లాడుతూ. నేను హీరోగా నటించిన 'మా ఊరి ప్రేమకథ' చిత్రం మంచి హిట్ అయి హీరోగా నాకు మంచి పేరు తెచ్చింది. వెంటనే 'రౌడీ విక్రమ్' సినిమా అవకాశం వచ్చింది. ఆ చిత్రం షూటింగ్ చివరి దశలో వుంది. ఇదిలా ఉండగా మరొక చిత్రం 'పక్కా ప్రేమికుడు' సినిమా లో కూడా హీరోగా చేస్తున్నాను. ఈ చిత్రం తొంబై శాతం కంప్లీట్ అయింది. ఈ రెండు చిత్రాలు అండర్ ప్రొడక్షన్ లో ఉండగానే మరొక సినిమా చేసే అవకాశం వచ్చింది. అభిరాం గంటా చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. ఈ చిత్రంలో నేను ప్యాషన్ డిజైనర్ క్యారెక్టర్ లో నటిస్తున్నాను. అవుట్ అండ్ అవుట్ పక్కా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ చిత్రం ఇది. ఈ చిత్రంలో హీరోగా చేసే అవకాశం ఇచ్చిన నిర్మాత లక్ష్మీ దేవికి నా థాంక్స్ అన్నారు. చిత్ర దర్శకుడు అభిరామ్ గంటా మాట్లాడుతూ ఫస్ట్ నేను యూట్యూబర్ ని. ఆ తర్వాత కొన్ని వెబ్ సిరీస్ చేశాను. ఏప్రిల్ నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రంలో ప్రముఖ నటీ, నటులు, నటించనున్నారు. మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తాం అన్నారు.

# 'కల్ట్' ఫస్ట్ లుక్



మాస్ కా దాస్ విశ్వక్సేన్ మరోసారి బౌండరీస్‌ని దాటి ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌తో వస్తున్నారు. ఫలక్నుమా దాస్, దాస్ కా ధమ్కీ వంటి చిత్రాలతో హీరో, దర్శకుడు, నిర్మాత, రచయితగా ఆకట్టుకున్న విశ్వక్సేన్ ఇప్పుడు తన స్వీయ రచన, దర్శకత్వంలో కల్ట్‌తో రాబోతున్నారు. తారక్ సినిమాస్ బ్యానర్ పై సందీప్ కాకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారతదేశంలో తొలి స్లాషర్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ సినిమా టాలీవుడ్లో ఇప్పటివరకు చూడని కొత్త ప్రయత్నంగా నిలవనుంది. మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ను రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్లో విశ్వక్సేన్ సూట్ ధరించి, నోట్లో సిగరెట్తో ముందుకు నడుస్తూ కనిపిస్తున్నారు. అతని చేతిలో రక్తంతో తడిసిన గొడ్డలి ఉండగా, అతడు వేసే ప్రతి అడుగుతో రక్తం వ్యాపిస్తూ పోస్టర్కు డార్క్ టోన్ను తీసుకొచ్చింది. ఈ పోస్టర్ మొత్తం చూస్తే వైలెంట్, స్టైలిష్, బోల్ అనుభూతిని కలిగిస్తూ డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తోంది. ఈ చిత్ర టీజర్ను నేడు విడుదల చేయనున్నారు.

# అంచనాలను పెంచిన 'టాక్సిక్' టీజర్



రాకింగ్ స్టార్ యశ్ బర్త్ డే సందర్భంగా 'ఇంట్రడ్యూసింగ్ రాయ' అంటూ తన పాత్రను పరిచయం చేస్తూ రిలీజ్ చేసిన గ్లింప్స్ ఎంత సంచలనమయ్యిందో అందరికీ తెలిసిందే. కియారా అద్వానీ నాడియాగా, హుమా ఖురేషి ఎలిజబెత్గా, నయనతార గంగగా, తారా సుతారియా రెబెక్కాగా, రుక్మిణి వసంత్ మెల్లిసాగా అద్భుతమైన పాత్రల్లో కనిపించనున్నారు. వారి పాత్రలకు సంబంధించిన పోస్టర్స్కు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా శుక్రవారం టాక్సిక్ మూవీ టీజర్ విడుదలై అభిమానులను అలరిస్తోంది. టాక్సిక్ టీజర్ను కన్నడ, హిందీ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రిలీజ్ చేశారు. యశ్ పాత్రలో కనిపిస్తోన్న మార్పు కేవలం బయట కనిపించే లుక్ వరకే పరిమితం కాలేదు. ఇది మరింత లోతైన మార్పును సూచిస్తుంది. ప్రతి లుక్కు యశ్ ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్, కచ్చితమైన హావభావాలు జోడిస్తూ పాత్రలో పూర్తిగా లీనలమైనట్లు కనిపిస్తున్నారు. అలాగే ఆయన నటనలో కనిపిస్తున్న తీవ్రత, భావోద్వేగాలను గమనిస్తే..ఇవి ఆయన గత పాత్రలతో పోలిస్తే పూర్తిగా కొత్తగా, భిన్నంగా అనిపిస్తున్నాయి. హ 2026 మార్చి 19న రాబోతున్న టాక్సిక్ మూవీపై విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. యశ్, గీతు మోహన్దాస్ సంయుక్తంగా రాసిన ఈ కథని గీతు మోహన్దాస్ తెరపైకి తీసుకు వచ్చారు. 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్' కన్నడ, ఇంగ్లీష్ భాషలలో ఏక కాలంలో చిత్రీకరించారు. ఇక ఈ మూవీని హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, అనేక ఇతర భాషలలో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్ స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యశ్ నిర్మించారు.



గన్నవరం ఎయిర్ పోర్ట్‌లో వైయస్ జగన్, బ్రహ్మానందం ఆత్మీయ కలయిక

# 14 ఏళ్ల తర్వాత అయ్యప్ప శర్మ కొత్త లుక్



టాలీవుడ్ విలక్షణ నటుడు పూడి పెద్ది అయ్యప్ప శర్మ దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆయన తన సిగ్నేచర్ స్టైల్ను మార్చుకోవడం ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడూ పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో రఫ్ లుక్లో కనిపించే ఈ యాక్టర్, ఇప్పుడు క్లీన్ షేవ్ చేసి పక్కా పోలీస్ ఆఫీసర్లా మారిపోయారు. కన్నడలో తెరకెక్కుతున్న 'పబ్బార్' సినిమా కోసం ఆయన ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఇందులో అయ్యప్ప శర్మ ఒక పవర్ఫుల్ ఎస్పీ పాత్రలో నటిస్తున్నారు. దశాబ్ద కాలానికి పైగా ఒకే ఇమేజ్ను మెయింటైన్ చేసిన ఆయన, ఈ క్యారెక్టర్ డిమాండ్ చేయడంతో వెనకాడకుండా తన విజువల్ అప్పీల్ను పూర్తిగా మార్చేశారు. ఈ కొత్త లుక్ చూసి ఆయన అభిమానులు ఫిదా అవుతున్నారు. అయ్యప్ప శర్మ కెరీర్ గ్రాఫ్ గమనిస్తే ఆయన చేసిన విలన్ రోల్స్ ఒక రేంజ్లో ఉంటాయి. ముఖ్యంగా రూరల్ డ్రామాలు, ఫ్యాక్షన్ బ్యాక్డ్రాప్ సినిమాల్లో ఆయన నటన పీక్స్లో ఉంటుంది. ఆ కళ్ళలో ఉండే తీక్షణత, గంభీరమైన గొంతు ఆయనకు సెపరేట్ ఫ్యాన్ బేస్ను తెచ్చిపెట్టాయి. ప్రతి సినిమాలోనూ తనదైన మ్యానరిజమ్తో ప్రేక్షకులను భయపెట్టడమే కాకుండా మెప్పించారు. గతంలో ఆయన చేసిన పాత్రలన్నీ ఒక ఎత్తు, ఇప్పటి ఈ పోలీస్ రోల్ మరో ఎత్తు. 'కేజీఎఫ్' వంటి భారీ చిత్రాల్లోనూ తన ముద్ర వేసిన ఈ నటుడు ఇప్పుడు పొడుగు జుట్టు లేకపోయినా ఆయన ఆహార్యంలో ఆ గంభీరత్వం ఏమాత్రం తగ్గలేదని తాజాగా విడుదలైన ఫోటోలు చూస్తుంటే స్పష్టమవుతోంది. అయ్యప్ప శర్మ కేవలం నటుడిగానే కాకుండా, తన సోదరులైన సాయికుమార్, రవిశంకర్ల లాగే డబ్బింగ్ రంగంలోనూ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు 'పబ్బార్' మూవీతో ఆయన కెరీర్ మరో టర్న్ తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మాస్ విలన్గా మెప్పించిన ఆయన, ఖాకీ డ్రెస్ వేసి క్రిమినల్స్ అరాచకాలను ఎలా అడ్డుకుంటారో చూడాలి. ఈ సినిమా ఆయన సెకండ్ ఇన్నింగ్స్కు ఒక గట్టి పునాది వేస్తుందని ట్రేడ్ అనలిస్టులు భావిస్తున్నారు.

# సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)



చేస్తున్న రాష్ట్రాల్లో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు 2025 పేరుతో యూనివర్సిటీలను దెబ్బ తీసి ఉన్నత విద్యకు పేద వర్గాలను దూరం చేస్తోందని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్, విదేశీ యూనివర్సిటీలను అనుమతిస్తూ ప్రభుత్వ విద్యలో ఫీజులు పెంచి అందరికి అందుబాటులో లేకుండా చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. దేశంలో 90 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ అని, దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థివ్యతిరేక విధానాలపై నిరంతర విద్యార్థుల పక్షాన నిలుస్తూ ఉద్యమాలు చేస్తున్న సంఘం ఎఐఎస్ఎఫ్ అని, కేంద్రంలో అధికారంలో బిజెపి ప్రభుత్వం విద్యార్థుల తరగతి గదుల్లో మత విద్వేషాలు రెచ్చగొడుతూ విద్యార్థులను రాజకీయంగా ఓట్ల కోసం వాడుకుంటున్నారని తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులున్న తెలంగాణ విద్యార్థులకు కేంద్రం నుండి తీసుకవచ్చిందేమి లేదని మండిపడ్డారు. నిధులు విడుదలపై ఉపముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి కూడా గ్యారెంటీ లేకపోవడం విద్యా రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. ఈ మహాసభలో ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు మారయ్యగౌడ్, ప్యాట్రన్ రజినీ కాంత్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు పి.సుధాకర్, ఎఐటియుసి రాష్ట్రకార్యదర్శి వై.ఓమయ్య, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్‌బేరర్స్ ఇటుకెల రామకృష్ణ, రఘురాం, గ్యార నరేష్ రహమాన్, నాగజ్యోతి, గ్యార క్రాంతి, లెనిన్, రా జు, ప్రవీన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సు బోద్, జిల్లా సహాయ కార్యదర్శి కువాల్, కార్తీ క్, కోశాధికారి అనూష, నాయకులు హాసిని, కిషోర్, నిఖిల్, గౌతం, దిలీప్, ప్రవీన్, సోను, రాజ్, ఆకాష్, కృతిక్ విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం నాణ్యత లోపిస్తే కఠినచర్యలు

## పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్ : పేద ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యంలో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని గోదాం ఇన్‌చార్జీలకు సూచించారు. ఈ విషయంలో ఏమాత్రం రాజీ పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. బియ్యం సరఫరాకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్, అవుట్‌వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదాములో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ వారి పనివాతావరణం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ తనిఖీలో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె.సాయి అరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్‌చార్జీలు గోపాలకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సుంకాలు కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

వాదించినప్పటికీ, కాంగ్రెస్ స్పష్టంగా అలాంటి అధికారాన్ని ఐఇఇపిఎ కింద ఇవ్వలేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అందువల్ల ఐఇఇపిఎ చట్టం సుంకాలు విధించేందుకు అధ్యక్షుడికి అధికారం ఇవ్వదని కోర్టు తేల్చింది. ఈ తీర్పులో ముగ్గురు న్యాయమూర్తులు విభేదాభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే మెజారిటీ అభిప్రాయం ప్రకారం రాజ్యాంగంలో సుంకాలు నిర్ణయించే అధికారం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంది. కార్యనిర్వాహక శాఖ ఆ అధికారాన్ని విస్తరించి ఉపయోగించాలంటే, స్పష్టమైన శాసన ఆధారం అవసరమని కోర్టు అభిప్రాయపడింది. ఇది 'మేజర్ క్వశ్చన్స్ డాక్ట్రిన్' అనే న్యాయసిద్ధాంతంతో అనుసంధానంగా ఉంది. దేశవ్యాప్తంగా గణనీయమైన ప్రభావం చూపే విధానాలకు కాంగ్రెస్ స్పష్టమైన అనుమతి ఉండాలనే సూత్రాన్ని ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది. అయితే ఈ తీర్పు ట్రంప్ విధించిన అన్ని సుంకాలను రద్దు చేయలేదు. ఉక్కు, అల్యూమినియంపై వేరే చట్టాల ఆధారంగా విధించిన సుంకాలు యథాతథంగా కొనసాగుతాయి. కానీ రెండు ముఖ్య వర్గాలలో విధించిన సుంకాలకు ఇది వర్తిస్తుంది. వీటిలో మొదటిది దేశాల వారీగా విధించిన ప్రత్యుత్తర సుంకాలు. ఉదాహరణకు, చైనాపై 34% వరకు, ఇతర దేశాలపై కనీసం 10% వరకు సుంకాలు విధించారు. ఇక రెండవది కెనడా, చైనా, మెక్సికో దేశాల నుంచి వచ్చే కొన్ని వస్తువులపై 25% సుంకం. ఫెంటానిల్ మాదకద్రవ్య ప్రవాహాన్ని ఆయా దేశాలు ఆపలేకపోవడం వల్లే ఈ సుంకం విధించినట్టు ట్రంప్ ప్రభుత్వం పేర్కొంది. కానీ, సుప్రీం కోర్టు ఈ వాదనను తిరస్కరించింది. కాగా, ఈ తీర్పు వల్ల ఇప్పటికే సుంకాలు చెల్లించిన సంస్థలకు రీఫండ్ పొందే అవకాశం ఏర్పడవచ్చు.

# ఎసిబి వలలో కోర్టు సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

రెడ్ హ్యాండ్‌గా ట్టుకున్నట్లు వరంగల్ ఎసిబి డిఎస్‌పి సాంబయ్య తెలిపారు. గణపురం మండలం కరకపల్లికి చెందిన ఓ రైతు తనకు ఉన్న 14 ఎకరాల భూమిపై పక్కన ఉన్న అతను 1984లో సివిల్ దావా వేశారు. ఈ కేసు పలు దఫాలుగా కింది స్థాయి కోర్టులో కొనసాగి గత సంవత్సరం సెప్టెంబర్‌లో జిల్లా కోర్టు లోకి రావడం జరిగిందని తెలిపారు. ఫిర్యాదు దారునికి అనుకూలంగా జిల్లా కోర్టు తీర్పును ఇచ్చింది. ఈ తీర్పు కాఫీ కోసం ఫిబ్రవరి 10న అతను కోర్టుకు వచ్చి సర్టిఫైడ్ కాపీ కోసం కోర్ట్ సిబ్బంది రూ.20వేలు లంచం డిమాండ్ చేయడంతో అంత డబ్బులు ఇవ్వలేను అని చెప్పి వెళ్లి పోయాడు. మరుసటి రోజు మళ్లీ వచ్చి స్టెనోగ్రాఫర్‌తో మాట్లాడి 5 వేలు లంచం డిమాండ్ చేశారని తెలిపారు. దీంతో సదరు బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించగా రైతు వద్ద నుండి డబ్బులు తీసుకుంటుండగా ముగ్గురు కోర్ట్ సిబ్బందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని అరెస్టు చేసి శనివారం ఉదయం ఎసిబి కోర్టులో హాజరుపర్చనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిబి ఇన్‌స్పెక్టర్లు రాజు, ఎస్.రాజు, పి.ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.387.53 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, అంతర్గత రహదారుల మరమ్మతులు వంటి పనులకు ఈ నిధులను వినియోగించనున్నామని, కేంద్ర నిధుల ఆలస్యం కారణంగా కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఇబ్బందిగా మారాయని న్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. మిగిలిన పెండింగ్ నిధులను కూడా కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగాలంటే నిధుల సమయానుకూల విడుదల అత్యంత అవసరమన్నారు. ఇప్పటి వరకు విడుదలైన నిధులను సమర్థవంతంగా వినియోగించాలని, ముఖ్యంగా పెండింగ్ బిల్లుల చెల్లింపులను వెంటనే పూర్తి చేయాలని, అలాగే గ్రామాల్లో ప్రాధాన్యత కలిగిన మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, పారదర్శకతతో నిధుల వినియోగం, ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరే విధంగా చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి కట్టుబడి ఉన్నదని మంత్రి సీతక్క తెలిపారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com